www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 349

శుక్రవారం | 4-4-2025 | పేజీలు: 14

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: సప్తమి రా.8:13 తదుపరి అష్టమి, నక్షత్రం: ఆర్ద్ర తె.5:20 తదుపరి పునర్వసు, వర్జ్యం: మ.2:04 నుంచి మ.3:38 వరకు, దుర్ముహూర్తం: ఉ.8:37-ఉ.9:26, మ.12:42-మ.1:31, అమృతఘడియలు: రా.7:32-9:06, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:11, సూర్యాస్తమయం: 6:25

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌పై మిశ్రమ ప్రభావం

ఫార్మాకు మినహాయింపు పెద్ద ఊరట

మన ఎగుమతుల్లో 3వ వంతు ఫార్మాయే

ఆటోమొబైల్స్ మీదనే గట్టి ప్రభావం

ఇదే మంచి తరుణం

భారత్‌తో పోలిస్తే ఆసియాలోని పలు దేశాలపై ట్రంప్ అధిక సుంకాలు

అక్కడి నుంచి తరలివచ్చే ఎంఎన్‌సీలను ఆకర్షించేందుకు మనకు అవకాశం

అమెరికాకు మాంద్యం?

ప్రతీకార సుంకాలతో అసలుకే ఎసరు!

గతంలోనూ ఇలాగే స్మూతీహాలీ పేరుతో భారీగా సుంకాలు విధించిన అగ్రరాజ్యం

1930 నాటి మాంద్యానికి అదే కారణం

స్వదేశానికి వెళ్లొద్దు!

వెళ్తే తిరిగి వచ్చే చాన్స్ ఉండదు.. భారతీయ ఉద్యోగులకు అమెరికా కంపెనీల హెచ్చరిక

ట్రంప్ ఆంక్షలపై ఆందోళనలో భారత టెకీలు

డాక్యుమెంట్లు వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితి



26 కాదు.. 27 శాతం

భారత ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకం

అన్ని దేశాలపైనా కనీసం 10 శాతం టారిఫ్.. విదేశీ ఆటోమొబైల్స్ ఉత్పత్తులపై 25%

ఫార్మా, సెమీకండక్టర్స్, ఇంధన రంగాలకు సంబంధించిన ఉత్పత్తులకు మినహాయింపు

అమెరికా పన్నుచెల్లింపుదార్లు 50 ఏళ్లుగా దోపిడీకి గురయ్యారు.. ఇకపై అలా కుదరదు

మా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై అందులో సగమే వేస్తున్నాం: ట్రంప్

భారత్‌పై సుంకాల ప్రభావాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం: కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటన

ట్రంప్ ప్రకటనతో అమెరికా స్టాక్‌మార్కెట్ క్రాష్.. ఆవిరైన రూ.లక్షల కోట్ల సొమ్ము

వాషింగ్టన్, ఏప్రిల్ 3: తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ప్రతి దేశంపైనా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ప్రతీకార సుంకాలు' విధించారు! తమపై 52 శాతం సుంకాలు విధిస్తున్న భారతదేశంపై తాము అందులో సగం, అంటే 26 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. అయితే, ఆ తర్వాత వైట్‌హౌస్ వర్గాలు విడుదల చేసిన పత్రాల్లో.. భారత్‌పై విధించే సుంకం 27 శాతంగా పేర్కొనడం గమనార్హం. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వైట్‌హౌస్‌లోని రోజ్‌గార్డెన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ట్రంప్ ఈ సుంకాల ప్రకటన చేశారు. "అమెరికన్ ప్రజలారా.. ఇది (ఏప్రిల్ 2) మీరు

మిగతా 2వ పేజీలో...

ఔట్.. సోర్సింగ్!

'ఆప్కాస్' పేరుతో జగన్ మాయలు

ఎడాపెడా నియామకాలు

టీటీడీలోనే నాలుగు వేల మంది

ప్రక్షాళనపై కేబినెట్ భేటీలో చర్చ

ఆప్కాస్‌పై మంత్రివర్గ ఉపసంఘం

విశాఖ ఉక్కుకు రాష్ట్రం చేయూత

రూ.2,400 కోట్ల విద్యుత్ రాయితీ

ఐఏఎస్ అధికారులు పల్లెబాట పట్టాలి

3 రోజులు గ్రామాల్లోనే ఉండాలి

రుషికొండ భవనాలను సందర్శించండి

ఏం చేద్దామో చెప్పండి.. సీఎం సూచన



కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాడు అధికారంలోకి వచ్చీరాగానే వైఎస్ జగన్ 'ఆప్కాస్' పేరుతో విచ్చలవిడిగా ఔట్ సోర్సింగ్ నియామకాలు చేపట్టారు. వారంతా ఇప్పటికీ కొనసాగుతున్నారు. దీనిపై కూటమి సర్కారు దృష్టి సారించింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల కోసం వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్‌పై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని కేబినెట్‌లో నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. వైసీపీ హయాంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, అవసరం లేని చోట్ల కూడా అధిక సంఖ్యలో ఉద్యోగులను తీసుకున్నారని మంత్రులు అన్నారు. ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానాల్లో(టీటీడీ)నే సుమారు 4 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఈ స్థాయిలో అవసరమా

మిగతా 13వ పేజీలో...

అనకాపల్లి జిల్లాలో క్యాప్టివ్ పోర్టు

రూ.5,816 కోట్లతో నిర్మాణం

పోలవరం-బనకచర్ల కోసం 'జల హారతి' కార్పొరేషన్

710 కోట్ల హడ్కో రుణానికి గ్యారెంటీ

3 స్టార్ హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజు రూ.25 లక్షలకు కుదింపు

ప్రత్యేకంగా డ్రోన్ కార్పొరేషన్

ఫైబర్‌నెట్ నుంచి విడదీసి ఏర్పాటు

మంత్రివర్గ నిర్ణయాలు

జగన్ 'రివర్స్' దెబ్బ!

పోలవరంలో ఆదా అంటూ నాడు ఆర్భాటం

నేడు నష్టం, వ్యయం తడిసి మోపెడు

రూ.1,548 కోట్ల పనుల అంచనాలు రూ.4,637 కోట్లకు పెంపు

డయాఫ్రం వాల్‌కు 980 కోట్లు అదనం

కాంట్రాక్టు సంస్థ తొలగింపు ఫలితం

ఆర్బిట్రేషన్ ఆదేశాలతో నవయుగకు రూ.1735 కోట్ల పరిహారం



ఎస్‌బీఐని కాదని ప్రైవేటుకు

పోలవరం పరిహారం సొమ్ము 63 కోట్లు బదిలీ

తణుకు ప్రైవేట్ బ్యాంక్‌లో జమ

రైతులకు చెల్లించేందుకు జనవరిలో విడుదల

10 రోజుల్లో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం

రైతులకు ఇప్పటికీ చెల్లించని వైనం

పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నిర్వాకం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పైనా ఆరోపణలు

సొమ్ము బదిలీపై ఎన్నో అనుమానాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ శాఖలకు చెందిన సొమ్మును ఎక్కడా ప్రైవేట్ బ్యాంకుల్లో పెట్టవద్దని రెండు నెలల కిందట రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సీఎంవో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రత్యేక సర్క్యులర్ పంపింది. అయితే పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం అధికారులు సీఎం ఆదేశాలను బేఖాతరు చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిహారం సొమ్ము దాదాపు రూ.63 కోట్లను ఎస్‌బీఐని కాదని ప్రైవేట్ బ్యాంకుకు బదిలీ చేశారు. అదికూడా

మిగతా 13వ పేజీలో...

ముస్లింల హక్కుల పరిరక్షణకే బిల్లు



ఇందులో ముస్లిమేతరుల ప్రమేయం లేదు

బిల్లుపై 284 సంస్థలు అభిప్రాయాలు తెలిపాయి

కోటి మందికి పైగా వినతులు సమర్పించారు

అన్ని వర్గాలనూ సంప్రదించాకే బిల్లు తెచ్చాం

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి

రాజ్యసభలో వక్ఫ్ బిల్లుపై చర్చలో మంత్రి రిజిజు

అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ

ముస్లిం మహిళలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చిన కాంగ్రెస్

ట్రిపుల్ తలాక్ రద్దుతో వారిని ప్రధాన స్రవంతిలోకి తెచ్చిన మోదీ

వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకే బిల్లు: నడ్డా

ఇది రాజ్యాంగ విరుద్ధమైన బిల్లు: ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: వక్ఫ్ సవరణ బిల్లు-2024ను రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం బుధవారం అర్ధరాత్రి దాటాక లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. 288-232 ఓట్లతో బిల్లుకు ఆమోదం లభించింది. వక్ఫ్ సవరణ బిల్లు-2024 (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (ఉమీద్)'కు లోక్‌సభ ఆమోదం తెలపడంతో కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గురువారం

మిగతా 2వ పేజీలో...

తగ్గేదే లే..!



నాపై ఆరోపణల్ని రుజువు చేస్తే రాజీనామా చేస్తా

లేకపోతే అనురాగ్ ఠాకూర్ చేయాల్సిందే

రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్

2



25 వేలమంది టీచర్ల నియామకాలు రద్దు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మమత ప్రభుత్వానికి ఝలక్

నియామక ప్రక్రియంతా అవకతవకలేనన్న ధర్మాసనం 2

నోట్ల కట్టల జడ్జిని బదిలీ చేసినట్లు టీచర్లనూ చేయొచ్చుగా

ఇంతమందిని తొలగిస్తే పాఠాలు చెప్పేదెవరు?: మమత

నిందలు వేసి.. కుట్రలు

ప్రవీణ్ మృతి నుంచి లబ్ధికి వైసీపీ ప్రయత్నం

నాడు బాబాయ్‌పై గొడ్డలి వేటు, కోడి కత్తి డ్రామాలు

ఎదుర్కోలేకపోయాం.. ఇప్పుడైనా గట్టిగా తిప్పికొట్టాలి

సోషల్ మీడియా వినియోగంలోనూ చాలా వెనుకబడ్డాం

మన పోస్టులను వాళ్లు వక్రీకరిస్తున్నారు.. వెంటనే స్పందించకుంటే జనం వాటినే నమ్మే ప్రమాదం 13

4 రెట్లు సంక్షేమం చేస్తున్నా చెప్పుకోలేకపోతున్నాం: సీఎం



తప్పులు చేయబట్టే... జగన్ ప్రజల్లో తిరగలేకపోతున్నారు

తప్పుడు ప్రచారాలను ఆపేందుకే రెడ్‌బుక్ మాట

ప్రవీణ్ మృతిపై పారదర్శక దర్యాప్తు: లోకేశ్

తల్లీచెల్లి మోసం చేశారు



దొంగ పత్రాలు సృష్టించి సరస్వతీ పవర్ షేర్లు బదిలీ చేసుకున్నారు

వారిపై ప్రేమ, అభిమానం పోయాయి

ఇప్పుడు గిఫ్ట్ ఇవ్వాలనుకోవడం లేదు

ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నాను

చెల్లి పట్ల తల్లి పక్షపాతం చూపిస్తోంది

షేర్లు, బదిలీ పత్రాలు నా వద్దే ఉన్నాయి

ఈడీ జప్తు చేసిన ఆస్తులపై స్టేటస్ కో ఉంది

ఎన్సీఎల్టీలో జగన్ వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ షేర్ల బదిలీ విషయంలో తన తల్లి వైఎస్ విజయలక్ష్మి, చెల్లి వైఎస్ షర్మిల మోసం చేశారని మాజీ సీఎం జగన్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. షేర్లు బదిలీ చేసుకోవడం కోసం తప్పుడు తేదీలతో దొంగ పత్రాలు సృష్టించారన్నారు. తమకు తెలియకుండానే తమ పేరిట ఉన్న 51 శాతం వాటాను బదిలీ చేసుకున్నారని, ఈ బదిలీని రద్దుచేసి తమ వాటా తమకే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జగన్, భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీ హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ)లో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ పిటిషన్‌పై రాజీవ్ భరద్వాజ్, సంజయ్ పూరితో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ తరఫున సీనియర్ న్యాయవాది, వైసీపీ రాజ్యసభ ఎంపీ ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'మా మధ్య సంబంధాలు బాగున్నప్పుడు ప్రేమ, అభిమానంతో సరస్వతీ పవర్‌లో షేర్లు బహుమతిగా ఇచ్చేందుకు ఎంవోయూ జరిగింది. సదరు ఎంవోయూ షరతులతో కూడిన ఒక ఒప్పందం. అక్రమాస్తులకు సంబంధించి

మిగతా 14వ పేజీలో...

మిథున్‌రెడ్డికి చుక్కెదురు 14

హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

పరిటాల రవి హత్య వెనుక జగన్ హస్తం



కారు, సూట్ కేసు బాంబుల గురించి ఆయనకు బాగా తెలుసు

45 హత్యలకు సమాధానం చెప్పి జిల్లాలో అడుగుపెట్టాలి

ఒక్క లింగమయ్య కుటుంబాన్నే కాదు.. తోపుదుర్తి సోదరుల బాధితులనూ పరామర్శించాలి

జగన్‌పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం 14

అధికారులకు అవినాశ్ బెదిరింపులు

తప్పుడు రిపోర్టుపై బలవంతంగా సంతకాలు

వివేకా కేసులో సాక్ష్యాల తారుమారు

బెయిల్‌పై ఉండటంవల్లే ఇదంతా చేస్తున్నారు

ఆయన బయట ఉండగా న్యాయం జరగదు

సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోతున్నారు 14

సునీతను ఏమైనా చేస్తారేమో అని భయంగా ఉంది: షర్మిల



మన ఆస్తులు ప్రకటిద్దాం! 2

చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టు జడ్జీల నిర్ణయం

ఆ వెంటనే ఆదాయ వివరాల్ని ప్రకటించిన సీజే

మరో నలుగురు న్యాయమూర్తులు కూడా..

రామానాయుడు స్టూడియోలో 15.17 ఎకరాలు వెనక్కి

ఆ భూములు దుర్వినియోగమైనట్టు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 12

స్టూడియోకు 2003లో 34 ఎకరాల భూమి

నిర్మాణం చేయగా మిగిలిన ఖాళీ భూములపై గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దల కన్ను

ఆ భూముల్లో అక్రమంగా లేఅవుట్



రామానాయుడు స్టూడియో ఏరియల్ వ్యూ

ఈపీఎఫ్ విత్‌డ్రా మరింత సులువు

ఇకపై క్యాన్సిల్డ్ చెక్ అప్‌లోడ్ అవసరం లేదు

బ్యాంకు ఖాతాకు కంపెనీ ధ్రువీకరణ అక్కర్లేదు

క్లెయిమ్‌ల వేగవంతానికి ఈపీఎఫ్‌వో చర్యలు 2

30 వేల కోట్ల మద్యం తాగారు

రోజుకు రూ.83 కోట్ల విలువైన 78,676 కేసుల అమ్మకం

2024-25లో పెరిగిన విక్రయాల జోరు 12

కర్నూలులో అత్యధికం.. నెల్లూరులో అత్యల్పం

వినియోగదారులపై బాగా తగ్గిన లిక్కర్ భారం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేటి నుంచి స్లాట్ బుకింగ్ 12

మనకిదే మంచి తరుణం

» ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తేనే ప్రయోజనాలు: జీటీఆర్ఐ నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ట్రంప్ విధించిన సుంకాలను పరిశీలిస్తే.. ఆసియాలోని ఇతర దేశాలన్నింటికన్నా భారత్‌పై విధించిన సుంకాలే తక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలోనూ ట్రంప్ సర్కారు చైనా ఉత్పత్తులపై రెండు విడతలుగా 20 శాతం సుంకం విధించింది. తాజాగా విధించిన 34 శాతాన్ని కూడా కలుపుకొంటే.. చైనా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 54 శాతానికి చేరుకుంటాయి. ఈ నేపథ్యంలో.. భారత ప్రభుత్వం గనక సరైన వ్యూహంతో వ్యవహరిస్తే చైనా నుంచి ఇతర దేశాలకు తరలి రావాలనుకునే బహుళ జాతి కంపెనీలను (ఎంఎన్‌సీ) భారత్‌కు ఆకర్షించేందుకు ఇది ఎంతో ఉపకరిస్తుందని భావిస్తున్నారు. గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం.. మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఉత్పత్తుల్లో ఆసియాలోని ఇతర దేశాలతో సమానంగా 25 శాతం సుంకాలు పడేది.. స్టీలు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ ఉత్పత్తులపైనే. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తుల్లో అత్యధికం.. ఫార్మా ఉత్పత్తులు. తాజా పెంపులో ట్రంప్ వాటిని మినహాయించారు. ఇక మిగిలిన ఉత్పత్తులపై 27% సుంకాలు పడతాయి. కానీ వాటి విషయంలో ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే మనమే మెరుగైన పరిస్థితిలో ఉన్నందున ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించి మేకిన్ ఇండియాకు ఊతమిస్తే అమెరికాకు మన ఎగుమతుల వాటాను గణనీయంగా పెంచుకోవచ్చని జీటీఆర్ఐ తన నివేదికలో అభిప్రాయపడింది. ఎలక్ట్రానిక్స్ స్మార్ట్‌ఫోన్ రంగాల్లో కూడా భారత్‌కు మంచి అవకాశాలు ఉంటాయి. ఈ రంగంలో ప్రధాన పోటీదారులైన వియత్నాం, థాయ్‌లాండ్‌పై విధించిన సుంకాలు.. భారత్‌పై విధించిన సుంకాల కన్నా ఎక్కువ. ఉత్పత్తి ఆధారిత ఇన్సెంటివ్ స్కీమ్ వంటివాటి ద్వారా భారత్‌లో ఇప్పటికే యాపిల్, శాంసంగ్ వంటి సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. ఇప్పుడీ సుంకాల ప్రయోజనాన్ని కూడా అందుకోగలిగితే.. మన ఎలక్ట్రానిక్స్ సప్లై చైన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చని జీటీఆర్ఐ సూచించింది. ఇక.. సెమీకండక్టర్ల రంగానికి వస్తే అందులో ప్యాకేజింగ్, టెస్టింగ్, ఫ్యాబ్రికేషన్ వంటి దిగువ స్థాయి సెగ్మెంట్లలో సామర్థ్యాన్ని పెంచుకుంటే భారత్‌కు ప్రయోజనం అని జీటీఆర్ఐ పేర్కొంది.

భారత్‌ది వికాసవాదమే: మోదీ

బ్యాంకాక్, ఏప్రిల్ 3: భారత్ అభివృద్ధిని ఆకాంక్షించే వికాసవాదాన్ని నమ్ముతుందే తప్ప, విస్తరణవాదాన్ని కాదని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత, చట్టబద్ధ వ్యవస్థ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. థాయ్‌లాండ్ పర్యటనకు వచ్చిన ఆయన గురువారం థాయ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఆమెతో జరిపిన చర్చల్లో భారత్-థాయ్‌లాండ్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉండాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు-థాయ్‌లాండ్‌ల మధ్య పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు, విద్యా రం గాల్లో సహకారం పెంపొందింపచేసుకోవాలని నిశ్చయించినట్టు తెలిపారు. భారత్ అమలు చేస్తున్న 'లుక్ ఈస్ట్ పాలసీ', ఇండో-పసిఫిక్ విజన్‌లో థాయ్‌లాండ్‌కు ప్రత్యేక స్థానం ఉందని వివరించారు.

26% కాదు..27%

(మొదటిపేజీ తరువాయి)

చాలాకాలంగా ఎదురుచూస్తున్న విముక్తి దినం. అమెరికన్ పరిశ్రమలు పునర్జన్మించిన రోజుగా, మన భవితవ్యాన్ని మనం పొందిన రోజుగా, అమెరికాను మళ్లీ సుసంపన్నదేశంగా మార్చే ప్రక్రియను మొదలుపెట్టినరోజుగా చరిత్రలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుంది." అంటూ మొదలుపెట్టి వివిధ దేశాలు అమెరికాపై ఎంతెంత సుంకాలు విధిస్తున్నదీ వివరించారు. అమెరికాతో వాణిజ్యసంబంధాలున్న అన్ని దేశాలపైనా కనిష్ఠంగా 10 శాతం సుంకం విధించిన ట్రంప్.. తమపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై 10 శాతానికి మించి టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించారు. చైనాపై 34% (ఇప్పటికే విధించిన 20 శాతంతో కలిపి మొత్తం 54 శాతం), యూరోపియన్ యూనియన్ దేశాలపై 20 శాతం, వియత్నాంపై 46%, థాయ్‌ల్యాండ్‌పై 36%, కంబోడియాపై 49%, తైవాన్‌పై 32%, జపాన్‌పై 24%, బంగ్లాదేశ్‌పై 37%, పాకిస్థాన్‌పై 29%, శ్రీలంకపై 44%.. ఇలా పలు దేశాలపై భారీగా సుంకాలు విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇన్నాళ్లుగా అధిక సుంకాలతో చాలా దేశాలు అమెరికాను దోచుకున్నాయని ఆరోపించారు. కానీ తాము మాత్రం చాలా దయగా వ్యవహరిస్తున్నామని.. ఆయా దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో సగం మాత్రమే విధిస్తున్నామని పేర్కొన్నారు. అమెరికా పన్నుచెల్లింపుదారులు 50 ఏళ్లకు పైగా ఈ దోపిడీకి గురయ్యారని, ఇకపై అలా జరగదని.. ఇన్నాళ్లుగా జరుగుతున్న ఈ అన్యాయానికి అడ్డుకట్ట వేసి, అమెరికా ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చేందుకే ఈ సుంకాలను విధిస్తున్నట్టు ఆయన తెలిపారు. విదేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని కార్లపైనా 25 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఫార్మా, సెమీకండక్టర్లు, ఇంధన రంగాలకు సంబంధించిన ఉత్పత్తులను పూర్తిగా మినహాయించారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం (ఏప్రిల్ 5) అర్ధరాత్రి 12.01 గంటల నుంచి బేస్‌లైన్ సుంకం 10% అమల్లోకి వస్తుందని, ఆ తర్వాత దేశాలవారీగా విధించిన అదనపు సుంకాలు ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచీ అమలవుతాయని వైట్‌హౌస్ వర్గాలు వివరించాయి. అమెరికాకు అధికంగా ఎగుమతులు చేస్తూ, అక్కడి ఉత్పత్తులను తక్కువగా దిగుమతి చేసుకునే దేశాలపై ప్రభావం భారీగా ఉండేలా అమెరికా ఈ సుంకాలను విధించినట్టు ఆర్థిక నిపుణులు వెల్లడించారు.

స్నేహితుడేగానీ..

తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఒక్కొక్క దేశం గురించి చెబుతూ వచ్చిన ట్రంప్.. ఇండియా పేరు రాగానే మోదీ గురించి ప్రస్తావించారు. భారత ప్రధాని (మోదీ) తనకు గొప్ప స్నేహితుడేగానీ.. భారత్ అమెరికాతో సరిగ్గా వ్యవహరించట్లేదని, ఇదే విషయాన్ని తాను మోదీతో కూడా చెప్పానని వెల్లడించారు. భారత్ తమపై 52 శాతం సుంకాలు విధిస్తోందని.. కానీ, అమెరికా కొన్ని దశాబ్దాలుగా భారత్ ఉత్పత్తులపై పెద్దగా సుంకాలే విధించట్లేదని పేర్కొన్నారు. భారత్‌పై ట్రంప్ ప్రకటించిన 26 శాతం సుంకం.. మొత్తం భారత ఉత్పత్తులపై విధించే సగటు టారిఫ్. ప్రత్యేకంగా ఏ రంగంపై/ఏ ఉత్పత్తులపై ఎంత సుంకం విధించేదీ వివరాలు తెలపలేదు. కాగా.. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాన్ని



జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు కేంద్ర వాణిజ్యశాఖ, ఆర్థిక శాఖ వెల్లడించాయి. దీనిపై దేశీ పరిశ్రమలు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములందరితో చర్చలు జరుపుతున్నామని వాణిజ్య శాఖ ఒక అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించింది. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల నిమిత్తం అమెరికాతో కలిసి సన్నిహితంగా పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ఇక.. ట్రంప్‌కు అమెరికా ముఖ్యమైతే, ప్రధాని మోదీ ప్రథమ ప్రాధాన్యం భారతదేశమేనని, ఈ నేపథ్యంలో సుంకాల ప్రభావాన్ని జాగ్రత్తగా అంచనా వేస్తున్నామని కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు.

భారత్‌పై మిశ్రమ ప్రభావం

ట్రంప్ తన సుంకాల నుంచి ఫార్మా రంగాన్ని మినహాయించడం భారత్‌కు పెద్ద ఊరట. ఎందుకంటే మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఉత్పత్తుల్లో దాదాపు మూడోవంతు వాటా ఫార్మా రంగానిదే! అమెరికాకు అవసరమైన జనరిక్ ఔషధాల్లో 40 శాతం మనదేశం నుంచే ఎగుమతి అవుతాయి. ఆ ఉత్పత్తుల విలువ ఏకంగా 8.7 బిలియన్ డాలర్లు. అంటే దాదాపుగా రూ.75 వేల కోట్లకు పైమాటే. ఈ రంగాన్ని మినహాయించడమంటే మన ఎగుమతుల్లో మూడో వంతుపై ఎలాంటి సుంకాలూ లేనట్టే. తర్వాతి స్థానంలో రత్నాలు, ఆభరణాలు ఉంటాయి. అమెరికాకు మన ఎగుమతుల్లో దాదాపు 30% దాకా ఈ రత్నాలు, ఆభరణాలు ఉంటాయి. ఈ ఎగుమతుల విలువ కూడా దాదాపుగా రూ.72 వేల కోట్ల దాకా ఉంటుందని అంచనా. వీటిపై సుంకాలు పెంచినా.. వాటి విలువ ఎప్పటికప్పుడు పెరిగేదే కాబట్టి, ఎగుమతులు తగ్గినా ఆదాయం గణనీయంగా తగ్గకపోవచ్చని అంచనా. ఈ రెండు రంగాల పరిస్థితి ఇలా ఉండగా.. ఆటోమొబైల్స్‌పై ట్రంప్ విధించిన సుంకాల భారం మాత్రం భారత్‌పై బాగానే ప్రభావం చూపించవచ్చనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. అమెరికాకు మన ఎగుమతుల్లో 16 శాతం.. ఆటోమొబైల్ ఉత్పత్తులదే. ఏటా సగటున దాదాపు రూ.21 వేల కోట్ల విలువైన కార్ల విడిభాగాలు మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతాయి. తాజా సుంకాలతో ఈ రంగంలో మాత్రం నష్టాలు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే అమెరికాకు మన ఎగుమతుల్లో 7% వాటా జౌళి రంగానిది. ఏటా దాదాపు రూ.42 వేల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతాయి. తాజా సుంకాలతో ఈ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. కానీ.. ఈ రంగంలో మనకు పోటీ బంగ్లాదేశ్, వియత్నాం. వాటిలో వియత్నాంపై 46%, బంగ్లాదేశ్‌పై 37% సుంకాలను ట్రంప్ విధించారు. ఫలితంగా ఆయా దేశాల కంటే మన ఉత్పత్తులే చౌకగా అమెరికన్లకు అందుబాటులో ఉంటాయి. కాబట్టి మన టెక్స్‌టైల్ ఎగుమతులు పెరిగే అవకాశమే ఉంటుంది తప్ప తగ్గవు.మొత్తమ్మీద.. తాజా సుంకాల ప్రభావం భారత్‌పై మిశ్రమంగా ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

రష్యాకు ఎందుకు వదిలేశారు?

అమెరికాతో వాణిజ్య బంధం ఉన్న అన్ని దేశాలపైనా సుంకాల పెంపును ప్రకటించిన ట్రంప్.. ఆ జాబితాలో రష్యా, ఉత్తరకొరియా, క్యూబా, మెక్సికో, కెనడా, బెలారస్ దేశాలను మాత్రం చేర్చలేదు. దీనికి కారణమేంటి? అంటే.. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్‌పై ఇప్పటికే పలు ఆంక్షలు విధించామని, ఆ దేశంతో వాణిజ్యం చాలా తక్కువగా ఉందని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ చెప్పారు. అందుకే రష్యాను ఈ జాబితాలో చేర్చలేదన్నారు. అయితే.. ఉక్రెయిన్‌లో అరుదైన నిక్షేపాలను సొంతం చేసుకునే ఆలోచనలో ఉన్న ట్రంప్, అందుకు పుతిన్ సహకారం తీసుకునే యోచనలో ఉన్నారు కాబట్టే రష్యాపై సుంకాలు విధించలేదనే వాదన కూడా వినపడుతోంది. ఇక.. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ ఇప్పటికే 25% సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఉత్తరకొరియా, క్యూబా దేశాలపై ఇప్పటికే పలు ఆంక్షలున్నందున వాటిపైనా సుంకాలు విధించలేదని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.

14 దేశాల సుంకాల్లో తేడాలు!

భారతదేశంపై 26% సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించగా... ఆ తర్వాత వైట్‌హౌస్ దీనికి సంబంధించి విడుదల చేసిన అనుబంధ పత్రంలో మాత్రం 27% సుంకం విధించనున్నట్టు ఉంది. ఒక్క భారత్ విషయంలోనే కాక.. మరో 13 దేశాల విషయంలోనూ ఈ తేడా కనిపించింది. ఉదాహరణకు.. దక్షిణకొరియాపై 25% సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించగా వైట్‌హౌస్ అనెక్సర్‌లో అది 26 శాతంగా ఉంది. ఇదే తరహాలో బోట్సువానా, కామెరూన్, మలావీ, నికరాగువా, నార్వే, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, సెర్బియా, దక్షిణాఫ్రికా, థాయ్‌ల్యాండ్, వనువాటు, ఫాక్‌లాండ్ ఐలండ్స్‌పై సుంకాల్లో ఈ తేడాలు కనిపించాయి. అలాగే.. వివిధ దేశాల ఆధీనంలో ఉన్న భూభాగాలపై విధించే సుంకాలను కూడా తొలుత వైట్‌హౌస్ తమ చార్టుల్లో పొందుపరచింది. కానీ, తర్వాత విడుదల చేసిన అనెక్సర్‌లో ఆ భూభాగాల వివరాలే లేకపోవడం గమనార్హం.



అమెరికాకు మాంద్యం ముప్పు?

» ప్రతీకార సుంకాలతో అసలుకే ఎసరు!

» గతంలోనూ ఇలాగే స్మూత్‌హాలీ పేరుతో భారీగా సుంకాలు విధించిన అగ్రరాజ్యం

» 1930నాటి మాంద్యానికిదే కారణం

ట్రంప్ సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరోసారి మాంద్యం బారిన పడే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. దిగుమతుల నుంచి తన ఆర్థిక వ్యవస్థను రక్షించుకునే పేరుతో అమెరికా గతంలోనూ 'స్మూత్-హాలీ' పేరుతో ఇలాగే దిగుమతులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. 1930నాటి మహా ఆర్థిక మాంద్యానికి అదే ప్రధాన కారణమని ఆర్థికవేత్తలు చెబుతారు. ఇప్పుడు ట్రంప్ తన చర్యలతో అలాంటి మాంద్యానికి బీజాలు వేస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతీకార సుంకాల విధింపు రోజును ట్రంప్ 'విమోచన దినోత్సవం'గా ప్రకటిస్తే ఆర్థికవేత్తలు మాత్రం 'మాంద్యం దినోత్సవం'గా పరిగణిస్తున్నారు. అమెరికా జీడీపీ వృద్ధి రేటు ఇప్పటికే పడకేసింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 2% దిగువకు తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు ఈ సుంకాలతో ఇది మరింత కోరలు చాచే ప్రమాదం కనిపిస్తోంది. అదే జరిగితే వడ్డీ రేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడ్ రిజర్వు ఫుల్‌స్టాప్ పెట్టినట్టే. అమెరికా ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలు తోడవడంతో అమెరికా మరోసారి మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అదే జరిగితే ఆ ప్రభావం చైనా, భారత్, జపాన్, యూరప్ దేశాలపైనా పడే ముప్పుంది. 2008నాటి అమెరికా ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసింది. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఈ ఏడాది, వచ్చే ఏడాది ప్రపంచ ఎగుమతుల వృద్ధిరేటు 1.3శాతం మించకపోవచ్చని హెచ్‌ఎస్‌బీసీ రీసెర్చ్ హెచ్చరించింది. ట్రంప్ మన ఐటీ సేవల ఎగుమతులపై ప్రతీకార సుంకాలు విధించలేదు. అయితే వివిధ ఉత్పత్తులపై విధించిన సుంకాలతో అమెరికా మాంద్యంలోకి వెళ్లే ప్రమాదమో కనిపిస్తోంది. ఇది భారత ఐటీ పరిశ్రమను వణికిస్తోంది.

మన ఆస్తులు ప్రకటిద్దాం!

» చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టు జడ్జీలందరి నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టులోని న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలని నిర్ణయం తీసుకున్నారు. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి తమ ఆస్తుల వివరాలు ప్రకటించారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆస్తుల వివరాలు వెల్లడించాలని ఈ నెల 1న జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో తీర్మానం చేశారు. అంతకుముందు... 1997లో చేసిన తీర్మానం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందించాల్సి ఉంది. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను బహిర్గతం చేయాలంటూనే.. దానిని తప్పనిసరి చేయకుండా, జడ్జిల ఇష్టానికే వదిలేస్తూ 2009లో ఒక తీర్మానం చేశారు. దీంతో చాలామంది న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ఎవరికీ ఆ మినహాయింపు ఉండదు.

మరింత సులువుగా ఈపీఎఫ్ విత్‌డ్రా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కలిగించింది. ఆన్‌లైన్‌లో నగదు విత్‌డ్రా విధానాన్ని ఇకపై మరింత సులభతరం చేసింది. ఆన్‌లైన్‌లో నగదు విత్‌డ్రా కోసం దరఖాస్తు చేసే సమయంలో క్యాన్సిల్డ్ చెక్ అప్‌లోడ్ చేసే ప్రక్రియను తొలగించింది. అదేవిధంగా బ్యాంకు ఖాతాను యాజమాన్యం ధ్రువీకరించవలసిన అవసరం లేదని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో దాదాపు 8 కోట్ల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరనుంది.

25 వేలమంది టీచర్ల నియామకాలు రద్దు

» సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. సీఎం మమతకు షాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర స్కూల్ సర్వీస్ కమిషన్ పరిధిలోని 25 వేల మందికిపైగా టీచర్లు, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. నియామక ప్రక్రియ మొత్తం మోసపూరితంగా, అవకతవకలతో కూడుకొని ఉందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ ప్రక్రియలో విశ్వసనీయత, చట్టబద్ధత లోపించాయని.. పరిష్కరించడానికి సాధ్యంకానంతగా కలుషితమైపోయిందని ఆక్షేపించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన కారణం తమకు కనిపించడం లేదని తెలిపింది. మోసపూరితంగా నియామకాలు పొందిన అభ్యర్థులు ఏళ్లతరబడి పొందిన జీతాలను వెనక్కి ఇవ్వాల్సిన అవసరం లేదని, అయితే వారి నియామకాలను రద్దు చేస్తున్నామని తేల్చిచెప్పింది. మొత్తం పరీక్ష ప్రక్రియ చెల్లదని ప్రకటించినందున ఏ ఒక్క అభ్యర్థి నియామకమూ చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన మమతా బెనర్జీ ప్రభుత్వం.. కళంకిత అభ్యర్థులు, కళంకితంకాని అభ్యర్థులను వేర్వేరుగా చూడాలని కోరగా.. నియామక ప్రక్రియ ప్రతిదశలోనూ మభ్యపెట్టే, కప్పిపుచ్చే చర్యలున్నందున ఎవరు కళంకితులో, ఎవరు కాదో నిర్ధారించడం కష్టంగా మారిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2016లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్షకు 23 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం ఖాళీలు 24,640 కాగా, 25,753 మందికి నియామక పత్రాలు జారీ చేశారు. దీంతో అక్రమ నియామకాల కోసమే అదనంగా సూపర్‌న్యూమరిక్ పోస్టులు సృష్టించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నియామకాల్లో జరిగిన అవకతవకలే ప్రభుత్వానికి ముప్పుగా పరిణమించాయి. సుప్రీంకోర్టు తీర్పును వ్యక్తిగతంగా అంగీకరించనని, అయితే ఆ తీర్పును తన ప్రభుత్వం అమలు చేస్తుందని మమత వ్యాఖ్యానించారు. 'సిటింగ్ జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు బయటపడినప్పుడు ఆయనను బదిలీతో సరిపుచ్చారు. మరి ఈ టీచర్లను ఉపాధ్యాయులను ఎందుకు బదిలీతో సరిపుచ్చరు? మొదట ఈ తీర్పు ఇచ్చిన జడ్జి ఇప్పుడొక బీజేపీ ఎంపీ. బీజేపీ, సీపీఎం కుట్రపూరితంగా ఇలాంటి తీర్పు రావడానికి కారణమయ్యాయి' అని ఆరోపించారు.

స్వదేశానికి వెళ్లొద్దు!

» వెళ్తే తిరిగి వచ్చే అవకాశం ఉండదు

» భారతీయ ఉద్యోగులకు అమెరికా టెక్ కంపెనీల హెచ్చరికలు

» ట్రంప్ ఆంక్షలపై తీవ్ర ఆందోళనలో పలువురు భారతీయ టెకీలు

» ఇంటి నుంచి బయటకెళ్తే డాక్యుమెంట్లు వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితి

వాషింగ్టన్, ఏప్రిల్ 3: వీసాలు, వలసలపై ట్రంప్ 2.0 ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ తదితర అమెరికా టెక్ కంపెనీలు తమ వద్ద పని చేస్తున్న భారతీయ ఉద్యోగులకు పలు జాగ్రత్తలు చెబుతున్నాయి. స్వదేశానికి వెళ్లి వచ్చే ప్రయాణాలను మానుకోవాలని, ఒకసారి వెళ్తే అమెరికాకు మళ్లీ వచ్చే అవకాశాలు ఉండబోవని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అమెరికా టెక్నాలజీ రంగంలో పని చేస్తున్న విదేశీ ఉద్యోగుల్లో అత్యధికులు భారతీయులే. ఏటా దాదాపు 65 వేల వీసాలను అమెరికా ప్రభుత్వం హెచ్1బీ ప్రోగ్రామ్ కింద లాటరీ పద్ధతిన మంజూరు చేస్తుంది. వీటిలో మెజారిటీ భారత్‌కు లభిస్తుండగా.. ఆ తర్వాత స్థానాల్లో చైనా, కెనడా ఉన్నాయి. వీసా ఉద్యోగులు ఎక్కువగా అమెజాన్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఆపిల్ సంస్థల్లో పని చేస్తున్నారు. ట్రంప్ ఆంక్షల కారణంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో వాషింగ్టన్ పోస్ట్ కొందరు హెచ్1బీ ఉద్యోగులను ఇంటర్వ్యూ చేసింది. వీరిలో ఇద్దరు భారతీయులు.. తాము భారత్‌కు వెళ్లిరావాలన్న ప్రయాణ ఆలోచనను మానుకున్నామని, వెళ్తే తిరిగి రానిస్తారో లేదోనన్న ఆందోళనే దీనికి కారణమని తెలిపారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. పుట్టుక ఆధారంగా ఇచ్చే పౌరసత్వానికి సంబంధించి కూడా ప్రభుత్వం పలు సవరణలు చేయనుందన్న వార్తలపై వీరు ఆందోళన వెలిబుచ్చారు. తమ పిల్లలు అటు అమెరికా, ఇటు భారత్.. రెండు దేశాల పౌరులూ కాకుండా పోతారేమోనని పేర్కొన్నారు. అమెరికా పౌరులు కానివాళ్లందరినీ చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వారిగానే పరిగణిస్తారన్న హెచ్చరికల దృష్ట్యా.. ఇళ్ల నుంచి ఎప్పుడు బయటకొచ్చినా.. అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్తున్నామని మరికొందరు తెలిపారు. మరోవైపు, టెక్ కంపెనీలు తమ ఉద్యోగుల వీసా పొడిగింపు ప్రక్రియను వేగవంతం చేసే చర్యలు కూడా చేపట్టాయి. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళన వారి పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని కంపెనీలు భావిస్తున్నాయి.

గ్రీన్‌కార్డ్ కోసం అసాధారణ జాప్యం

అమెరికా పౌరసత్వం (గ్రీన్‌కార్డ్) దక్కితే ఇటువంటి సమస్యలు దూరమవుతాయి. కానీ, గ్రీన్‌కార్డ్ మంజూరుకు అసాధారణ జాప్యం నెలకొంటోంది. అనేక మంది భారతీయులకు గ్రీన్‌కార్డు కోసం దశాబ్దాలుగా వేచి చూస్తున్నారు. మార్కెట్లో 900 కోట్ల డాలర్ల విలువైన కంపెనీగా ఇటీవలే వార్తల్లోకెక్కిన ఏఐ కంపెనీ 'పర్‌ప్లెక్సిటీ' సీఈఓ అరవింద్ శ్రీనివాసన్.. గ్రీన్‌కార్డు కోసం తాను మూడేళ్లుగా వేచి చూస్తున్నానని తాజాగా సోషల్ మీడియాలో ప్రకటించారు. వందలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న కంపెనీ అధినేతకే ఇటువంటి పరిస్థితి ఉందంటే.. సాధారణ టెక్ ఉద్యోగుల పరిస్థితి ఏమిటన్నది ఊహించుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ట్రంప్ తొలి దఫా పాలనలో వీసా తిరస్కరణలు 15 శాతం మేర పెరిగాయి. ప్రస్తుత హయాంలో కూడా ఇదే పరిస్థితి ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లింల హక్కుల పరిరక్షణకే బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్న ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లులో ముస్లిమేతరుల ప్రమేయం ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. ముస్లింల హక్కులను హరిస్తామన్న ప్రతిపక్షాల ఆరోపణలనూ తిరస్కరించారు. ముస్లింల్లోని అన్ని తెగల వారి హక్కులను పరిరక్షించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బిల్లుతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. "బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు మేం రాష్ట్ర ప్రభుత్వాలు, మైనారిటీ కమిషన్లు, వక్ఫ్ బోర్డులతో సంప్రదింపులు జరిపాం. బిల్లు పరిశీలనకు జేపీసీని ఏర్పాటు చేశాం. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది" అని రిజిజు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 8.72 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. 2006లో 4.9 లక్షల వక్ఫ్ ఆస్తుల ద్వారా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తుందని సచార్ కమిటీ అంచనా వేసిందని, అంటే ప్రస్తుతం ఆయా ఆస్తుల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో ఊహించుకోవచ్చని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణలో లోపాలను, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ సవరణ బిల్లును తెచ్చినట్లు చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లింలకు మాత్రమే చెందుతాయని స్పష్టంచేశారు. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా 284 సంస్థలు తమ అభిప్రాయాలను తెలిపాయని, కోటి మందికి పైగా ప్రజలు వినతిపత్రాలు అందించారని వెల్లడించారు. అందరితో సంప్రదింపులు జరిపిన తర్వాతే మైనారిటీ వ్యవహారాల శాఖ ఈ సవరణ బిల్లును రూపొందించిందని రిజిజు స్పష్టం చేశారు. సభ్యులందరూ బిల్లుకు మద్దతు తెలుపుతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు సయ్యద్ నజీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి, మతపరమైన ఏకీకరణ కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అబద్ధాల ఆధారంగా సవరణ బిల్లును రూపొందించారని, గత ఆరు నెలలుగా బీజేపీ వక్ఫ్ బిల్లుపై దుష్ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు. రాజ్యసభలోనూ 8 గంటల పాటు చర్చ జరిపేందుకు అవకాశం కల్పించారు. గురువారం అర్ధరాత్రి దాటేవరకూ చర్చ జరుగుతూనే ఉంది.

ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరుల్ని చేసిన కాంగ్రెస్: నడ్డా

కేంద్రంలో చాలా కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశంలోని ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేసిందని బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడం ద్వారా మోదీ సర్కారు ముస్లిం మహిళలను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చిందన్నారు. ఈజిప్ట్, సూడాన్, బంగ్లాదేశ్, సిరియా వంటి ముస్లిం దేశాల్లో చాలా ఏళ్ల కిందటే ట్రిపుల్ తలాక్‌ను నిషేధించగా.. భారత్‌లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిందేమీ లేదన్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం ఏమీ తీసుకోదని, వాటి దుర్వినియోగాన్ని మాత్రమే అడ్డుకుంటుందని చెప్పారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ సర్ఫరాజ్ అహ్మద్, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారు. ట్రంప్ వేస్తున్న ప్రతీకార సుంకాల నుంచి దృష్టి మరల్చేందుకే మోదీ సర్కారు వక్ఫ్ బిల్లు తీసుకొచ్చిందని.. అందుకే పేద ముస్లింలపై ఎనలేని ప్రేమ చూపుతోందని రౌత్ అన్నారు. ఇండి కూటమి సభ్యులు వక్ఫ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన బిల్లు అని, ముస్లింలను లక్ష్యంగా చేసుకొని రూపొందించారని ఆరోపించారు.

'కర్ణాటకలో పాక్ అనుకూల నినాదాలు'.. సభలో వాగ్యుద్ధం

వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ సభ్యుడు రాధామోహన్ దాస్ అగర్వాల్ చేసిన వ్యాఖ్యలతో రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్యుద్ధం జరిగింది. కర్ణాటకలో కాంగ్రెస్ నేత రాజ్యసభకు ఎన్నికైన సమయంలో ఆ పార్టీ శ్రేణులు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారని ఆరోపించారు. ఆ నినాదాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ ఆరోపణలు తనపైనే చేశారంటూ కాంగ్రెస్ సభ్యుడు నజీర్ హుస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్యుద్ధం జరిగింది.


- వక్ఫ్ బిల్లును ఆమోదించడాన్ని ఆలిండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షాబుద్దీన్ రజ్వీ బరేల్వీ స్వాగతించారు. ఈ బిల్లుతో ముస్లింల్లోని అణగారిన వర్గాలకు ఆర్థిక ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిల్లుకు అనుకూలంగా ఓటేసిన లోక్‌సభ సభ్యులకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
- వక్ఫ్ బిల్లుపై బీజేడీ మాట మార్చింది. రాజ్యసభలో బీజేడీకి ఏడుగురు సభ్యులున్నారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. గురువారం మాత్రం తమ సభ్యులు మనస్సాక్షి ప్రకారం ఓటు వేయొచ్చని తెలిపింది. ఎంపీలకు విప్ జారీ చేయబోమంది.

దీటుగా తిప్పికొడతాం

అమెరికా ప్రతీకార సుంకాలపై చైనా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలపై ప్రపంచ దేశాలు తీవ్రంగా స్పందించాయి. ముఖ్యంగా ప్రతీకార సుంకాల నిర్ణయాన్ని అమెరికా తక్షణమే వెనక్కి తీసుకోవాలని చైనా పేర్కొంది. లేనిపక్షంలో తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అమెరికా చర్యలను దీటుగా తిప్పికొడతామని హెచ్చరించింది. ప్రతీకార సుంకాలపై ట్రంప్ ప్రకటన చేసిన కాసేపటికే వైట్‌హౌస్ యంత్రాంగంతో ఫోన్‌లో మాట్లాడిన చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ.. అమెరికా నిర్ణయం ప్రపంచ ఆర్థికాభివృద్ధిని ప్రమాదంలో నెట్టేలా ఉందని తెలిపింది. మరోపక్క, యూరోపియన్ యూనియన్(ఈయూ) కూడా తీవ్రంగా స్పందించింది. ట్రంప్ నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎదురుదెబ్బ అని ఈయూ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్నారు. ఈయూ ప్రతిచర్య ఏంటనేది నెలాఖరులోగా తెలుస్తుందని ఫ్రెంచ్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు విలేకరులతో అన్నారు. ఇక, అమెరికా నిర్ణయానికి కెనడా దీటుగా బదులిచ్చింది. తాము ప్రతీకార సుంకాలు విధిస్తామని పేర్కొన్న కెనడా ప్రధాని మార్క్ కార్నే.. అమెరికా నుంచి దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం సుంకం వేస్తామని ప్రకటించారు. కాగా, ప్రతీకార సుంకాలపై అమెరికా తీసుకున్న నిర్ణయం ఆ దేశ ప్రజలకే నష్టం కలిగిస్తుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ ప్రకటించారు. అమెరికా ప్రతీకార సుంకాలను జపాన్ కూడా తప్పుబట్టింది. ప్రతీకార సుంకాల విధింపు అత్యంత అసమంజసమైన నిర్ణయమని, దీనిపై తాము అమెరికాతో మాట్లాడతామని తైవాన్ ప్రకటించింది.

నాపై ఆరోపణలను రుజువు చేస్తే రాజీనామా చేస్తా: ఖర్గే



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: వక్ఫ్ భూమిని కబ్జా చేశారంటూ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ బుధవారం లోక్‌సభలో చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన.. రాజకీయ దాడులకు తాను బెదిరిపోనన్నారు. పుష్ప సినిమాలోని 'తగ్గేదే లే' డైలాగ్ చెప్పారు. గురువారం రాజ్యసభలో ఖర్గే మాట్లాడారు. "బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ నాపై అసత్య ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రశ్నించడంతో ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.వక్ఫ్ భూమిపై ఆరోపణలను ఠాకూర్ నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా. లేదంటే ఆయన చేయాల్సిందే. ఇలాంటి రాజకీయ దాడులతో బీజేపీ నేతలు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. నేనెవరికీ భయపడను. తలొగ్గను" అని ఖర్గే స్పష్టం చేశారు. కాగా, వక్ఫ్ బిల్లు రాజ్యాంగంపై తీవ్ర దాడి అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఆమె మాట్లాడుతూ.. సమాజంలో విభజన తీసుకొచ్చేందుకు బీజేపీ వ్యూహంలో భాగమే ఈ బిల్లు అని ఆక్షేపించారు.

తప్పులు చేయబట్టే..

జగన్ ప్రజల్లో తిరగలేకపోతున్నారు!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

- మీరు మంచి చేయలేదు.. మేం చేస్తే సహించలేరు
- తప్పుడు ప్రచారాలను ఆపేందుకే రెడ్‌బుక్ ప్రస్తావన
- విజనరీ చంద్రబాబుకు, ప్రిజనరీ జగన్‌కు ఎంతో తేడా
- రాష్ట్రాభివృద్ధి, యువత ఉపాధికి సీఎం నిరంతర కృషి
- పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు
- రైతులకు గిట్టుబాటు ధరపై చిత్తశుద్ధితో ప్రభుత్వం
- మంగళగిరి నియోజకవర్గంలో ఓ పేద కుటుంబానికి శాశ్వత ఇంటి పట్టా అందజేసిన మంత్రి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ఒక ప్రిజనరీ (జైలుకు వెళ్లిన వ్యక్తి). ఆయనవన్నీ తప్పుడు ఆలోచనలే! నిత్యం తప్పులు చేస్తూ ఉంటారు కాబట్టే ఆయన ధైర్యంగా ప్రజల మధ్య తిరగలేకపోతున్నారు. అధికారంలో ఉన్నపుడు ఎవర్నీ కలవలేదు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాతా కనీసం తన పార్టీ కార్యకర్తలను కూడా కలిసే తీరిక ఆయనకు లేదు. అసలు ఆయనకు ప్రజలను కలిసే ఓపిక ఎక్కడుంది..?' అని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని ఉండవల్లిలో గురువారం ఒక నిరుపేద కుటుంబానికి ఆయన శాశ్వత ఇంటి పట్టాను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎంపై విరుచుకుపడ్డారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే.. ఐదేళ్ల పాటు ఆయన నివసించిన ప్రాంతంలోని ప్రజా సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. పైగా ఆయన ఇంటి దారి కోసం పేదోళ్ల ఇళ్లను కూల్చివేయించారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడలేక కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోందని, తప్పు చేసిన వారెవరైనా వదిలే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు.

తప్పుడు ప్రచారాలకు దిగితే..

'జగన్ అధికారంలో ఉన్నపుడు ప్రతిపక్ష నేతల పర్యటనలను పదేపదే అడ్డుకున్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారు. మేం అంబేద్కర్ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నాం. మేం ఎక్కడా ప్రతిపక్ష నేత ఇంటి గేటుకు తాళ్లను కట్టించలేదు. ఎవరిపైనా తప్పుడు కేసులు బనాయించలేదు. జగన్ స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లగలిగేలా అవకాశం కల్పించాం. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కంటే ఎక్కువగా జగన్‌కు జడ్ ప్లస్ భద్రత కల్పించాం. ఇంకేం కావాలి? వాళ్లు తప్పుడు ప్రచారాలకు దిగితే.. వాటిని ఎలా తిప్పికొట్టాలో మాకు బాగా తెలుసు' అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తాము ప్రాజెక్టులు తెస్తుంటే వైసీపీ నేతలకు కడుపు మంటగా ఉందని దుయ్యబట్టారు. అందుకే తాను తాజాగా రెడ్‌బుక్ ప్రస్తావన చేయాల్సి వచ్చిందన్నారు. 'కనిగిరిలో ఉపాధి కోసం 35 వేల మంది వలసలు పోతున్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా వలసలను నివారిస్తానని మాట ఇచ్చా. అందుకే అక్కడ తొలి రిలయన్స్ సీబీజీ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి 50 వేల ఎకరాలను ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పగా.. రిలయన్స్ డైరెక్టర్ స్పందించి 50 ప్లాంట్లను అక్కడే ఏర్పాటు చేయిస్తామని అన్నారు. దీనికే వైసీపీ వాళ్లకు కడుపు మంటగా వుంది. దానిపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకే.. అలాంటి వారి పేర్లను రెడ్‌బుక్‌లోకి ఎక్కిస్తానని చెప్పాను' అని లోకేశ్ వివరించారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నిరంతర కృషి

విజనరీ లీడర్ చంద్రబాబుకు, ప్రిజనరీ జగన్‌కు ఎంతో తేడా ఉందని లోకేశ్ పునరుద్ఘాటించారు. రోజురోజుకు వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలో పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో నాడు ఐటీని ప్రవేశపెట్టడంతోనే నేడు లక్షలాది మందికి ఐటీ ఉద్యోగాలు లభించాయన్నారు. నిరుపేదలను పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు తేవాలన్న లక్ష్యంతో పీ-4 విధానానికి రూపకల్పన చేసి, ప్రారంభించారని గుర్తుచేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంపై మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్ తదితరులతో కూడిన కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ రైతులు నష్టపోకుండా చూస్తున్నారని తెలిపారు.

సౌత్‌మోపూరుకు రోడ్లొచ్చాయి..

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'కు స్పందన

- రూ.1.2 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.94 లక్షలతో ఊరంతా సీసీరోడ్ల నిర్మాణం పూర్తి
- రూ.26 లక్షలతో టెండర్ల దశలో ప్రహరీలు





ప్రభుత్వ కళాశాలకు వేసిన నూతన సీసీ రోడ్డు



సౌత్‌మోపూరులోని గమళ్లపాళెంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం ఒక గ్రామ అభివృద్ధికి అండగా నిలిచింది. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ ప్రజల ఇబ్బందులను జనవరి 27న వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గ్రామంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' నేతృత్వంలో 28న ప్రజాసదస్సు నిర్వహించారు. గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించిన ఆయన రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ మేరకు ఫిబ్రవరి 6వ తేదీన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించారు. ప్రధాన రహదారితోపాటు హైస్కూల్ ప్రాంగణంలోనికి, ప్రభుత్వ కళాశాలకు, గమళ్లపాళెం, యాదవపాళెం, వడ్డిపాళెం, అరుంధతీపాళెంకు రూ.94 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో రూ.26 లక్షలతో వాణిశ్రీ జడ్పీ హైస్కూలుకు, గిరిజనపాళెం (కనుజులమిట్ట)లోని శ్మశానానికి ప్రహరీ గోడల నిర్మాణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఊహించని రీతిలో గ్రామంలో అభివృద్ధి పనులు చకచకా జరగడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కేతిరెడ్డి సోదరుడి భార్యకు నోటీసులు

- అసైన్‌మెంట్ భూమి రిజిస్ట్రేషన్‌పై వివరణ కోరిన రెవెన్యూ అధికారులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడి భార్య గాలి వసుమతి రెడ్డికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ధర్మవరం పట్టణ సమీపంలోని సర్వే నంబర్ 905-2లో 2.42 ఎకరాల భూమికి 1960లో మోటుమర్ల గ్రామానికి చెందిన అంకే నారాయణ, శ్రీహరిపురం గ్రామానికి చెందిన తలారి అంజినమ్మ, లక్ష్మీచెన్నకేశవపురం గ్రామానికి చెందిన ఓబులమ్మ పేరిట పట్టా ఇచ్చారు. ఈ భూమిని వైసీపీ హయాంలో వసుమతిరెడ్డి కొనుగోలు చేశారు. ఇది అసైన్‌మెంట్ భూమి అయినా, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తొలుత పోస్టల్ ద్వారా నోటీసులు పంపగా, వెనక్కి వచ్చాయి. దీంతో స్వయంగా రెవెన్యూ అధికారులే గురువారం నోటీసులు తీసుకువెళ్లి ఇచ్చినట్టు తెలిసింది.

ఏపీలో నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ సెంటర్

- నోడల్ కేంద్రంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రి
- విశాఖ, కర్నూలు, కాకినాడ ఆస్పత్రుల అనుసంధానం
- ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో రోగులకు మెరుగైన చికిత్సలు



వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబుతో వర్చువల్‌గా మాట్లాడుతున్న గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రుల్లో క్యాన్సర్ రోగులకు మరింత మెరుగైన, కచ్చితత్వంతో కూడిన వైద్యం అందించేందుకు నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్‌ను ఏర్పాటు చేశారు. టాటా మెమోరియల్ సెంటర్, హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్ (విశాఖపట్నం), నవ్య కేర్ నెట్‌వర్క్‌లతో కలసి నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ఎన్‌సీజీకి... పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌తో పాటు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు ప్రభుత్వాస్పత్రులను అనుసంధానం చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆంకాలజీ విభాగాన్ని నోడల్ సెంటర్‌గా ఎంపిక చేశారు. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఈ నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన నాలుగు ఆస్పత్రులకు చెందిన సూపరింటెండెంట్లు, అంకాలజీ వైద్య నిపుణులను ఉద్దేశించి మాట్లాడారు. క్యాన్సర్ రోగుల డేటాను సేకరించి, వాటిని ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ద్వారా విశ్లేషించి చికిత్స అనంతరం రోగుల పరిస్థితిని అంచనా వేస్తామని తెలిపారు. దీనివల్ల క్యాన్సర్ చికిత్సల్లో మానవ తప్పిదాలను కనిష్ఠ స్థాయికి తగ్గించే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో పాటు క్యాన్సర్ వైద్యనిపుణులు పాల్గొన్నారు.

సరకు రవాణాలో

తూర్పు కోస్తా రైల్వే సరికొత్త రికార్డు

- 259.254 మిలియన్ టన్నుల రవాణాతో అగ్రస్థానం
- గత ఆర్థిక సంవత్సరం కంటే 1.2 శాతం వృద్ధి

విశాఖపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సరకు రవాణాలో తూర్పు కోస్తా రైల్వే సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 259.254 మిలియన్ టన్నుల సరకు రవాణా చేసి లక్ష్యాన్ని అధిగమించడమే కాకుండా సరికొత్త రికార్డు నెలకొల్పింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 3.034 మిలియన్ టన్నులు అధికంగా (1.2 శాతం) రవాణా చేసింది. భారతీయ రైల్వేలో 259 మిలియన్ టన్నులకు పైగా సరకు రవాణా చేసిన తొలి జోన్‌గా తూర్పుకోస్తా రైల్వే నిలిచి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని అధికారులు పేర్కొన్నారు. 153.271 మిలియన్ టన్నుల బొగ్గు, 9.952 మిలియన్ టన్నుల ముడి పదార్థాలు, 21.381 మిలియన్ టన్నుల స్లాగ్, 32.476 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం, 1.065 మిలియన్ టన్నుల సిమెంట్, 2.989 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 6.772 మిలియన్ టన్నుల ఎరువులు, 2.991 మిలియన్ టన్నుల మినరల్ ఆయిల్, 28.357 మిలియన్ టన్నుల వస్తువులు రవాణా చేసిందని తెలిపారు. ఈ ఏడాది భారతీయ రైల్వేలో 200 మిలియన్ టన్నులకు పైగా సరకు రవాణా చేసిన జోన్లలో 259.254 మిలియన్ టన్నులతో తూర్పు కోస్తా రైల్వే అగ్రస్థానంలో ఉండగా, సెంట్రల్ రైల్వే 253.208, సౌత్ ఈస్ట్రన్ రైల్వే 212.361, సెంట్రల్ రైల్వే 202.62 మిలియన్ టన్నుల సరకు రవాణాతో తర్వాత స్థానాల్లో నిలిచినట్టు తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వహించి సరికొత్త రికార్డు నెలకొల్పడంలో కీలకపాత్ర పోషించిన వాల్తేరు, సంబల్‌పూర్, ఖుర్దా రోడ్డు డివిజన్ల అధికారులు, సిబ్బందికి జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ అభినందనలు తెలిపారు.

పోలవరంలో గ్యాప్-1 పనులు ప్రారంభం

- నిర్మాణ స్థలంలో శాస్త్రోక్తంగా పూజలు

పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన గ్యాప్-1 రాక్ ఫిల్ డ్యాం పనులను జలవనరుల శాఖ అధికారులు ప్రారంభించారు. ముందుగా గురువారం నిర్మాణ స్థలంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు అథారిటీ, మెగా సంస్థ ఇంజనీర్లు, జల వనరుల శాఖ అధికారులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రాక్ ఫిల్ డ్యాంను సుమారు 25 మీటర్ల ఎత్తు, 540 మీటర్ల పొడవున నిర్మించాల్సి ఉంది. ఈ సందర్భంగా సీఈ కె.నరసింహమూర్తి, మెగా సంస్థ గుత్తేదారులు, పీపీఏ అధికారులు మాట్లాడుతూ... 'నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాం. అన్ని విభాగాల ఇంజనీర్లు, అధికారులు, నిపుణులను సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేసి ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని తెలిపారు. ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఈఈ కె.బాలకృష్ణ, పీపీఏ చీఫ్ ఇంజనీర్ రాజేశ్ కుమార్, మెగా సంస్థ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీశ్ బాబు, జీఎం గంగాధర్ పాల్గొన్నారు.

శవాన్ని పీక్కుతిన్న పందులు

- మల్కాపురం శ్మశానవాటికలో ఘటన

మల్కాపురం (విశాఖపట్నం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని మల్కాపురం శ్మశానవాటికలో శవాన్ని పందులు పీక్కుతినడం కలకలం రేపింది. గురువారం శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన వ్యక్తి చనిపోగా, దహన సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు మల్కాపురం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. మృతదేహాన్ని పూడ్చేందుకు కాటి కాపరి గొయ్యి తవ్వుతుండగా, మరో శవం బయటపడింది. ఆ శవాన్ని పక్కనపెట్టి.. అతను గొయ్యి తవ్వడంలో నిమగ్నమయ్యాడు. ఇంతలో అక్కడకు చేరిన పందుల గుంపు ఆ శవాన్ని నోట కరుచుకొని కొంతదూరం లాక్కుపోయి, తినసాగాయి. వెంటనే తేరుకున్న కాటి కాపరి ఆ పందులను దూరంగా తరిమి...శవాన్ని గొయ్యి వద్దకు తీసుకువచ్చాడు. ఈ సమాచారం అందుకున్న స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ శ్మశానవాటికకు చేరుకుని... ఆ మృతదేహాన్ని తిరిగి కాటి కాపరితో పూడ్చిపెట్టించారు.

'స్థానికత' ఆధారంగా

హోం గార్డులను బదిలీ చేయండి: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థానికత ఆధారంగా హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి ఆమేరకు వినతి పత్రం అందజేశారు. 'పదిహేనేళ్ల క్రితం హోం గార్డులుగా నియమితులైన తెలంగాణకు చెందినవారు ఏపీలోనూ, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు తెలంగాణలో పని చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. స్థానికత కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారు. వీరి పిల్లల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది' అని ఆయన హోం మంత్రికి వివరించారు.

ఉత్తమ విశాఖ నిర్మాణమే లక్ష్యం

- బాధ్యతల స్వీకారంలో ఆర్చ్ బిషప్ ఉడుముల బాల



విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అందరినీ కలుపుకొని విశాఖపట్నం అభివృద్ధికి తద్వారా ఆంధ్రప్రదేశ్ వికాసానికి కృషి చేయడమే తన లక్ష్యమని విశాఖ ఆర్చ్ బిషప్ ఉడుముల బాల అన్నారు. జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కేథడ్రల్ మైదానంలో గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఆర్చి బిషప్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ వేడుకకు పోప్ రాయబారి, మోస్ట్ రెవరెండ్ డాక్టర్ లియోపోల్డో గెరెల్లి నేతృత్వం వహించారు. విశాఖపట్నం రోమన్ కేథలిక్ అగ్ర పీఠానికి ఉడుముల బాల ఇకపై బాధ్యత వహిస్తారని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉడుముల బాల మాట్లాడుతూ.. వరంగల్ తన జన్మభూమి అని, విశాఖపట్నం పుణ్యభూమి అని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుంకాల ప్రకంపనలు

ప్రపంచంతో అమెరికా అధ్యక్షుడు చేస్తున్న వాణిజ్యయుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. జానపదచిత్రాల్లో ఒకరు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగిస్తే ఎదుటివారు వారుణాస్త్రాన్ని వాడినట్టుగా ఉంది ఈ ప్రతీకార సుంకాల యుద్ధం. ఏప్రిల్ ఒకటిన తాను ఈ కార్యక్రమాన్ని చేపడితే ఏప్రిల్ ఫూల్ అనుకుంటారని సందేహం కలిగి ఈ కక్షతీర్చుకొనే కార్యక్రమాన్ని మర్నాటికి వాయిదావేశారు. ఆహాఓహో అంటూ చప్పట్లు కొట్టే ఓ బృందాన్ని పక్కనపెట్టుకొని, 'లిబరేషన్ డే' పేరిట ఇప్పుడు ఆయన నిర్వహించిన కార్యక్రమాన్ని చూస్తున్నవారికి ట్రంప్ ఎలా కనిపించారో తెలియదు మరి. దేశాల పేర్లన్నీ అక్షరక్రమంలో రాసుకొచ్చి, స్కూలు టీచరు మార్కులు వేస్తున్నట్టుగా ఒక్కోదేశానికీ సుంకాలశాతం నిర్ణయించారు. మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రతీకారం తీర్చుకున్నారు. పేదదేశాలనూ మోదేశారు, పెంగ్విన్‌లు నివసించే దీవులమీద కూడా పదిశాతం వడ్డించారు.

గతపాలకుల కుట్రలు నిర్లక్ష్యం కారణంగా రోగానపడిన దేశాన్ని ఈ చర్యతో ఉద్ధరించానని ట్రంప్ చెప్పుకున్నారు. దేశం ఆర్థికంగా కళకళలాడుతుందని, పారిశ్రామికంగా పరుగులుపెడుతుందని, తయారీరంగం ఎదిగి ఉద్యోగ ఉపాధులు వెల్లివిరుస్తాయని గొప్పలకు పోయారు. ప్రత్యక్షయుద్ధాల తరువాత యావత్ ప్రపంచాన్ని తీవ్రంగా కుదిపేస్తున్న ఈ వాణిజ్యయుద్ధంలో అభివృద్ధిచెందుతున్న దేశాలు ప్రధానంగా బలికావచ్చు. ఆపరేషన్ ముగిసింది, రోగి మరింత ఆరోగ్యంగా ఉన్నాడని ట్రంప్ ఈ కార్యక్రమం అనంతరం గొప్పలకు పోయారు కానీ, అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈ నిర్ణయం అత్యంత కీడు చేకూర్చబోతున్నదని విశ్లేషకుల అంచనా. అసత్యాలు, అర్థసత్యాలతో, పునరుజ్జీవం వంటిమాటలతో ఆయన ప్రజలను మభ్యపెడుతున్నారని, మాంద్యంవైపు దేశాన్ని నెట్టేస్తున్నారని విమర్శలు తీవ్రమైనాయి. ఈ సుంకాల శాతాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించారన్న ప్రశ్నలూ వినబడుతున్నాయి. సుంకాల్లో తేడా బట్టికాక, ప్రధానంగా ఆయాదేశాలతో ఉన్న వాణిజ్య లోటు ఆధారంగా ఈ రేట్ల నిర్ణయం జరిగినట్టు కొందరి అనుమానం. పరస్పర ఆధారిత ప్రపంచ ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ, అమెరికాను ఉన్నతంగా నిలబెడతానంటున్న ట్రంప్ తమను నరకంవైపు నడుపుతున్నాడని అమెరికన్లకు అర్థంకావడానికి కొంతసమయం పడుతుంది. వారికి కర్తవ్యం బోధపడేవరకూ మిగతా ప్రపంచం ట్రంప్ దూకుడు భరించక తప్పదు.

మోదీ మంచిమిత్రుడే కానీ, మనలను సరిగా చూడడం లేదంటూ ట్రంప్ ఎప్పటిలాగానే అదే ఆరోపణచేశారు. ఆయన ఏదో హడావుడిలో 26 అన్నారు గానీ, భారత్‌మీద 27శాతం టారిఫ్ విధించినట్టు వైట్‌హౌస్ తరువాత సరిదిద్దింది. చాలాదేశాల విషయంలో ఇదే గందరగోళం. ఇక, సుంకాలదెబ్బనుంచి మన ఫార్మారంగాన్ని మినహాయించడం అమెరికాకు అత్యవశ్యకం కావచ్చుగానీ, అత్యధిక ఎగుమతులు జరుపుతున్న ఇక్కడి జనరిక్ ఔషధరంగానికి ఊరటనిచ్చే అంశం. చైనా, వియత్నాం, థాయిలాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాల మీద ట్రంప్ అత్యధికటారిఫ్‌లు విధించడం మనకు టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ తదితర కొన్ని కీలక రంగాల్లో ఆధిపత్యం పెంచుకోవడానికి కొత్త అవకాశమని కొందరి విశ్లేషణ. సెమీకండక్టర్లలో అగ్రగామిగా ఉన్న తైవాన్‌కు ట్రంప్ పెట్టిన వాతను మనకు అనుకూలంగా మార్చుకోవడం ఎలా? అన్న చర్చలూ నడుస్తున్నాయి. అయితే, లబ్ధి అందిపుచ్చుకోగలిగే స్థితిలో మనం ఉన్నామా అన్నది ప్రశ్న. మౌలిక సదుపాయాల్లో భారీ పెట్టుబడులు, గరిష్ఠ ఉత్పత్తి స్థాయి ఇత్యాది అంశాలమీద సదరు ప్రయోజనం ఆధారపడివుంటుంది.

ట్రంప్ టారిఫ్‌లతో అన్నిరంగాలు దెబ్బతింటాయని, ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అవుతుందని విపక్షనేత రాహుల్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, ఇంకా సాగిలబడుతూనే ఉంటారా, ఇకనైనా నిలబడతారా? అని ఓ ప్రశ్నవేశారు. ట్రంప్‌తో వ్యవహరించడం ఎలా? అన్నది మోదీని చూసి నేర్చుకోవాలని అమెరికా పెద్దలు, మీడియా వ్యాఖ్యాతలు ఇటీవలే ఓ వ్యాఖ్య చేశారు. ట్రంప్‌తో తొలిభేటీకి ముందే భారతదేశం ఇంధనాలు, ఆయుధాల కొనుగోలు వంటి పలు నిర్ణయాలతో ఆయనను ప్రసన్నం చేసుకుంది. విస్కీనుంచి విలాసవంతమైన కార్లవరకూ పన్నులు తగ్గించి మస్క్‌ను సైతం మచ్చిక చేసుకుంది. ముందుగానే వాణిజ్యచర్చలు ఆరంభించి, ఈ ఏడాది చివర్లోగా ద్వైపాక్షిక ఒప్పందానికి మార్గం సుగమం చేసుకుంది. ఆ ఒప్పందంలో మనం నిటారుగా నిలబడి స్వప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించగలమా అన్నది ప్రధానం. ప్రస్తుతానికి సుంకాల యుద్ధంనుంచి తప్పించుకోలేకపోయినా, త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని, ఇతరత్రా ప్రయోజనాలు, అవసరాల రీత్యా భారత్‌తో ట్రంప్ లెక్కలు వేరుగా ఉంటాయని ఆశించాలి.

ఆ 'నల్లదనం'లో విశ్వ సౌందర్యం



'నాకు నాలుగేళ్ల వయసులో, నన్ను మళ్లీ గర్భంలోకి పంపించి, నలుపు రంగు తీసేసి తెల్లగా, అందంగా మార్చగలవా అని మా అమ్మను అడిగాను. నల్ల రంగులో పుట్టకపోవడమే మంచిది అన్న అభిప్రాయాలను వింటూనే నా జీవితంలో యాభై సంవత్సరాలు గడిపేశాను'– తన శరీర ఛాయపై ఒక అవమానకరమైన వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కేరళ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శారదా మురళీధరన్ ఒక సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌లోని వ్యాఖ్య అది. ఒక ఉన్నత పదవిలో ఉన్న ఆ విద్యావతి వ్యాఖ్య మన ప్రజాసంస్కృతిలో ఒక ప్రాముఖ్యం గల సందర్భం. కోట్లాది భారతీయ మహిళల (చాలా మంది పురుషుల) మనసులోని మూగవేదన, నిత్య జీవితంలో అనుభవిస్తున్న బాధలు, యాతనలను గుండె లోతుల్లోంచి వచ్చిన మాటల్లో శారద వ్యక్తం చేశారు. ఇటువంటి బాధాకర విషయాన్ని అంగీకరించేందుకు మీకు మనోబలం ఉండాలి. ఆ సత్యాన్ని బహిరంగంగా చెప్పేందుకు మీకు ధైర్యముండాలి. అందుకు మీకు విశేష అధికారం, మాట్లాడగల శక్తి, చెప్పిన దాన్ని వింటారనే భరోసా మీకు ఎంతైనా అవసరం. అటువంటి మానసిక క్లేశానికి గురయినవారు ఆ వ్యాకులత నుంచి విముక్తి పొందగలరనడానికి శారద వ్యాఖ్యలే తార్కాణం.

కచ్చితంగా 65 సంవత్సరాల క్రితం (మార్చి 1960లో) రామ్ మనోహర్ లోహియా 'స్కిన్ కలర్ అండ్ బ్యూటీ' (చర్మం రంగు, అందం) అన్న ఒక అసాధారణ వ్యాసాన్ని రాశారు. 'రంగు నిరంకుశత్వం'పై విమర్శకు పథనిర్దేశం చేసిన రచన అది. స్త్రీ అందాన్ని శ్వేత వర్ణంతో ముడిపెట్టే ఆలోచనా ధోరణులను బద్దలు చేసేందుకు లోహియా ఆ వ్యాసం ద్వారా ప్రయత్నించారు: 'ప్రేమించే మహిళ, ప్రేమించబడే మహిళ నల్లగా ఉన్నా లేదా తెల్లగా ఉన్నా నక్షత్ర కాంతిమయమైన ఆకాశం సౌందర్యంతో ప్రకాశిస్తుంది' అని ఆయన అన్నారు. సోషల్ మీడియాలో శారద పోస్ట్‌ను, లోహియా వ్యాసంతో కలిపి చదివినప్పుడు తెల్ల చర్మం కోసం వెర్రి ఆరాటం అంత తేలికైన వ్యవహారం కాదని నాకు అర్థమయింది. చర్మం రంగు నల్లగా ఉన్నవారిపై దురభిప్రాయాలు మన కాలంలో ఇంకా ప్రబలంగా ఉన్న సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు తోడ్పడుతాయి. శరీర ఛాయపై ఈ చర్చలోని చాలా అంశాలను ఇటీవల ఒక విద్వత్ గ్రంథం 'The Routledge Companion to Beauty Politics' ప్రస్తావించింది. Maxine Leeds Craig ఆ గ్రంథం ప్రారంభ వాక్యాలలోనే ఆ అంశాలను ఇలా సంక్షేపించారు: 'అందం రాజకీయ సంబంధమైన వ్యవహారమే. విజేతలు కోరుకునే బహుమానమది. కురూపితనం అనేది సామాజికంగా ఉన్నతస్థాయిలో ఉన్నవారు తమ ఆధిక్యతను, తమకంటే తక్కువ వారు అని భావిస్తున్న వర్గాలపై ప్రయోగించే ఆయుధం'. సౌందర్యాత్మక తీర్పుపై ఇటువంటి రాజకీయ అభిప్రాయాన్నే లోహియా వ్యక్తం చేశారు: రాజకీయాలు సౌందర్యాత్మకతను ప్రభావితం చేస్తాయి; అధికారం సైతం, ముఖ్యంగా పోటీలేని అధికారం చాలా అందంగా కనిపిస్తుంది'.

'నల్లదనంపై దరభిప్రాయాలు' అని శషభిషలు లేకుండా తాను పేర్కొన్న దృగ్విషయంపై శారద వ్యాఖ్యలు స్పష్టంగా ఎత్తి చూపాయి. 'పక్షపాతం కేవలం నలుపునకు వ్యతిరేకంగా మాత్రమే కాదు... చర్మం నల్లగా ఉండడం గురించి, అదేదో సిగ్గుపడాల్సిన విషయంలా.. నలుపు కేవలం ఒక రంగు కాదు, నలుపు అనేది మంచిది కాదు, నలుపు చల్లని నిరంకుశత్వం, ఒక గాఢాంధకారం' అని ఆమె అన్నారు. ఎటువంటి రూపకాలంకారాలకు పోకుండా శుద్ధ నల్లదనాన్ని ఆమె అంగీకరించారు. సొంతం చేసుకున్నారు. 'నేను నల్లదనాన్ని తవ్వుతున్నాను' (ఐ డిగ్ బ్లాక్) అని ఆమె వ్యాఖ్యానించారు. ఇది అమెరికన్ నల్లజాతి ప్రజల పోరాట సంస్కృతి స్ఫూర్తితో చేసిన వ్యాఖ్య. అమానుష అణచివేతకు వ్యతిరేకంగా నిరసనలు ఎల్లప్పుడూ బాహ్య సమాజాల నుంచి ఉత్తేజం పొందడం కద్దు. అమెరికా నల్లజాతి ప్రజల నిరసనోద్యమాలను లోహియా పూర్తిగా సమర్థించారు. ఆ ఉద్యమకారులకు ఆయన స్నేహితుడు. అమెరికాలో జాతిపరమైన చీలికలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో పాల్గొని ఆయన అరెస్ట్ అయ్యారు. ఒక విరుద్ధ వాస్తవాన్ని వెల్లడించేందుకు ఆయన నేరుగా నీగ్రో (అప్పటికి ఇంకా వాడుకలో ఉన్న మాట)ను ప్రస్తావించారు: ఆఫ్రికా నీగ్రోలు యూరోపియన్ శ్వేత జాతీయులవలే ప్రపంచాన్ని పరిపాలించినట్టయితే స్త్రీ అందచందాలకు సంబంధించిన ప్రమాణాలు నిస్సందేహంగా భిన్నంగా ఉండేవి'. కవులు, వ్యాసకర్తలు నీగ్రో మృదువైన చర్మం గురించి సౌందర్యాత్మక పెదవులు, ముక్కు గురించి మాట్లాడేవారు'.



■ యోగేంద్ర యాదవ్

'నల్ల రంగులో పుట్టకపోవడమే మంచిది అన్న అభిప్రాయాలను వింటూనే నా జీవితంలో యాభై సంవత్సరాలు గడిపేశాను' అని శారద వ్యాఖ్యానించారు. 'నల్ల రంగులో ఉండే స్త్రీలు ఎలా వ్యాకులత, ఆత్మన్యూనతా భావంతో పెరుగుతారో' లోహియా మనకు గుర్తుచేశారు. ఒక సర్వవ్యాపక వాస్తవాన్ని గుర్తించేందుకు వారు చెప్పిన విషయాలు మనకు తోడ్పడుతాయి. సమాజంలో ప్రబలంగా ఉన్న అభిరుచులకు మార్కెట్‌లే మంచి కొలమానాలు. ముఖ్యంగా వివాహ వేడుకలకు సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలు; అందాన్ని ఇనుమడించే ఉత్పత్తుల మార్కెట్లు అందుకు నిదర్శనాలు. భారతదేశ చర్మ సౌందర్య ఉత్పత్తులలో సగం స్కిన్ –వైట్నెర్సే కావడం గమనార్హం. వీటి విలువ వార్షికంగా 35 నుంచి 40 వేల కోట్ల రూపాయల మేరకు ఉంటుంది. ఇది ఏటా 6శాతం చొప్పున పెరుగుతుంది. అందంగా ఉన్నది ఏదైనా ఒక సానుకూలతను సంతరించుకుంటున్నది. నల్లదనానికి అన్నీ విరుద్ధాలే. నలుపుపై దురభిప్రాయాలు మన ప్రజాసంస్కృతిలో పూర్తిగా ఇంకిపోయి ఉన్నాయి. బ్లాక్ డేస్, బ్లాక్ బ్యాడ్జెస్... చివరకు రైతులు వ్యతిరేకించిన చట్టాలను నల్ల చట్టాలుగా పేరు పొందాయి. రంగు ప్రాతిపదిక అణచివేత సమగ్ర స్వభావాన్ని గుర్తించడం మనం వేయవలసిన తదుపరి అడుగు. నలుపుపై దురభిప్రాయాలు అధికారంలో వేళ్లూనుకున్న సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలు, సంప్రదాయాలలో ఉన్నాయని లోహియా గుర్తించారు.

భారతీయ సమాజంలో ఈ వివక్ష మరో రెండు విధాలుగా కూడా వ్యక్తమవుతోంది: కుల అసమానతలు, దక్షిణ భారతావనిపై ఉత్తర భారతదేశ ఆధిపత్యం. అలా రంగు నిరంకుశత్వానికి ప్రతిఘటన వలసవాద, జాత్యహంకార, జెండర్, కుల ప్రాతిపదిక, ప్రాంతీయ పెత్తనం... మొదలైన రూపాలలోని అన్యాయాన్ని ప్రశ్నించేందుకు దారి తీస్తుంది. రంగుపరమైన వివక్షను ధైర్యంగా ఎదుర్కోవడం విముక్తి రాజకీయాలకు అత్యావశ్యకం. నలుపులోని స్వాభావిక అందం, విభిన్న లక్షణాలను గుర్తించి, అభినందించడం, ప్రోత్సహించడం ద్వారా ఆ విమోచన పోరాటం ప్రారంభమవ్వాలి. ఒక దశాబ్దం క్రితం నటి నందితాదాస్ 'బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్' అనే ఉద్యమాన్ని నిర్వహించారు. నలుపు రంగుపై ప్రజల చైతన్యశీలతను మార్చివేసేందుకు ఉద్దేశించిన ఆ సాహసోపేత ప్రయత్నం స్వల్పకాలం మాత్రమే కొనసాగింది.

> రంగు నిరంకుశత్వానికి ప్రతిఘటన..వలసవాద, జాత్యహంకార, జెండర్, కుల ప్రాతిపదిక, ప్రాంతీయ పెత్తనం... మొదలైన రూపాలలోని అన్యాయాన్ని ప్రశ్నించేందుకు దారి తీస్తుంది. రంగు వివక్షను ధైర్యంగా ఎదుర్కోవడం విముక్తి రాజకీయాలకు అత్యావశ్యకం. నలుపులోని స్వాభావిక అందం, విభిన్న లక్షణాలను గుర్తించి, అభినందించడం, ప్రోత్సహించడం ద్వారా ఆ విమోచన పోరాటం ప్రారంభమవ్వాలి.

తన నల్ల వారసత్వాన్ని ఘనంగా చెప్పుకునేందుకు శారద చాలా సంతోషిస్తున్నారు. 'నలుపు అనేది దేనినైనా గ్రహించగల రంగు. అది మానవ నాగరికతకు తెలిసిన అత్యున్నత శక్తి ప్రవాహం. ఇది అన్ని చోట్లా ఉంటుంది. అది కాటుక విశిష్టత, వానజల్లు వాగ్దానం'. ఈ నలుపు వేడుకలో లోహియా కూడా శారదతో పాటు తప్పక పాల్గొనేవారు: 'జీవితం, సృష్టి మార్మికత, మత్స్య నయనాల సొగసు, గజ గమనం, సంధ్యాసమయంలోని సౌందర్యం మొదలైనవి నల్ల చర్మపు మరింత శోభాయమానమైన అంశాలు' అని ఆయన అన్నారు. అటువంటి ఉత్సవం ఒక రాజకీయ ప్రతిఘటనా చర్య.

మరి ఈ ప్రతిఘటనా రాజకీయాల భవిష్యత్ ఏమిటి? లోహియా తన వ్యాసాన్ని రాసి ఆరున్నర దశాబ్దాలు గడచిపోయాయి; నటి నందితాదాస్ 'డార్క్ ఈజ్ బ్యూటిఫుల్' ఉద్యమాన్ని నిర్వహించి దశాబ్దంకు పైగా గడచిపోయింది. ఏమైనా మార్పు సంభవించిందా? లేదు. వాటి ప్రభావమేమీ లేదు. అయినప్పటికీ శారద తన బిడ్డల గురించి చేసిన ప్రస్తావనలో ఒక ఆశాభావం ఉన్నది: వారు తమ నల్ల వారసత్వాన్ని గొప్పగా భావించారు, చెప్పుకున్నారు. నేను అందాన్ని చూడని ప్రదేశాలలో వారు సౌందార్యాన్ని కనుగొన్నారు. నలుపు మహత్తర రంగు అని వారు భావించారు. దాని శోభకు వారు ఆనందపడ్డారు. ఆ రంగులో నేను సౌందర్యాన్ని చూసేందుకు నాకు తోడ్పడ్డారు. ఆ నలుపు అందమైనది. ఆ నలుపు ప్రకాశవంతమైనది. నేను ఆ నలుపును తవ్వుతున్నాను'. ఈ వ్యాఖ్యల ద్వారా ఆమె రంగుల ప్రమాణాలను సవాల్ చేశారు. అందాన్ని మూల్యాంకనం చేయడంలో ఒక 'సౌందర్యాత్మక విప్లవం' రావాలని లోహియా ఆకాంక్షించారు. అటువంటి విప్లవంతో 'రాజకీయ, ఆర్థిక విప్లవాల మాదిరిగా ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛా పవనాలు వీస్తాయని, మనుషులలో అంతరంగిక శాంతి ఏర్పడుతుందని' ఆయన విశ్వసించారు.

అటువంటి విప్లవానికి మార్గమేమిటి అన్నది స్పష్టంగా తెలియదు. అది కచ్చితంగా సంకుచిత పార్టీ ఆధారిత సంకుచిత రాజకీయ మార్గం కాదని మనకు తెలుసు. అటువంటి విప్లవాత్మక రాజకీయాలు సాంస్కృతిక రాజకీయాలు అవుతాయి. జన మాధ్యమాలు పోత్సహిస్తున్న 'అందం' సంస్కృతిని సవాల్ చేస్తాయి. బహుశా విదేశాలలో విద్యాభ్యాసం చేస్తూ జాతి వివక్షను, రంగు వివక్షను అనుభవించి, తిరిగివచ్చిన యువజనులు అటువంటి ప్రతిఘటనకు నాంది పలకవచ్చు. ఒక శతాబ్దం క్రితం నాటి విదేశీ విద్యావంతులైన యవజనులు జాతీయోద్యమాన్ని బహుముఖంగా అభివృద్ధిపరిచి బలోపేతం చేసిన విధంగా నేటి విద్యాధిక యువత అటువంటి విప్లవాత్మక రాజకీయాలకు మార్గదర్శకులు కావచ్చు. అప్పటివరకు 'అందం రాజకీయాల' పట్ల ప్రతిఘటన కోసం, సర్వజన హితకరమైన శోభస్కరమైన రాజకీయాలను పునరుద్ధరించుకోవడానికి మనం నిరీక్షిస్తూ ఉండాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ధరిత్రికి ట్రంప్ తాపం!


'ఇది శక్తి పరివర్తన (శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధన వనరులపై ఆధారపడడానికి మారడం)కు సమయం కాదు, ఇది శక్తి జోడింపు (కొత్త ఇంధన వనరులు, సాంకేతికతల అభివృద్ధి)కు తరుణమిది' అని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శికి క్రిస్ రైట్ ఉద్ఘాటించారు. గత నెల హ్యూస్టన్‌లో ఒక అంతర్జాతీయ ఇంధన సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ఇంధన కంపెనీల అధిపతులు ఆ రంగ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఆ వార్షిక అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న నాకు మన ప్రపంచం మారిపోయిందన్న వాస్తవం అవగతమయింది. అయినప్పటికీ వాతావరణ మార్పును తిరస్కరిస్తున్న విధానాలు ఎందుకు ప్రాబల్యం పొందుతున్నాయో అర్థం చేసుకోవలసి ఉన్నది. విధ్వంసకర వాతావరణ మార్పు ప్రభావాలను అరికట్టేందుకు శ్రద్ధ చూపకపోతే మానవాళి భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న విపత్కర వాతావరణ వాస్తవాలను గుర్తించకుండా ఊహాలోకంలో ఉండిపోతే ఎలా? ట్రంప్ ప్రభుత్వ ఇంధన విధానం అమెరికా, ఇతర సంపన్న పాశ్చాత్య సమాజాలలో గానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల సమాజాలలో గానీ భారీ మార్పులకు దారితీయదు.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

అమెరికా విధానాలలో మార్పుకు కారణాలు ఏమిటి? మొదటిది అమెరికా ప్రభుత్వం 36 లక్షల కోట్ల డాలర్లకు పెరగడం. రక్షణ రంగంపై చేస్తున్న వ్యయాల కంటే వడ్డీ చెల్లింపులకే ఎక్కువగా ఖర్చు చేయవలసివస్తోంది! ఈ ఇబ్బంది నుంచి బయటపడేందుకు మార్గం పునః పారిశ్రామికీకరణే గానీ పారిశ్రామిక కార్యకలాపాలను, సామర్థ్యాన్ని తగ్గించుకోవడం ఎంత మాత్రం కాదని క్రిస్ రైట్ స్పష్టం చేశారు. ఈ కారణంగా ఆన్ షోర్ తయారీ (దేశంలోనే సరుకులను ఉత్పత్తి చేయడం)కి అగ్ర ప్రాధాన్యమిస్తున్నారు. మరి దేశంలో పెరిగే పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత అధికంగా విద్యుత్ అవసరమవుతుంది. రెండో కారణం అనేక కొత్త రంగాలలో చైనా అగ్రగామిగా పురోగమించడం. సరఫరా గొలుసుల నుంచి విద్యుత్ వాహనాలను ఉత్పత్తి చేయడం, సౌర శక్తి ఉత్పాదనలోను చైనా తిరుగులేని రీతిలో అగ్రగామిగా ఉన్నది. కృత్రిమ మేధ రంగంలో ఆధిపత్య పోటీలో ఎట్టి పరిస్థితులలోను చైనాకంటే వెనుకబడి పోకూడదని ట్రంప్ ప్రభుత్వం సంకల్పించుకున్నది. మరి ఈ పోటీలో నెగ్గాలంటే ఇంధన సాంద్ర డేటా సెంటర్‌లను ఇంతకు ముందు కంటే మరింత వేగవంతంగా నిర్మించుకోవలసి ఉన్నది. అమెరికాలో ఇప్పుడు 5000 డేటా సెంటర్‌లు ఉన్నాయి. ఇవి అమెరికాలోని మొత్తం గ్రిడ్ –ఆధారిత విద్యుత్‌లో 3 శాతాన్ని వినియోగించుకుంటున్నాయి. ఈ విద్యుత్ వినియోగం త్వరలోనే మరింత భారీ స్థాయిలో పెరిగిపోయే అవకాశమున్నది. ఈ దశాబ్దం తుది సంవత్సరాల నాటికే డేటా సెంటర్‌లు వినియోగించుకునే విద్యుత్ 8 నుంచి 12 శాతం మేరకు పెరిగిపోయే అవకాశమున్నది. ఇందుకు విద్యుదుత్పత్తిని గణనీయంగా పెంచవలసిన అవసరమున్నది.



మానవాళికి వాతావరణ మార్పు విపత్తును నివారించాలంటే ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉండాలి. శిలాజ ఇంధనాలను అత్యధికంగా వినియోగించుకోవాలనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానంతో ఆ లక్ష్యం నెరవేరడమనేది దాదాపుగా అసాధ్యం.

మరి విద్యుదుత్పత్తిని భారీ స్థాయిలో పెంచేందుకు వనరులు ఏమిటి? విద్యుత్ సరఫరాకు సౌర శక్తి, పవనశక్తి మొదలైన పునరుత్పాదక వనరులపై ఆధారపడే ప్రసక్తే లేదని ట్రంప్ ప్రభుత్వం తెగేసి చెప్పుతోంది. అమెరికాకు అవసరమైన విద్యుత్‌లో కేవలం 3 శాతాన్ని మాత్రమే పునరుత్పాదక వనరుల ద్వారా సమకూరుతుందని క్రిస్ రైట్ చెప్పారు. ఆ తరహా విద్యుదుత్పత్తికి భారీ పెట్టుబడులు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని కూడా ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో శక్తి పరివర్తన అనేది జరిగేది కాదని ఆయన ముక్తాయించారు. అయితే గత ఏడాది అమెరికాలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదన అధిగమించింది. అమెరికాకు అవసరమైన విద్యుత్‌లో 15 నుంచి 17 శాతం మేరకు పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా ఉత్పత్తి అవుతోంది.

ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టకముందు అధికారంలో ఉన్న జోబైడెన్ ప్రభుత్వం దూరదృష్టి లేకుండా వాతావరణ మార్పును నిరోధించేందుకు ప్రాధాన్యమిచ్చి అందుకనుగుణమైన ఇంధన విధానాలను అనుసరించిందని, ఈ కారణంగానే విద్యుత్ వ్యయం భారీగా పెరిగిపోయిందని ట్రంప్ ప్రభుత్వ అధికారులు విమర్శిస్తున్నారు. విద్యుదుత్పత్తికి శిలాజ ఇంధనమైన సహజ వాయువును గరిష్ఠంగా వినియోగించుకోవాలని ట్రంప్ ప్రభుత్వం సంకల్పించింది (బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని కూడా విరివిగా చేపట్టే ఆలోచన కూడా చేస్తున్నారు). మరి సహజ వాయువును విద్యుదుత్పత్తికి వినియోగించుకోవడమంటే హరిత గృహ వాయువుల ఉద్గారాలు పెరిగిపోవడం ఖాయం. అయితే కార్బన్ మోనాక్సైడ్ (పరిసరాలను కలుషితం చేసే వాయువు)లా కార్బన్ డై ఆక్సైడ్ కాదని కాలుష్యకారక వాయువు కాదని క్రిస్ రైట్ అన్నారు. ఒకటి మాత్రం వాస్తవం: అమెరికా ప్రణాళికలలో వాతావరణ మార్పును నిరోధించేందుకు ప్రాధాన్యం లేదు.

సహజ వాయువును పెద్ద ఎత్తున ఎగుమతి చేసే యోచనలో ట్రంప్ ప్రభుత్వమున్నది. దీని వల్ల భారత్ లాంటి దేశాలలో విద్యుదుత్పత్తికి బొగ్గు బదులు సహజ వాయువు వినియోగం అధికమవుతుందని, తద్వారా కాలుష్యకారక వాము ఉద్గారాలు తగ్గతాయని, వాతావరణ మార్పును అరిట్టేందుకు దోహదం జరుగతుందని ట్రంప్ ప్రభుత్వ అధికారులు వాదిస్తున్నారు (బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిలో కంటే సహజవాయువు ఆధారిత విద్యుదుత్పత్తిలో ఉద్గారాలు తక్కువగా ఉంటాయి). సహజవాయువు ఉత్పత్తి, వినియోగం ద్వారా మిథేన్ ఉద్గారాలను తగ్గించేందుకు పెట్టుబడులు పెట్టే విషయం కూడా పరిశీలనలో ఉన్నది. అయితే ట్రంప్ ప్రభుత్వంలో వాతావరణ మార్పునిరోధాన్ని గట్టిగా పట్టించుకునే అధికారి ఒక్కరూ లేరు అన్నది వాస్తవం. అణు విద్యుదుత్పత్తిని ఇతోధికంగా పెంచే విషయమై అమెరికా మళ్లీ దృష్టి కేంద్రీకరిస్తోంది. ఉదజని విద్యుత్ (హైడ్రోజన్ పవర్)ను అభివృద్ధిపరుచుకునే ప్రణాళికలు ఏవీ సఫలం కాలేదు. దీంతో బ్రౌన్ ఎనర్జీపై ఆధారపడడానికి ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

ఇక్కడే అసలు సమస్య ఉంది. 2030 సంవత్సరం నాటికి తమ హరిత గృహ వాయువుల ఉద్గారాలను 50 శాతం మేరకు తగ్గిస్తామని అమెరికా హామీ ఇచ్చింది. ఆ హామీ సంగతి ఏమోగానీ అమెరికాలో ఆ ఉద్గారాలు మరింతగా పెరిగిపోయే అవకాశం స్పష్టంగా ఉన్నది. దీనివల్ల గ్లోబల్ కార్బన్ బడ్జెట్‌లో అమెరికా వాటా మరింతగా పెరిగిపోవడం ఖాయం. నిజానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని అమెరికా లాంటి దేశాలు సత్వరమే పూర్తిగా తగ్గించుకోవాలి. అందుకు మారుగా వాటి వినియోగాన్ని మరింతగాపెంచుకోవడానికి అమెరికా సంసిద్ధమయింది. మానవాళికి వాతావరణ మార్పు విపత్తును నివారించాలంటే ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉండాలి. అమెరికా బ్రౌన్ ఎనర్జీ విధానంతో ఆ లక్ష్య సాధన దాదాపుగా అసాధ్యం. ముంచుకువస్తోన్న ప్రమాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలనే నేను ఇది రాస్తున్నాను. వాస్తవాలను విస్మరించి గాలి మేడలు కట్టుకోకూడదు. చారిత్రకంగా గరిష్ఠంగా కాలుష్యకారక వాయు ఉద్గారాలకు, ఏటా హరిత గృహ వాయువుల ఉద్గారంలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న అమెరికా బ్రౌన్ ఎనర్జీ విధానం (శిలాజ ఇంధనాలను అత్యధికంగా వినియోగించుకోవడం) పర్యవసానాలు భయానకంగా ఉంటాయి.. మనం ఏమి చేయాలి?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

సహకార రుణవ్యవస్థ: రెండంచెల విధానం అవశ్యం

భారతదేశంలో సహకార రుణ వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉంది. ప్రస్తుతం మన దేశంలోని కొన్ని రాష్ట్రాలలో మూడంచెల సహకార రుణ వ్యవస్థ, మరికొన్ని రాష్ట్రాలలో రెండంచెల సహకార రుణ వ్యవస్థ అమలులో ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకు అనే మూడు దొంతరల విధానం కొన్ని రాష్ట్రాలలో అమలులో ఉంది. నాబార్డ్ నుంచి రాష్ట్ర సహకార బ్యాంకులకు, అక్కడి నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు, వాటి నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, చివరగా రైతుకు వ్యవసాయ రుణం అందించబడుతోంది.

ప్రతి దొంతరలోనూ 1 లేక 2శాతం వడ్డీ మార్జిన్ వేసుకుని రుణాలు అందిస్తుంటాయి. అందువల్ల, వ్యవసాయ రుణాల వడ్డీలు రైతాంగానికి తలకు మించిన భారంగా తయారయ్యాయి. ఫలితంగా 'స్వల్ప వడ్డీరేట్లు లేదా పావలా వడ్డీకే వ్యవసాయ రుణాలు' అన్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. తద్వారా అధిక వడ్డీల భారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడింది.

మరికొన్ని రాష్ట్రాలలో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రాష్ట్ర సహకార బ్యాంకు అనే రెండు దొంతర్ల వ్యవస్థ అమలులో ఉంది. ఈ విధానంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు లేవు. వాటి స్థానంలో, రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలు పని చేస్తూ, స్వల్ప వడ్డీరేట్లకే వ్యవసాయ రుణాలు అందిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని సహకార వ్యవసాయ బ్యాంకింగ్ వ్యవస్థలో కూడా సంస్థాగత మార్పులు తీసుకురావాలని గత 50 ఏళ్లుగా అనేక ఆందోళనలు జరుగుతున్నాయి. 1972లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఆధ్వర్యంలో సహకార బ్యాంకు ఉద్యోగుల జాతీయ సదస్సు హైదరాబాదులో జరిగింది. మొదటి దశలో– సహకార రుణ వ్యవస్థలో దీర్ఘకాలిక రుణాలను అందించే సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను, పంట రుణాలు లాంటి స్వల్పకాలిక రుణాలను అందించే జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను విలీనం చేయాలని, తద్వారా సింగిల్ విండో విధానాన్ని అమలు జరపాలని ప్రభుత్వాలకు ఆ సదస్సు విజ్ఞప్తి చేసింది. రెండవ దశలో– జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రద్దుచేసి, రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలుగా మార్చాలని, తద్వారా రెండంచెల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని జాతీయ సదస్సు డిమాండ్ చేసింది.

> సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం కావాలంటే, రెండంచెల విధానాన్ని అమలు జరపటం తప్ప మరో మార్గం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి స్వల్ప వడ్డీరేట్లకు, సకాలంలో, అధిక మొత్తాలలో వ్యవసాయ రుణాలను సజావుగా అందించాలంటే ఈ మార్పులు అవశ్యం. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రద్దు కావడం వల్ల, వ్యవసాయ రుణాల పంపిణీలో జాప్యం తగ్గుతుంది.



ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 1987 ఏప్రిల్ 1 నుంచి 'సింగిల్ విండో' విధానాన్ని నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అమల్లోకి తీసుకువచ్చారు. అంటే సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను రద్దు చేసి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో విలీనం గావించారు. అప్పటి నుంచి, పంట రుణాలు లాంటి స్వల్పకాలిక రుణాలతో పాటు, దీర్ఘకాలిక రుణాలను సైతం ఒకే చోట నుంచి పంపిణీ చేస్తున్నారు. అయితే 'రెండంచల విధానం అమలు' అనే లక్ష్యం అలాగే మిగిలిపోయింది.

ఈ లక్ష్యసాధన కోసం, జాతీయ స్థాయిలో ఏఐబీఈఏ నాయకత్వంలో అనేక ఆందోళనలు జరిగాయి. మన రాష్ట్రంలో సైతం వేలాదిమంది రైతులు, ఉద్యోగులతో ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు జరిగాయి. లక్షలాది ప్రజల నుంచి సంతకాల సేకరణ జరిగింది. వివిధ రాజకీయ పార్టీల, ప్రజాప్రతినిధుల, మేధావుల, సహకారవేత్తల మద్దతుతో అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రద్దుచేసి, రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలుగా విలీనం చేయడం ద్వారా, రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలనీ, తద్వారా వ్యవసాయ రుణాల వడ్డీభారం నుంచి రైతాంగానికి విముక్తి కల్పించడమేగాక, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలన్న డిమాండ్‌కు సర్వత్రా ఆమోదం లభించింది. అయితే రాష్ట్ర విభజన అంశం ముందుకు రావడం వల్ల, ఈ విషయం మరుగున పడిపోయింది.


ఇప్పటికైనా సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం కావాలంటే, రెండంచెల విధానాన్ని అమలు జరుపటం తప్ప మరో మార్గం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి స్వల్ప వడ్డీరేట్లకు, సకాలంలో, అధిక మొత్తాలలో వ్యవసాయ రుణాలను సజావుగా అందించాలంటే ఈ మార్పులు అవశ్యం. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రద్దు కావడం వల్ల, వ్యవసాయ రుణాల పంపిణీలో జాప్యం తగ్గుతుంది. మూడు దొంతరల మధ్య సమన్వయం కంటే, రెండు దొంతర్ల మధ్య సమన్వయం తేలిక. పాలన నేరుగా రాష్ట్ర సహకార బ్యాంకు పరిధిలోకి వస్తుంది. దాంతో అవినీతి లేదా నిర్వాహక లోపాలు నివారించటం సులువు. నిధుల అందుబాటు వేగంగా ఉంటుంది. రాష్ట్ర సహకార బ్యాంకు నుంచి నేరుగా పీఏసీఎస్‌కు, ఆ వెంటనే రైతాంగానికి రుణాలు అందుతాయి. బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణ సరళంగా ఉంటుంది. బ్యాంకు పాలనా పరిధి రాష్ట్రమంతటికీ విస్తరించటం వల్ల, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సమర్థంగా అందించవచ్చు. ప్రజల విశ్వాసం చూరగొనవచ్చు. కార్యకలాపాల నిర్వహణలో, అనవసర కాలయాపన, ద్వంద్వ ప్రమాణాలకు అవకాశం ఉండదు. డిజిటల్ లావాదేవీలు వేగంగా, సులభంగా జరుగుతాయి. రాష్ట్ర సహకార బ్యాంకుకు 'షెడ్యూల్డ్' హోదా లభిస్తుంది. కనుక, గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ వ్యవస్థను విస్తరింపజేసి, ఆ ప్రజల అవసరాలు తీర్చటంలో రెండంచెల విధానం ఉత్తమం.

సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానమైనది నిరంతర రాజకీయ జోక్యం. సహకార సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడం, రుణాల మంజూరు, వసూళ్లలో మితిమీరిన రాజకీయ జోక్యంతో అనేక బ్యాంకులు సంక్షోభంలోకి వెడుతున్నాయి. రెండంచెల విధానం వల్ల, అడ్డగోలు రాజకీయ జోక్యాన్ని నివారించటం సాధ్యమవుతుంది. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించేందుకు బ్యాంకులకు స్వతంత్రత లభిస్తుంది. కామన్ అకౌంటింగ్ సిస్టం, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర సహకార బ్యాంకు ఒక సమిష్టి వేదికగా వ్యవహరిస్తుంది.

రెండంచెల విధానం బ్యాంకుల అభివృద్ధికి దోహదం చేస్తుందని, రైతాంగానికి సమర్థంగా సేవలు అందిస్తుందని అనేక కమిషన్లు సిఫారసు చేశాయి. ఖైదాన్ కమిటీ (1958), భావే కమిటీ (1975), రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ హజారే కమిటీ (1975), బ్రహ్మాండం కమిటీ (1995), శివాజీరావు పాటిల్ ఆధ్వర్యంలోని సహకార వ్యవస్థపై ఉన్నతస్థాయి కమిటీ (2009), చౌదరి కమిటీ (1999), ప్రకాష్ బక్షి కమిటీ (2012), ఇంకా అనేక ఉన్నతస్థాయి కమిటీలు రెండంచెల విధానానికి మొగ్గుచూపాయి. ఖర్చులు తగ్గించాలంటే దొంతర్లను తగ్గించాల్సిందేనని నరసింహన్ కమిటీ తేల్చి చెప్పింది. ఇంకా ఖుస్రో, డాక్టర్ వైద్యనాథన్, కపూర్ కమిటీలు సైతం ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా, సహకార బ్యాంకింగ్‌లో వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలని సిఫారసు చేశాయి.

సిఎస్ రంజిత్ కమిటీ సిఫారసు మేరకు కేరళలో, వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రెండంచెల విధానాన్ని అమలులోకి తెచ్చింది. అరుణాచల్‌ప్రదేశ్, చండీఘర్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, జార్ఖండ్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలలో రెండంచెల విధానం అమలులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పంజాబ్, బిహార్ తదితర రాష్ట్రాలలో రెండంచెల విధానం అమలు దిశగా ఉన్నతస్థాయి కమిటీలను నియమించారు. రెండంచెల విధానం అమలు జరపాలనుకునే రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బతికి బట్టకట్టాలంటే, రెండంచెల విధానం అమలుకు చర్యలు చేపట్టాలి.

■ వెలుగూరి రాధాకృష్ణమూర్తి
ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు



శతాబ్దాల చరిత్ర కలిగిన పటమటలోని నల్లూరి వారి ధర్మతోట భూముల వ్యవహారం రచ్చకెక్కింది. నల్లూరి వారి ధర్మతోట భూముల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఇప్పటికే దేవదాయ శాఖ పరిధిలోకి రాగా, దీనికి అనుబంధంగా ఉన్న నల్లూరి వారి కళ్యాణ మండపం కూడా దేవదాయ శాఖకే చెందుతుందని తాజాగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో నల్లూరి వారి కళ్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకునేందుకు దేవదాయశాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

వివాదాల నల్లూరి

రచ్చకెక్కిన నల్లూరి వారి ధర్మతోట భూముల వ్యవహారం

కళ్యాణ మండపం స్థలం దేవదాయశాఖదేనని తేల్చిన న్యాయస్థానం

- స్వాధీనానికి దేవదాయ శాఖ సన్నద్ధం
- వారం రోజుల్లో అప్పగించకపోతే రెవెన్యూ, పోలీసుల సహకారంతో స్వాధీనం!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కోర్టు తీర్పు నేపథ్యంలో నల్లూరి వారి కళ్యాణ మండపాన్ని వారం రోజుల్లో స్వాధీనం చేసుకునేందుకు దేవదాయశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కళ్యాణ మండపాన్ని నిర్వహిస్తున్న ఫౌండర్ ట్రస్టీకి దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇచ్చి, కళ్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకునేందుకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నారు. ఫౌండర్ ట్రస్టీ వర్గాలు సహకరించని పక్షంలో రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో కళ్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకునేందుకు దేవదాయశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇటీవలే హైకోర్టు తీర్పుననుసరించి దరివిలా తీసుకోవాల్సిన అంశాలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ అధికారికి సవివర నివేదికను అందించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు కళ్యాణ మండపం స్వాధీనానికి చర్యలు చేపడుతున్నారు.

వీడని మిస్టరీ

నల్లూరి వారి ధర్మతోట భూముల వ్యవహారంపై మిస్టరీ వీడటం లేదు. నల్లూరి వంశీకుల పూర్వీకులకు ఎవరి నుంచి ఈ భూములు సంక్రవించాయి? ఏ ఉద్దేశ్యంతో ఈ భూములు ఇచ్చారు? ఈ భూములను ఎలాంటి కార్యకలాపాలకు వినియోగించాలి! ఈ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని దేని కోసం ఖర్చు చేయాలి? వందేళ్ల చరిత్ర ఉండటంతో కాలక్రమంలో ఫౌండర్ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్న వారు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? వాటి పర్యవసానాలు ఏమిటి? నల్లూరి వారి ధర్మతోట భూములు దేవదాయ శాఖ పరిధిలోకి ఎప్పుడు వచ్చాయి ? వంటివి మిస్టరీగా ఉన్నాయి. ఈ వ్యవహారాలను అటు ఫౌండర్ ట్రస్టీ వారసులు కానీ, ఇటు దేవదాయ శాఖ అధికారులు మాత్రమే చెప్పగలరు. గతంలో ఏం జరిగిందన్న దానిపై కూడా అటు ట్రస్టీ నిర్వాహకులకు కానీ, ఇటు దేవదాయ శాఖ అధికారులకు కానీ పూర్తి సమాచారం లేదని తెలుస్తోంది.

కమిషనర్‌కు అర్చకుడి ఫిర్యాదు

నల్లూరి ధర్మ తోట భూమిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు అయిన కే రాజగోపాలచారి తాజాగా దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నల్లూరి వారి ధర్మతోటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ఉపాలయాలకు చెందిన భూములు, కళ్యాణ మండపం వంటి వాటిని స్వాధీనం చేసుకోవటంలో తాత్సారం చేస్తున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ఇచ్చినా కూడా చర్యలు తీసుకోవటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని తెలిపారు. దీంతో దేవదాయయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో రంగలోకి దిగారు.

భూములన్నీ దేవదాయశాఖవేనా?

నల్లూరి ధర్మతోట భూములన్నీ కూడా దేవదాయశాఖవేనా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. సర్వే నంబర్ 62/1లో వెంకటేశ్వరస్వామి దేవస్థానం, కళ్యాణ మండపం, ఎస్ఎస్ఎం హైస్కూల్ వంటివి ఉన్నాయి. ఇవన్నీ కూడా ఒకే సర్వే నంబర్‌లో ఉన్నాయి. ఎక్కడా సబ్ డివిజన్ జరిగలేదు. ఈ భూములన్నీ కూడా దేవదాయ చట్టం పరిధిలోకి వచ్చినందున అన్నింటిపైనా తమకు హక్కు ఉందని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ భూములకు దేవదాయ శాఖ మాత్రమే పూర్తి హక్కుదారు అని పేర్కొంటున్నారు. దీనికి తమ దగ్గర అన్ని సాక్ష్యాలు ఉన్నాయని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు కానీ వాటిని బయట పెట్టడం లేదు. దీంతో ఈ భూములన్నీ దేవదాయశాఖ పరిధిలోకి వస్తాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



హైకోర్టులో ఎన్ఎస్ఎం హైస్కూల్ వివాదం

నల్లూరి సెయింట్ మాథ్యూస్ (ఎస్ఎస్ఎం) స్కూల్ వివాదం కూడా హైకోర్టులో నడుస్తోంది. దేవదాయ శాఖ అధికారులు ఇది కూడా తమ దేవదాయ శాఖ స్థలమేనని వాదిస్తున్నారు. అరవై సంవత్సరాల కిందట పేద పిల్లలకు విద్యాదానం చేసేందుకు ఎస్ఎస్ఎం స్కూల్‌కు నల్లూరి వంశీకుల పూర్వీకులు ఉచితంగా ఇచ్చారని వారి వారసులు చెబుతున్నారు. వారికి దానంగా ఇచ్చిన భూముల్లో స్కూల్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు సెయింట్ మాథ్యూస్ స్కూల్‌కు ముందు నల్లూరి అని చేర్చారు. నల్లూరి ట్రస్ట్‌కు సంబంధించిన వారికి ఆ స్కూల్‌లో సీట్ల

మిగతా 6లో..

తిరువూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్

కస్తూరిబాయి రాజీనామా

మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందజేత

- అన్యాయం చేసిన వాళ్లని ఆ దేవుడే చూసుకుంటాడంటూ భావోద్వేగం
- వివాదం సద్దుమణుగుతుందా ? కొత్త వివాదం తలెత్తుతుందా?

మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తున్న ఛైర్‌పర్సన్ కస్తూరిబాయి



తిరువూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అనేక రాజకీయ పరిణామాల మధ్య తిరువూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి తన పదవికి రాజీనామా చేశారు. 'పై నుంచి భగవంతుడు చూస్తున్నాడు. నాకు అన్యాయం చేసిన వాళ్లని ఆయనే చేసుకుంటాడు' అంటూ భావోద్వేగంతో మాట్లాడారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కస్తూరిబాయి తన పదవికి రాజీనామ చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు ఆయన చాంబర్‌లో తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి బాయి మాట్లాడుతూ 2021లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి మాల సామాజిక వర్గానికి చెందిన తనను మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ప్రకటించారని తెలిపారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తన పట్ల ద్వేషంతో ఐక్యంగా ఉన్న కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టారని ఆరోపించారు. తిరువూరు పట్టణంలో డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌ను రూపొందించకుండా అడ్డుపడి, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.4 కోట్లు నిధులు వెనక్కి వెళ్లేందుకు

మిగతా 6లో..

ఏడాది పాలనను కుంటుపడేశారు..

ప్రజలు వైసీపీకి ఐదేళ్ల అధికారం ఇస్తే పదవి కోసం కుమ్ములాడుకుంటూ ప్రజా సమస్యలు, అభివృద్ధిని విస్మరించారని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ షేక్ అబ్దుల్‌హుస్సేన్ విమర్శించారు. బోర్డు పాలన మరో సంవత్సరం మాత్రమే ఉందని చెప్పారు. ఇప్పుడు ఛైర్‌పర్సన్ రాజీనామా చేయడం వల్ల తిరిగి మరొకర్ని ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు ఎంతకాలం పడుతుందోనన్నారు. అప్పటి వరకు పాలన కుంటుపడుతుందని వివరించారు.

వాటా కోసం వచ్చి ప్రాణాలు తీసుకుంది!

'తండ్రి' బీమా సొమ్ములో వాటా అడిగిన కుమార్తె

- మరొకరితో సహజీవనం చేస్తూ కుదరదన్న తల్లి
- ప్రియుడితో కలిసి కుమార్తెపై దూషణలు
- మనస్తాపంతో తల్లి ఇంటికి సమీపంలో ఆత్మహత్య



ఆస్పత్రిలో మౌనిక మృతదేహం

విజయవాడ/చిట్టినగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణించడంతో తల్లికి వచ్చిన బీమా సొమ్ములో వాటా తీసుకోవడానికి వచ్చిన కుమార్తెను తల్లి, తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి దూషించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయవాడలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... చిట్టినగర్‌కు చెందిన గుత్తికొండ రమాదేవి భర్త మోహనరావు కొద్దినెలల క్రితం చనిపోయాడు. ఆయన చెల్లించిన బీమాకు సంబంధించి రూ.6లక్షలు రమాదేవికి అందాయి. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె విజయలక్ష్మి తల్లి ఇంటికి సమీపంలో ఉంటోంది. చిన్న కుమార్తె కామిశెట్టి మౌనిక భర్తతో కలిసి విశాఖపట్నంలో నివాసం ఉంటోంది.

కుమార్తెపై పోలీసులకు తల్లి ఫిర్యాదు

తండ్రి బీమా సొమ్ములు తల్లికి అందాయన్న విషయం తెలుసుకున్న మౌనిక కొద్దిరోజుల క్రితం తల్లి రమాదేవి వద్దకు వచ్చింది. అప్పుడప్పుడు సమీపాన ఉన్న అక్క విజయలక్ష్మి ఇంటికి వెళ్లి వస్తోంది. భర్త మరణించిన తర్వాత రమాదేవి వెంకటేశ్వరరావు అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ విషయం తెలిసి అనేక సార్లు తల్లిని మౌనిక మందలించింది. విశాఖకు వచ్చి తన వద్ద ఉండాలని చెప్పింది. దీన్ని రమాదేవి పెద్దగా పెట్టించుకోలేదు. ఈ క్రమంలో మౌనిక తనకు రావాల్సిన వాటా ఇవ్వాలని తల్లి రమాదేవిని గట్టిగా

మిగతా 6లో..

తల్లీ కుమార్తెల మధ్య రాజీ కోసం లంచం

కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటాద్రిపై పలు ఆరోపణలు వస్తున్నాయి. మార్చి 30వ తేదీన రమాదేవి నుంచి ఫిర్యాదు తీసుకున్న తర్వాత స్టేషన్‌కు రావాలని పలుమార్లు ఆయన మౌనికకు ఫోన్లు చేశారు. దీనికి ఆమె వస్తానని జవాబు ఇస్తూనే రోజులు గడిపింది. తర్వాత వెంకటాద్రి ఫోన్ చేసి ఈ కేసును రాజీ చేస్తానని మౌనికకు భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించి ఆమె నుంచి కొంత మొత్తాన్ని ఫోన్‌పే చేయించుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని మౌనిక సోదరి విజయలక్ష్మి, బంధువులు చెబుతున్నారు. ఫోన్‌పే వ్యవహారం ఇన్‌స్పెక్టర్ కొండలరావు దృష్టికి వెళ్లింది. దీనిపై ఆయన అంతర్గతంగా విచారణ చేశారు. ఫోన్‌పే ఆరోపణల్లో వాస్తవం ఉందని ఆయన నిర్ధారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బెంజ్ సర్వీసు రోడ్డు బాధితులకు మెరుగైన పరిహారం!

గజం రూ. 1.10 లక్షలు ఇచ్చేందుకు అవకాశం!

కేంద్రం ఆదేశాలను వెలుగులోకి తెచ్చిన బాధితులు

ఒకే ప్రాంతంలో భూమిని సేకరించేటపుడు గరిష్ట ధర వర్తింపు చేయాలి

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసిన బాధితులు
- ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే
- రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రతిపాదన కోరిన ఎన్‌హెచ్
- సీఎం చంద్రబాబు దృష్టికి విషయం.. కమిటీ ఏర్పాటు
- బాధితులతో మాట్లాడిన తర్వాత కేంద్రానికి నివేదిక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెంజ్ సర్కిల్ సర్వీసు రోడ్డు బాధితులకు ఏకీకృత పరిహారం అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవతో బెంజిసర్కిల్ సర్వీసు రోడ్డు బాధితులకు న్యాయం జరగబోతోంది. బెంజి సర్కిల్ సర్వీసు రోడ్డుకు సంబంధించిన పరిహారం విషయంలో ఎన్‌హెచ్ అధికారులు వ్యవహరించిన తీరు తమకు అన్యాయం చేసే విధంగా ఉందని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, సుప్రీం కోర్టు తీర్పులను దాచి పెట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రాంతాల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం భూములు తీసుకోవాల్సి వస్తే ఒకే ప్రాంతంలో సేకరించే భూములకు అత్యధికంగా ఉన్న ఒకే రేటును అమలు చేయాలన్న నిబంధన ఉంది. ఈ నిబంధన ఉన్న విషయం తెలుసుకున్న బాధితులు కాస్త ఆలస్యంగా స్పందించారు. అప్పటికే బాధితులకు అంతకు ముందు ఎన్‌హెచ్ అధికారులు నిర్దేశించిన పరిహారాన్ని తీసుకున్నారు. సర్వీసు రోడ్డు వెంబడి గజం రూ.34 వేలు, రూ.39 వేలు, రూ.84 వేలు, రూ.1.10 లక్షలు ఇలా వేర్వేరు రేట్లను నిర్దేశించారు. ఇలా కాకుండా అందరికీ కూడా రూ. 1.10 లక్షలు ఇవ్వాలని, దీనికి కేంద్రం ఇచ్చిన ఆదేశాలను చూపుతూ తమకు అమలు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనిపై తొలుత జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించకపోవటంతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఎన్‌హెచ్ అధికారులను సంప్రదించగా.. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన పంపించాల్సిందిగా సూచించారు. దీనిపై గద్దె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. దీనిపై చంద్రబాబు ఒక కమిటీని వేశారు. ఈ కమిటీ బాధితులతో చర్చించిన మీదట తగిన నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదించనుంది. ఈ నిర్ణయం వల్ల బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ వెంబడి కూడా బాధితులకు ఇదే రకమైన పరిహారం అందనుంది.



శివరూపిణీ నమోస్తుతే..

- కనకదుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన

6లో

ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ యాత్ర

- వేసవి టూర్ ప్యాకేజీల విడుదల
- 8 నుంచి యాత్ర ప్రారంభం

8లో



లీజుకు ఇచ్చిన 23 ఎకరాల చెరువు

కండ్రికలో చెరువు లీజు దందా!

64వ డివిజన్‌లో 23 ఎకరాల చెరువు

- కార్పొరేషన్ అనుమతి లేకుండా చెరువు కమిటీ పేరుతో లీజుకు..
- ఐదేళ్లకు రూ.25 లక్షలకు లీజు అగ్రిమెంటు
- చెరువులో చేపల పెంపకం.. ఆహారంగా వ్యర్థాల వినియోగం
- స్థానికుల పొలాలు, పశువులకు నీరు ఇవ్వకుండా అడ్డగింత

పాయకాపురం/వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో సుమారు 23 ఎకరాల చెరువు ఉంది. స్థానికంగా ఉన్న కొందరు కార్పొరేషన్ అనుమతి లేకుండా చెరువు కమిటీ పేరుతో వేరే వ్యక్తులకు ఏడాదికి రూ.5లక్షలు చొప్పున ఐదేళ్లకు గాను రూ.25 లక్షలకు లీజుకు ఇచ్చారు. లీజుదారులు ఆ చెరువులో చేపల పెంపకం చేపట్టారు. వ్యర్థాలను చేపల మేత కోసం వినియోగిస్తున్నారు. చెరువులోని నీటిని స్థానిక పొలాలకు, పశువులకు ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో కండ్రిక, పాతపాడు ప్రాంతాల్లో ఉన్న సుమారు రెండు వేల పశువులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాయి. పశువుల యజమానులు, రైతులు పలుసార్లు లీజుదారులతో మాట్లాడి చెరువులో వ్యర్థాలు వేయవద్దని కోరినా వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారుల అనుమతి లేకుండా కొందరు చెరువు కమిటీ పేరుతో చెరువును లీజుకు ఇవ్వటమేమిటని ప్రశ్నిస్తున్నారు. వేసవి కాలంలో నీరు అందుబాటులో లేకపోవటం వలన పశువులు ఇబ్బందులు పడుతున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అనుమతి లేకుండా చెరువును లీజుకు ఇచ్చి, కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పిచ్చి చెట్లతో నిండిన ఏఎంసీలో కోల్డ్ స్టోరేజి బేస్‌మెంట్ ప్రాంతం, శిలాఫలకం

అటకెక్కిన గిడ్డంగి పనులు

- రైతుల పాలిట శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ విధానాలు
- ఏఎంసీలో కోల్డ్ స్టోరేజ్ పనులు అర్ధాంతరంగా నిలిపివేత
- పిచ్చిచెట్లతో నిండిపోయిన బేస్‌మెంట్, శిలాఫలకం

8లో

మహిళల భద్రత, రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

8లో

గొంతు ఎండతోంది!



ఇబ్రహీంపట్నం బుడిద చెరువు వెళ్లే దారిలో దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో తడిపిన నీటి గుంతలో దాహార్తి తీర్చుకుంటున్న వానరాలు



గోలిసోడాతో గొంతు తడుపు కుంటున్న బాలుడు

రోజు రోజుకీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి.. వేసవి తాపానికి మనుషులే కాదు.. సకల జీవరాశులు అల్లాడుతున్నాయి. గుక్కెడు నీటికోసం తహతహలాడుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ప్రాణాలు నిలుపుకునేందుకు మనుషులు శీతల పానీయాల వైపు చూస్తుంటే.. గుక్కెడు నీరు దొరికితే చాలు గొంతు తడుపుకుంటాం.. దేవుడా! అంటూ వానరాలు గుంతల్లో నీటికోసం పరుగుపెడుతున్నాయి. ఉష్ణ తాపం తాళలేక పశువులు కాలువల్లో నుంచి బయటకు రావడంలేదు.

- ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి

కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య బుడమేరు డైవర్షన్ కెనల్ నీటిలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్న పశువులు



కడలి కోత!

ఎదురుమొండి-గొల్లమంద రహదారికి మోక్షమెప్పుడో?

(అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గంలో దివి గ్రామసమూహమైన ఎదురుమొండి దీవుల్లో సముద్రపు అటుపోట్ల కారణంగా ఏర్పడిన భూమి కోత నివారణ కోసం ఎదురుమొండి-గొల్లమంద నడుమ రహదారి నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించి నెలలు గడుస్తున్నా పనులు కాగితాలకే పరిమితమవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు.. నది గమన దిశలో అనూహ్య మార్పుల కారణంగా గడిచిన ఆరేళ్లుగా ఎదురుమొండి దీవులు సముద్రపు అటుపోట్లు కారణంగా కోతకు గురవుతున్నాయి. దీనికి తోడు ప్రతీ ఏటా క్రమం తప్పకుండా వస్తున్న భారీ వరదలు కోతను మరింత తీవ్రతరం చేయటంతో ఎదురుమొండి-గొల్లమంద గ్రామాల నడుమ దాదాపు 30మీటర్ల మేర వెడల్పు దాదాపు కిలోమీటరు పొడవున భూమి కోతకు గురైంది. కృష్ణానది బ్యాక్ వాటర్ పాయ రహదారి సైతం కనుమరుగైంది. కోత కారణంగా రహదారి పూర్తిగా నదిలో కలసిపోయే పరిస్థితి రావటంతో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.1.7 కోట్లతో అంచనాలు రూపొందించారు.. అయితే పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ వరదల కారణంగా కోత మరింత తీవ్రం కావటంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి పంటుపై గొల్లమంద ప్రాంతాన్ని పరిశీలించారు. కోత నివారణ చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడి పరిస్థితిని డ్రోన్ ద్వారా వీడియో తీసి ప్రభుత్వానికి పంపడంతో కోత నివారణకు ఎదురుమొండి నుంచి గొల్లమంద వరకు రహదారిని నిర్మించాలని, కోత తీవ్రంగా ఉన్న ప్రాంతంలో సాంకేతికతను వినియోగించి ఆటుపోట్ల ప్రవాహ వేగాన్ని నియంత్రించాలని ప్రభుత్వం భావించింది. దీనిలో భాగంగానే రూ.13.45 కోట్లు మంజూరయ్యాయని జనవరిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు.

- నదీగర్భంలో కలిసిపోతున్న దీవులు
- రూ.13.45 కోట్లు మంజూరైనా కాగితాలు దాటని రహదారి పనులు
- అలల తాకిడికి తీవ్రమవుతున్న కోత
- ప్రమాదకర ప్రాంతంలోనే ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు



గొల్లమంద వద్ద నదిలోకి జారిపోతున్న భూమి



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కాగితాలు దాటని పనులు

ఎదురుమొండి-గొల్లమంద మధ్య ఏర్పడిన కోత నివారణ కోసం ఎదురుమొండి-జింకపాలెం గ్రామాల మధ్య ఉన్న పాత రహదారిని అభివృద్ధి పర్చటంతో పాటు దాదాపు కిలోమీటరు మేర నదిలో కలిసిపోయిన ప్రాంతంలో భూ సేకరణ చేసి అక్కడ కొత్త రహదారిని నిర్మించాలని ప్రభుత్వం భావించింది. త్వరలోనే శంకుస్థాపన జరుగుతుందని, కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు.. కానీ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. రెండు నెలలపాటు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా టెండర్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడినా.. ఎన్నికలు ముగిసి నెలరోజులు కావొస్తున్నప్పటికీ పనులకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి ముందడుగు పడకపోవటం పట్ల దీవుల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మూడు నెలలే కీలకం

ఎదురుమొండి-గొల్లమంద గ్రామాల మధ్య ఏర్పడిన కోత విషయంలో ఏ పనులు నిర్వహించాలన్నా ఈ మూడు నెలలే కీలకమని, ఆ తర్వాత పనులు నిర్వహించాలంటే వర్షాలు, వరదలు పనులకు ఆటంకం కలిగిస్తాయని, ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని ఎదురుమొండి వాసులు కోరుతున్నారు. గడిచిన ఆరేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి వెళుతున్నారే గానీ పనులు ప్రారంభం కావటం లేదని, కూటమి ప్రభుత్వంలో రూ.13.45 కోట్లు మంజూరైనా పనులను ఇంకా ఎందుకు ప్రారంభించటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కోత అటవీ భూముల వరకు చేరుకుందని, అది కొద్ది అడుగులు పెరిగితే ఆ ప్రాంతంలో భూ సేకరణకు కూడా అటవీ నిబంధనల కారణంగా వీల్లేని పరిస్థితి ఏర్పడుతుందని దీవుల వాసులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన ఆగస్టు నుంచి ఇప్పటి వరకు దాదాపుగా మరో ఏడు అడుగుల వెడల్పున కోత పెరిగిందని, నెలరోజుల్లో పనులు ప్రారంభించకుంటే కోత అటవీ భూముల వరకు చేరుకుంటుందని, అదే జరిగితే ఎదురుమొండి-జింకపాలెం గ్రామాల నడుమ రహదారి ఊసే మరిచిపోవాల్సిన పరిస్థితి వస్తుందని గొల్లమంద, జింకపాలెం, బ్రహ్మయ్యగారి మూల ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల మరింతగా కోత

ప్రమాదకర ప్రాంతాల్లోనే తవ్వకాలు

ఓ వైపు ఎదురుమొండి దీవుల మనుగడ ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో గొల్లమంద సమీపంలోనే కొందరు అక్రమార్కులు ప్రతినిత్యం ఇసుక, బుసక తవ్వకాలు సాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో గొల్లమంద ప్రాంతంలో కోతకు గురైన చోట ఇసుక, బుసకను తవ్వి తీసి అమ్ముకుంటున్నారని, దీని కారణంగా కోత మరింతగా పెరగటంతోపాటు భూమి కరుగుదల వేగం ఎక్కువవుతున్నదని, అధికారులు స్పందించి ఎదురుమొండి దీవుల చుట్టూ నదిలో నుంచి ఇసుక, బుసక వెలికి తీయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మల్లెలు, మందార పుష్పాలతో అర్చన

శివరూపిణో నమోస్తుతే..

» కనకదుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చైత్రమాస నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పుష్పార్చనల కార్యక్రమంలో ఐదో రోజైన గురువారం తెల్లజిల్లేడు, మారేడు, తులసి దళాలు, మల్లెలు, మందార పుష్పాలతో అర్చించారు. దుర్గమ్మను శివరూపిణిగా కూడా కొలుస్తారు. శివుడిగా భావించి మారేడు పత్రాలతో పూజిస్తారు. దుర్గా స్వరూపం త్రిమూర్తుల దివ్యశక్తుల నుంచి ఆవిర్భవించింది. దుష్టసంహారం కోసం ప్రత్యేక అవతారం దాల్చారు. ఆ సమయంలో నవరూపాలను ధరించారు. త్రిమూర్తుల ప్రత్యేక తేజస్సు నుంచి అవతరించటంతో ఆమెకు తెల్లజిల్లేడు పూలు, తులసీదళాలు కూడా సమర్పించడం జరుగుతుంది. భక్తుల మనస్సుల్లో ఉండాలని కోరుకుంటూ మల్లెలను సమర్పించారు. పూజల్లో ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యుడు వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





దుర్గమ్మ కానుకల లెక్కింపు..

దుర్గమ్మకు భక్తులు సమర్పించిన కానుకలు 15 రోజులకుగాను ఈవో పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. రూ.2,18,00,698 నగదు, 355 గ్రా. బంగారం, 6కిలోల 374గ్రా. వెండి సమకూరింది.



అధికారులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

సుబ్బారాయుడి సేవలో ఎన్నికల అధికారులు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు గురువారం ఉదయం దర్శించుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ చీఫ్ అధికారి విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సెక్రటరీ రామారావుల బృందం ఆలయాన్ని సందర్శించగా, అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ ఎన్.శ్రీవిద్యలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే కాగిత

ఒర్లగొంది తిప్పలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కృత్తివెన్ను, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అవిష్కరించటం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఒర్లగొందితిప్ప గ్రామంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు అవిష్కరించారు. దాతలను గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఒడుగు తులసీరావు, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి

» గవర్నర్‌కు పీసీసీ ఉపాధ్యక్షుడు శివాజీ వినతి

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టాలని పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ గవర్నరు అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నరును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

రాజధాని రైతులకు ఈ లాటరీలో 494 ప్లాట్ల కేటాయింపు

విజయవాడ కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 197 మంది రైతులకు గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ లాటరీ విధానం ద్వారా 494 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 297 నివాస ప్లాట్లు కాగా 197 వాణిజ్య ప్లాట్లు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నవులూరు, కురగల్లు, నిడమర్రు, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం రైతులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాయపూడి, వెంకటపాలెం, వెలగపూడి, మంద డం, దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్దండ రాయనిపాలెం గ్రామ రైతులకు ఈ లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ, ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించవడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీపీఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, జి.రవీందర్, ఏజీ చిన్ని కృష్ణ, పి.పద్మావతి, జి.రవీందర్, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస నాయక్, కె.ఎస్.భాగ్యరేఖ, సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.



రాజధాని రైతుకు ఈ లాటరీ విధానంలో ప్లాటు కేటాయిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

రాయితీలపై హోటల్స్ రంగం హర్షం

» అమరావతిలో 17 స్టార్ హోటల్స్



మాట్లాడుతున్న ఆర్వీ స్వామి

గుణదల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు హోటల్ రంగానికి రాయితీలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రాయితీలు చూసి రాష్ట్రంలో మరిన్ని స్టార్ హోటల్స్ వస్తున్నాయని చెప్పారు. స్టార్ హోటల్స్‌కు ఎక్సైజ్ సుంకం ఏటా 66 లక్షలు చెల్లిస్తున్నామని దానికి తగ్గట్టుగా వ్యాపారాలు ఉండకపోవడంతో నష్టం వస్తున్నదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన తాజాగా గురువారం జరిగిన కేబినెట్‌లో ఎక్సైజ్ సుంకం రూ 66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి టూరిజంశాఖకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గేట్‌వే హోటల్ అధినేత రాజయ్య మాట్లాడుతూ.. ఏపీలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ఐటీ కంపెనీలు పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఏపీలో సముద్ర తీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, ఐటీ రంగం కూడా అదే తరహాలో ఏర్పాటు జరిగేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెడితే ఏపీ దేశంలోనే మొదటిస్థానంలో ఉండటం ఖాయమని చెప్పారు. చంద్రబాబు టూరిజంపై రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో అమరావతిలో 17 స్టార్ హోటల్స్ రానున్నాయని గ్రీన్ హోటల్ అధినేత గోకరాజు గంగరాజు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరడంతో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సానుకూలంగా స్పందించి అనుమతులు ఇవ్వడం జరిగిందని చెప్పారు.

కస్తూరిబాయి రాజీనామా

(5వ పేజీ తరువాయి)

అప్పటి ఎమ్మెల్యేనే కారణమన్నారు. ఎవరెన్ని ఇబ్బందులకు గురి చేసినా పట్టణ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశానని తెలిపారు. నాలుగేళ్లలో సుమారు రూ.20 కోట్లపైగా అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త వివాదం తెరపైకి వస్తుందా!

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామాతో వైసీపీ కౌన్సిలర్ల మధ్య నెలకొన్న వివాదం సర్దుమణుగుతుందా! లేక మరో కొత్త వివాదం తెరపైకి వస్తుందా అనే అనుమానం రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. నాటి ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల తదుపరి చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్లు రాజీనామా చేసి కొత్తవారికి అవకాశం కల్పించాలని అప్పట్లో స్థానిక వైసీపీ పెద్దలు నిర్ణయించారు. గత కొంతకాలంగా చైర్‌పర్సన్ రాజీనామా డిమాండ్‌తో కొందరు వైసీపీ కౌన్సిలర్లు సమావేశాలకు గైర్హాజరవ్వడం, సమావేశాలకు హాజరైనా బోర్డుకు సహకరించక పోవడం వంటివి చేశారు. ఎట్టకేలకు చైర్‌పర్సన్ రాజీనామా చేయడంతో నాటి ఒప్పందం ప్రకారం వైస్‌చైర్మన్లను కూడా మార్చాలని వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

వాటాకోసం వచ్చి ప్రాణాలు తీసుకుంది!

(5వ పేజీ తరువాయి)

అడిగింది. దీనిపై తల్లి, కుమార్తె మధ్య వివాదం జరిగింది. దీంతో మౌనికపై రమాదేవి కొత్తపేట పోలీసులకు మార్చి 30న ఫిర్యాదు చేసింది. డబ్బుల కోసం తనను వేధిస్తోందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు స్టేషన్‌కు రావాలని మౌనికకు ఫోన్ చేశారు.

భార్య ఆత్మహత్యకు అత్తే కారణం..

పోలీసులకు అల్లుడి ఫిర్యాదు

బుధవారం రాత్రి రమాదేవి ఇంటికి ఆమెతో సహజీవనం చేస్తున్న వెంకటేశ్వరరావు వచ్చాడు. ఆ ఇద్దరినీ ప్రత్యక్షంగా చూసిన మౌనిక కోపాన్ని ఆపుకోలేకపోయింది. వెంకటేశ్వరరావును పరుష పదజాలంతో దూషించింది. అప్పటికే బీమా సొమ్ములో వాటా అడగడంతో మౌనికపై రమాదేవి ఆక్రోశంతో ఉంది. తన ఎదుటే వెంకటేశ్వరరావును దూషించడంతో తట్టుకోలేక కుమార్తెపై ఎదురుతిరిగింది. రమాదేవి, వెంకటేశ్వరరావులు కలిసి మౌనికను తీవ్రంగా దూషించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన అక్క విజయలక్ష్మి, భర్త కృష్ణశంకర్‌కు ఫోన్‌చేసి తల్లి, వెంకటేశ్వరరావు అన్న మాటలు చాలా బాధించాయని ఆవేదన వ్యక్తం చేసింది. తాను చనిపోతున్నానని, తన ఇద్దరి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆ తర్వాత తల్లి ఇంటి నుంచి బయటకు వచ్చి పురుగుల మందు తాగింది. అప్పటికే అక్క విజయలక్ష్మి మరో బంధువుతో కలిసి తల్లి ఇంటికి బయలుదేరింది. ఆ ఇంటికి సమీపంలో మౌనిక పడిపోయి కనిపించింది. వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న మౌనిక భర్త కృష్ణశంకర్ విజయవాడకు చేరుకున్నారు. అత్త రమాదేవి వేధింపుల కారణంగానే మౌనిక ఆత్మహత్య చేసుకుందని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బందరుకోటను సందర్శిస్తున్న కలెక్టర్ బాలాజీ

పర్యాటక బాట.. బందరు కోట!

» పునరుద్ధరణ పనులు పరిశీలించిన కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వారసత్వ సంపదగల చారిత్రాత్మక నగరమని, బందరుకోటను పర్యాటక సర్క్యూట్‌లో చేర్చేందుకు కోట పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం కలెక్టర్ బందరుకోట, నగరంలోని డచ్ సమాధులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బందరుకోట పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు చెప్పినప్పటికీ ఇంకా పనులు జరగడం లేదన్నారు. ఢిల్లీలోని పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్‌కు నిధుల మంజూరు విషయమై మాట్లాడతామన్నారు. డచ్‌వారు ఈ కోటను వ్యాపారకేంద్రంగా, సైనికుల శిక్షణా కేంద్రంగా, ఆయుధాగారంగా చేశారన్నారు. 1864లో తుపానుకు కోట దెబ్బతిన్నదన్నారు. మంగినపూడి బీచ్, పాండురంగ స్వామి ఆలయాన్ని ఒక సర్క్యూట్‌గా చేస్తామన్నారు. అనంతరం డచ్ స్మశాన వాటికలను సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ ఉప పర్యవేక్షకుడు ఎన్.ఎస్. శివకుమార్, కన్సల్టెంట్ నాగేంద్ర కుమార్, రాష్ట్ర పురావస్తుశాఖ ఉపసంచాలకులు సురేష్, జిల్లా పర్యాటక అధికారి రామలక్ష్మణ్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



డచ్ సమాధులను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

వివాదాల నల్లూరి

(5వ పేజీ తరువాయి)

కేటాయింపు చేసే అధికారం కూడా ఉంటుంది.

ఉపాలయాలకు భూములు

నల్లూరి వారి ధర్మతోట భూములే కాకుండా దీనికి సంబంధించిన ఉపాలయాలకు కూడా భూములు ఉన్నాయని తెలుస్తోంది. వేంకటేశ్వరస్వామి ప్రధాన ఆలయానికి ఉపాలయంగా ఉన్న ఆంజనేయస్వామి గుడి ఎన్ఎస్ఎం రోడ్డుకు ఆవల ఉంటుంది. ఆంజనేయస్వామి ఆలయానికి 4.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఎన్ఎస్ఎం హైస్కూల్ వెనుక భాగంలో ఉంది. ఈ భూమి మాత్రం దేవదాయ శాఖ అధీనంలో ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	145,154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

జాబ్‌మేళాలో 85 మంది ఎంపిక

గుణదల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 85 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జవహర్ నాలెడ్జ్, ఏపీఎస్ఎస్‌డీసీ సౌజన్యంతో నిర్వహించిన జాబ్‌మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు హాజరై వారికి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కో-ఆర్డినేటర్ జి.విజయదీప్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలను దెబ్బతీయొద్దు

● సీసీఏ కార్యాలయం వద్ద నిరసన



సీసీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ సంఘాల నేతలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్‌సీసీపీఏ) పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో భాగంగా పెన్షనర్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా చేసిన మార్పులను రద్దు చేయాలని కోరుతూ గురువారం ఎంజీ రోడ్డులోని కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (సీసీఏ-పెన్షన్) కార్యాలయం వద్ద బీఎస్ఎన్ఎల్‌లోని ప్రధాన పెన్షనర్ సంఘాలు ధర్నా నిర్వహించాయి. ధర్నా కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్‌లోని ప్రధాన పెన్షనర్స్ సంఘాలు ఏఐబీడీపీఏ, ఏఐబీఎస్ఎన్ఎల్, ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ, ఏఐఆర్‌బీఎస్ఎన్ఎల్ ఈడబ్ల్యూఏ పాల్గొన్నాయి. ఎండ వేడిని కూడా లెక్కచేయకుండా దాదాపు 250 మంది పెన్షనర్లు హాజరై నిరసన తెలియజేశారు. పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడాలని, పెన్షనర్లకు వ్యతిరేకంగా చేసిన మార్పులు రద్దు చేయాలని నినాదాలు చేశారు. నిరసనలో పెన్షనర్ సంఘాల నేతలు వి. వరప్రసాద్, పి. అశోక్ బాబు, ఏ. కోటేశ్వరరావు, ఎం. వెంకటేశ్వరరావు, ఎ. చంద్రశేఖర్, ఎల్. రమేష్‌బాబు, సీఐటీఐ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. నిరసన అనంతరం పెన్షనర్ సంఘాల నేతలు సీసీఏ (ఏపీ సర్కిల్)ను కలిసి ప్రభుత్వం ఆర్థిక బిల్లులో ప్రవేశ పెట్టి ఆమోదం చేసుకున్న పెన్షన్ సవరణకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీకి అడ్రస్ చేస్తూ తయారు చేసిన వినతిపత్రాన్ని సీసీఏకు అందజేశారు.


పోస్టల్ కాలనీలో బస్‌షెల్టర్


హైస్కూల్ రోడ్డులో బస్‌షెల్టర్‌లో చలివేంద్రం


ఆటోనగర్ పాకల వద్ద బస్‌షెల్టర్

పేరుకే బస్‌షెల్టర్లు

● కొన్ని చోట్ల కూర్చోటానికి బల్లలు లేవు
● సదుపాయాలు, మరమ్మతులు లేక నిరుపయోగంగా మారిన వైనం

పటమట, ఆంధ్రజ్యోతి: తూర్పు నియోజక వర్గ పరిధిలో బస్‌షెల్టర్లు చాలా చోట్ల కనీస మరమ్మతులకు నోచుకోక సరైన సదుపాయాలు లేక నిరుపయోగంగా ఉన్నాయి. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అసలు బస్‌షెల్టర్ అనేదే లేదు. ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడిచి బస్సు వచ్చే వరకు నిలువు కాళ్లపై నిలబడాల్సిందే. పోస్టల్ కాలనీ బస్టాప్ వెనుక వాణిజ్య సముదాయాలలో కిరాణ, ఎలక్ట్రికల్ షాపులు ఉన్నాయి. కూర్చో టానికి బల్లలు లేకపోవడంతో వ్యాపారస్తులకు, వినియోగదారులకు రాకపోకలు సాగించేందుకు మాత్రమే ఇది ఉపయోగపడుతుందే తప్ప బస్‌షెల్టర్‌గా పని చేయడం లేదు. హైస్కూల్ రోడ్డులోని బస్‌షెల్టర్ పూర్తిగా పాడవ్వడంతో దానిలో వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆటోనగర్ పాకల బస్టాప్ వద్ద కూర్చొనేందుకు బల్లలు లేవు. ఆప్రాంతం అంతా మురుగు నీరు చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఎంతో రద్దీగా ఉండే పటమట సెంటర్లో సైతం బస్‌షెల్టర్ లేకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటిపై దృష్టి సారించి వినియోగంలోకి తేవడంతో పాటు బస్‌షెల్టర్ లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న గద్దె క్రాంతి కుమార్

గద్దె ఆర్థిక సాయం

పటమట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురికి విద్య, వైద్య, వివాహ కార్యక్రమాల నిమిత్తం రూ.65 వేలను గురువారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో నందిపాటి దేవానంద్, వేముల దుర్గారావు, దోమకొండ రవి, ప్రసాద్, నిమ్మగడ్డ చిన్న తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల బిల్లులో సవరణల ఘనత బాబుదే

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూముల బిల్లులో సవరణలు చేయించిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబుదే అని, మైనారిటీల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 6వ డివిజన్‌లో పర్యటించిన ఆయన ఐదుగురికి టిఫెన్ బండి, తోపుడు రిక్షా, బడ్డీ కొట్టును వితరణగావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ భూముల చట్టానికి సంబంధించి బుధవారం ప్రవేశ పెట్టిన బిల్లులో సీఎం చంద్రబాబు సూచనల మేరకు బీజేపీ ప్రభుత్వం సవరణలు చేసిందన్నారు. అది చంద్రబాబుకు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న విలువ, గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, నగమోతు రాజా, అమర్నేని కరుణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


వాటర్ కూలర్‌ను బహుకరిస్తున్న దాతలు, గద్దె రామ్మోహన్ తదితరులు

వాటర్ కూలర్ బహుకరణ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ కుమార్తె డాక్టర్ చదలవాడ ఖాతిశ్రీ జన్మదినం సందర్భంగా విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు గురువారం 40 లీటర్ల కెపాసిటి గల వాటర్ కూలర్‌ను బహుకరించారు. దాన్ని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, డాక్టర్ చదలవాడ ప్రణీత్ చేతుల మీదుగా అందించి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, ఏపీ స్టేట్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు, సత్యనారాయణ, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాష, సత్యనారాయణ, డి.దుర్గారావు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లో చెత్త తొలగింపు



భారతీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గురునానక్ కాలనీలోని శివాలయం సమీపంలోని అంతర్గత రోడ్లో పేరుకుపోయిన చెత్తను గురువారం వీఎంసీ సిబ్బంది తొలగించారు. అంతర్గత రోడ్లో పేరుకున్న చెత్త అనే కథనం బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వీఎంసీ సిబ్బంది చెత్తను తొలగించారు.

వన్‌డే ఆర్ట్ వర్క్‌షాప్ రేపు

గాంధీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యువ చిత్రకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇండియా ఆర్ట్ వన్‌డే వర్క్‌షాప్‌ను ఈ నెల 5న నిర్వహిస్తున్నట్టు డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ పి.రమేష్ తెలిపారు. స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆవరణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కైరవం, విజయవాడలోని స్పా, ఏపీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 93939 49596లో సంప్రదించాలన్నారు. కుమార్, గోళ్ల నారాయణరావు, సుబ్బారావు, రామ్ పాల్గొన్నారు.


కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి స్కాలర్‌షిప్ చెక్కు అందజేస్తున్న పల్లంరాజు వెంకట శేషయ్య ధర్మసత్రం సభ్యులు

మెరిట్ విద్యార్థులకు రూ.1.20 లక్షల స్కాలర్‌షిప్

గుణదల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉంటూ విద్యాభ్యాసంలో ప్రతిభ కనబర్చిన 20మంది ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ కింద రూ 1.20లక్షలు దేవదాయ ధర్మదాయ శాఖకు సంబంధించిన పల్లంరాజు వెంకట శేషయ్య ధర్మసత్రం కమిటీ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం సదరు చెక్కును ధర్మసత్రం కమిటీ సభ్యులు కళాశాలకు అందజేశారని చెప్పారు. ఒక్కో విద్యార్థికి రూ. 6వేల చొప్పున 20 మంది విద్యార్థులకు రూ. 1.20లక్షల చెక్కును అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వరరావు


మాట్లాడుతున్న కే.ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరిస్తుందని కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నా కూటమి ప్రభుత్వం వారి ఆశలను అడియాశలు చేసిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు దుయ్యబట్టారు. సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని లేదంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. సంఘం నగర అధ్యక్షుడు జ్యోతిబస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, కోశాధికారి డి.స్టీఫెన్‌బాబు, ఉపాధ్యక్షురాలు టి.తిరుపతమ్మ, శానిటేషన్, మలేరియా, సిల్క్ వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్స్ వాటర్ అండ్ గ్రౌండ్ డ్రెయినేజీ, పార్క్, స్ట్రీట్ లైట్, టౌన్‌ప్లానింగ్, డీపీ స్టేషన్ల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మోడరేట్ స్థాయిలో గుర్తిస్తే ఆటిజం నయం చేయొచ్చు



అవగాహన సదస్సులో వైద్యులు

పటమట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆటిజం (బుద్ధిమాధ్యం) అనే వ్యాధిని మోడరేట్ స్థాయిలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని పలువురు వైద్యులు అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన రోజు సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కె నగర్ మహిళా ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పాఠశాల సాయి ప్రేమ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు విచ్చేసిన పలువురు వైద్యులు మాట్లాడుతూ ఏ వ్యాధి అయినా మైల్డ్, మోడరేట్, సివియర్ అనే మూడు స్థాయిల్లో ఉంటుందని ఆటిజంను కూడా మోడరేట్‌లో గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. ఈసదస్సులో నోరి హాస్పటల్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సూర్యనారాయణ, కొండపల్లి ప్రజా వైద్యశాల డాక్టర్ జి.విజయవాణి, స్పార్క్ సైకాలజీ సెంటర్ సైకాలజిస్టు డాక్టర్ రమేష్ బావిశెట్టి, సాయి ప్రేమ సెంటర్ నిర్వాహకురాలు బి.ఝాన్సీ లక్ష్మి, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు జి.రాజేశ్వరి, పాఠశాల పేరెంట్స్ ఎం.రవి, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఏటీసీ రమ్యశ్రీని కలిసిన రవాణా శాఖ జోన్-2 ఉద్యోగ సంఘ నాయకులు

కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్ఎస్ఎం రమ్యశ్రీని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్-2 కార్యవర్గసభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమ్యశ్రీ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి సమస్యలు ఏమున్నా కూడా మా దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. జోన్-2 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ అదనపు రవాణా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమ్యశ్రీని కలిసినందుకు ఎంతో సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ఉద్యోగులు డి.రామ్మూర్తి, వి.నాగశంకర్, ప్రియాంక, రామచంద్రరాజు, బి.మధుసూదన్, పి.దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులున్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై పోటీలు నేడు

కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని నగర కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగరంలోని పాఠశాలలకు శుక్రవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ బాన్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇంద్రకీలాద్రి పై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉన్న ఉపాలయాల్లో కొలువై ఉన్న వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లీలా కల్యాణోత్సవం శుద్ధ షష్ఠితిథి సందర్భంగా కన్నుల పండువగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షష్టి తిథి జన్మతిథి సందర్భంగా విశేష అర్చనలు చేశారు. దేవేరులకు మాంగళ్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలను భక్తుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

లౌకిక, రాజ్యాంగ హక్కుల్ని కాపాడుకుందాం

● లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల్ని, లక్ష్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందని సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్‌బాబు అన్నారు. మత సామరస్యం కోరుతూ ఈనెల 13న నగరంలో జరుగనున్న శంఖారావం సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం యువజన, విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు వై. రాము (డీవైఎఫ్ఐ), జి. నాసర్ (ఏఐఎస్ఎఫ్), లంకా గోవింద రాజు (ఏఐవైఎఫ్), వేముల శ్రీనివాసరావు (ఎన్ఎస్‌యూఐ) ప్రసంగించారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆక్రమణలు, విద్యార్థుల సమ్మె హక్కుల్ని కాలరాస్తూ లాఠీచార్జి చేయడం అన్యాయమన్నారు. లాఠీ చార్జిని ఖండించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సదస్సుకు సంఘీభావం తెలిపారు. ఎస్. సూర్యారావు, ఎం. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష చూపకుండా వైద్య సేవలందించాలి

డాక్టర్ టి.మంజుల

గాంధీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకుండా వారికి సరైన సమాచారం, చికిత్స అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఆర్‌టీ కేంద్రాల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్ నర్సుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులు మందులు తీసుకునేలా ఏఆర్‌టీ కేంద్రాల్లో వాతావరణం కల్పించాలన్నారు. మందులు మధ్యలో ఆపివేసిన వారిని గుర్తించి తిరిగి వైద్య సేవలు కొనసాగించేలా అవగాహన కల్పించాలన్నారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సరస్వతీదేవీ, జేసీలు డాక్టర్ కామేశ్వరప్రసాద్, డాక్టర్ భాగ్యలక్ష్మీ, చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడు అరెస్టు

ఏడు కేజీల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న పాయకాపురానికి చెందిన సందుపల్లి రాంబాబు (25)ను విజయవాడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్‌ఫారంపై బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతుండగా విధుల్లో ఉన్న పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు.7 కేజీలు ఉన్న రెండు గంజాయి బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కలెక్టర్ బాలాజీ

అనాథలను అక్కున చేర్చుకున్నారు..!

మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు వారిని చదివించి ప్రయోజకులను చేయాలని కలెక్టర్ బాలాజీ అన్నారు ప్రభుత్వ శిశుగృహాల్లో ఉంటున్న ముగ్గురు పిల్లలను కలెక్టర్ చాంబరులో కలెక్టర్ సమక్షంలో గురువారం దత్తతకు ఇచ్చారు. సెంట్రల్ అడాప్టర్ రీసోర్స్ అథారిటీ (కారా)ద్వారా పిల్లలను దత్తత ఇస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మచిలీపట్నం శిశుగృహంలోని హిమాన్షు అనే 7 నెలల బాలుడిని చిత్తూరు జిల్లాకు చెందిన పీఎస్ ప్రసాద్, సుజాత దంపతులకు దత్తత ఇచ్చారు. బుద్ధవరం శిశుగృహంలోని రెండున్నరేళ్ల పాపను హైదరాబాద్‌కు చెందిన వికాస్‌పంక్వనీ, మనీషా దంపతులకు దత్తత ఇచ్చారు. నాలుగేళ్ల వయసున్న సుశాంత్ అనే బాలుడిని బెంగుళూరుకు చెందిన కృష్ణ, నందిని దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్‌రాణి పాల్గొన్నారు.



బందరు కాలువ కట్టపై మట్టితవ్వి చదును చేసి, ఇంటి వద్ద పోస్తున్న రైతు

బందరు కాలువ కట్టను తవ్వేశారు

● పంటల సాగు కోసం రైతు దుశ్చర్య

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బందరు కాలువకు రక్షణగా ఉండాల్సిన కట్టను కోటేశ్వరరావు అనే రైతు ఎక్సకవేటర్‌తో గురువారం మట్టిని తవ్వి ఇంటికి తరలించాడు. మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై తరలిస్తుండటంతో గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కంకిపాడు ఇరిగేషన్ సిబ్బంది వచ్చి కట్ట తవ్వకాన్ని నిలిపేశారు. కట్టను తవ్వి చదునుగా చేసి పొలం గట్టంత కట్టను మాత్రమే మిగిల్చారు. రేపు కాలువకు నీరువస్తే ఈ చిన్నగట్టు తెగి నీరు కట్టపైగా ప్రవహించే ప్రమాదం ఏర్పడింది. ఇందిరా గాంధీ హయాంలో కాలువ కట్టను ఇచ్చారని, దిబ్బ ఉంటే తొలగించి చదును చేశానని, పంటలు సాగుచేస్తానని కోటేశ్వరరావు చెప్పారు. కాలువ కట్టను ఎక్సకవేటర్‌తో తవ్వి మట్టిని బయటకు తరలించటం నేరమని ఇరిగేషన్ సిబ్బంది హెచ్చరించారు. ఇంటివద్ద పోసిన మట్టిని మళ్లీ తీసుకు వచ్చి కట్టపై పోయిస్తామని ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు.



ప్లస్ టూ పూర్తి చేసిన విద్యార్థినికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా స్నాతకోత్సవం

గుణదల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యలను ఎదుర్కొని అధిగవించే ధైర్యాన్ని యువత పెంపొందించుకోవాలని విట్ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ చెక్క అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని ఢిల్లీపబ్లిక్ స్కూల్లో స్నాతకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాలానుగుణంగా మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం బాలబాలికలు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్లస్ టూ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ చేతులమీదుగా అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, పరిమి సునంద, కడియాల ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ భువనేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ భాటియా పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో రెండు వర్గాల ఘర్షణ

చిట్టినగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండ లం కొత్తూరు తాడేపల్లిలో ఉన్న సీఎస్ఐ చర్చిలో రెండు వర్గాలు పదవుల కోసం కొట్లాడుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. కొత్తూ రు తాడేపల్లిలో సీఐఎస్ చర్చి కమిటీ పదవీ కాలం జనవరితో ముగిసింది. కొత్త కమిటీని ఎన్నుకునేందుకు కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రత్యర్థి వర్గం డిమాండ్ చేస్తోంది. గురువారం రాత్రి చర్చి కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరగడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో రెండు వర్గాలకు చెందిన నలుగురు గాయపడ్డారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

16 నుంచి చంద్రన్న వజ్రోత్సవాలు

గాంధీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో చం ద్రన్న వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 20 వరకు గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నాటిక పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, జానపద నృత్య పోటీలు జరుగుతాయన్నారు.

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైళ్ల మళ్లింపు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున ఇతర టెర్మినళ్లకు రైళ్లను మళ్లించేందుకు రైల్వే బోర్డు అనుమతించిందని విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 127 13, 12714 విజయవాడ - సికింద్రాబాద్ - విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్ విజయవాడలో ఈనెల 15న 6.25గంటలకు బయలు దేరుతుంది. కాచిగూడకు 10.15 గంటలకు చేరుకుంటుంది. కాచిగూడ స్టే షన్‌లో సాయంత్రం 4 గంటలకు బయలు దేరి విజయవాడకు 12.55 గంటలకు చేరుకుంటుంది. 12514 చిల్పార్ - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9న రాత్రి 7.30కు బయలుదేరి, 12న 11.40 చర్లపల్లి చేరుకుంటుంది. చర్లపల్లిలో 12న 4.50కు బయలుదేరుతుంది. ట్రాఫిక్ మెయిన్‌టినెన్స్‌తో ఈనెల 3,5న సూళ్లూరుపేట-నెల్లూరు, నెల్లూరు-సూళ్లూరుపేట 7,8న విజయవాడ-గుంటూరు రైళ్లను రద్దు చేశారు.

ఇసుక కొరత లేకుండా చర్యలు: కలెక్టర్

మచిలీపట్నం: రానున్న వర్షాకాలంలో జిల్లాకు ఇసుక కొరతలేకుండా చూడాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం గురువారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి నిర్వహించారు. జిల్లాలో ఇసుకపాలసీ విధానం అమలుచేస్తున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. సెమీ మెకనైజ్డ్ విధానంలో ఇసుక రేవుల్లో యంత్రాల ద్వారా ఇసుకను తవ్వేందుకు అనుమతులు వచ్చాయన్నారు.

అటకెక్కిన గిడ్డంగి పనులు

రైతుల పాలిట శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ విధానాలు

● ఏఎంసీలో కోల్డ్ స్టోరేజ్ పనులు అర్ధాంతరంగా నిలిపివేత
● పిచ్చిచెట్లతో నిండిపోయిన బేస్‌మెంట్, శిలాఫలకం

జగ్గయ్యపేట ఏఎంసీలో 2016లో అప్పటి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్సీగా ఉన్న తొండెపు దశరథ జనార్థన్ కృషితో రూ.4కోట్ల నాబార్డు ఆర్‌డీఎఫ్ నిధులతో శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్)కి శంకుస్థాపన చేశారు. అదేరోజు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. శంకుస్థాపన అనంతరం నిధులు విడుదల, టెండర్ల ప్రక్రియ ముగించి 2018లో పనులు ప్రా రంభించారు. భవనం బేస్‌మెంట్‌స్థాయి దాటి పిల్లర్లు వేసే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో పనులు నిలిపేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కోల్డ్ స్టోరేజీ పనులు అటకెక్కాయి. బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన పనులు అలాగే ఉండిపోయాయి. దీంతో పిచ్చిచెట్లు పెరిగి అరణ్య వాతావరణం నెలకొంది. కొంతమేర లేచిన పిల్లర్లు, ఇనుప చువ్వలు పాడైపోయాయి. టీడీపీ ప్రభుత్వం



పిచ్చి చెట్లతో నిండిన ఏఎంసీలో కోల్డ్ స్టోరేజి బేస్‌మెంట్ ప్రాంతం, శిలాఫలకం

వేసిన శిలాఫలకం చుట్టూ ముళ్ల కంపలు పెరిగిపోయాయి. ఇప్పుడు టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. తాజాగా పేట సమీపంలో ప్రైవేట్ కోల్డ్‌సోరేజీలో అగ్ని ప్రమాదం జరగడంతో ఆగిపోయిన కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం అంశం వెలుగులో కొచ్చింది. ఆ కోల్డ్‌స్టోరేజీని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ కోల్డ్‌స్టోరేజీ ఉండి ఉంటే తమకీ బాధలు ఉండేవి కావని వాపోతున్నారు. బూదవాడకు చెందిన రైతు నేత గడ్డం హరాస్సేన్, పోలంపల్లికి చెందిన రైతు నేత ఆవుల రామారావు మాట్లాడుతూ ఏఎంసీలో కోల్డ్‌స్టోరేజి నిర్మాణాన్ని పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే తాతయ్యను, ప్రభుత్వాన్ని కోరారు. మాజీ



పనులు ప్రారంభించాలని కోరుతున్న గడ్డం, కట్టా ఆవుల

ఏఎంసీ చైర్మన్ కట్టా నరసింహారావు మాట్లాడుతూ తాను ఏఎంసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు బేస్‌మెంట్ వరకు పనులు పూర్తిచేశామని, ప్రభుత్వం మారటంతో ఆగిపోయిందన్నారు. ఏఎంసీ సెక్రటరీ ఎ స్వీ నరసింహారావు మాట్లాడుతూ కొత్త పాలకవర్గం వచ్చాక కోల్డ్ స్టోరేజీపై ఏం చేయాలో నిర్ణయం తీసుకోవాలని, ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి ఈ కోల్డ్‌స్టోరేజీ అంశాన్ని తీసుకెళ్తామన్నారు.

వైసీపీ ప్రభుత్వ విధానాలే జగ్గయ్యపేట రైతుల పాలిట శాపంగా పరిణమించింది. జగన్ అసంబద్ధ నిర్ణయాలతో ఏఎంసీలో నిర్మించ తలపెట్టిన కోల్డ్ స్టోరేజ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. అదే ప్రభుత్వ కోల్డ్ స్టోరేజ్ అందుబాటులో ఉంటే రైతులకు ఎంతో అసరాగా ఉండేది. ప్రైవేట్ కోల్డ్ స్టోరేజ్‌ల నిర్లక్ష్యంతో రోడ్డున పడే దుస్థితి లేకుండా పోయేది.
- ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట

తాజాగా కొసమెరుపు ఏమిటంటే 2019లో అర్ధాంతరంగా వైసీ పీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజి పనులను ఆపేసిన తాలుకా పనులకు రూ.35లక్ష లు బిల్లులను ఇటీవల టీడీపీ ప్రభుత్వం విడుదల చేసింది. చిన్న కాంట్రాక్టర్లకు ఉపశమనం కలిగిస్తూ తీసుకున్న నిర్ణయంలో కోల్డ్ స్టోరేజీ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు వచ్చాయి.



పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన వన్‌స్టాప్ సెంటర్ కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బొండా ఉమా, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, తదితరులు

మహిళల భద్రత, రక్షణే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

వన్‌టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల భద్రత, రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కొత్త భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో 11 నుంచి 13 మంది వరకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించే భవనాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు మహిళల రక్షణకు ప్రాముఖ్యతను ఇస్తున్నారన్నారు. మోసగించబడిన మహిళలకు న్యాయపరంగా, కుటుంబపరంగా సహాయ సహకారాలు అందించేలా వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఒక మహిళగా ఇంటిలో చెప్పుకోలేని విషయాలు ఇక్కడున్న మహిళా అధికారులకు చెప్పుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా మహిళలకు రక్షణతో పాటు వారికందాల్సిన న్యాయం, ఆసుపత్రి సౌకర్యాలు కల్పించి బాధిత మహిళకు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వారు భద్రంగా ఉన్నామని అనుకున్నప్పుడు మాత్రమే తిరిగి పంపిస్తామన్నారు. గుంటూరులో శక్తిసదన్ మహిళా వసతి గృహాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 5,600 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల్లో 960 మంది సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, దాడులు ఏం జరిగినా వారి పూర్తి రక్షణకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వపరంగా వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇక్కడ మహిళా పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ వైద్యపరంగా, న్యాయపరంగా రక్షణ కల్పిస్తూ సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి, డైరెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దాసరి శ్రీలక్ష్మి, డీసీపీ (అడ్మిన్) సరిత పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు ప్రకృతి వ్యవసాయమే మార్గం

● వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేరళ మంత్రి ప్రసాద్

జి.కొండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగవించి మంచి దిగుబడులు సాధించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులే సరైన మార్గమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టీ.విజయ్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం కేరళ వ్యవసాయశాఖ మంతి పి.ప్రసాద్ తన బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పెద్ద ప్రభావం పడుతోందని, మట్టిలో జీవనశక్తి తగ్గిపోవడం, నీటి కొరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అధికంగా కార్బన్ ఉద్గారాలు వంటి సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమన్నారు. తొలుత విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్లో కేరళ బృందంతో విజయకుమార్ సమావేశమై 9 ఏళ్లుగా ఏపీసీఎన్ఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. సభ్యులడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. చెవుటూరు గోశాలలో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాల చక్రాన్ని ప్రదర్శిస్తూ ప్రకృతి వ్యవసాయం వెనుకున్న శాస్త్రీయ దృక్పథాన్ని వివరించారు. మహిళా రైతు రమాదేవి మామిడి తోటను సందర్శించి అనేక విషయాలను కేరళ బృందం తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, కేరళ వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ వెంకట రామన్, అదనపు వ్యవసాయ డైరెక్టర్ థామస్ సామ్యూల్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా పీడీ విజయకుమారి పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కేరళ మంత్రి, బృందం



ప్రధాన వేదిక వద్ద పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు, ఎమ్మెల్యే సౌమ్య, టీడీపీ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం

సీఎం సభకు శరవేగంగా ఏర్పాట్లు

● పరిశీలించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

చందర్లపాడు, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5న జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని సీఎం ముప్పాళ్ల వస్తున్న విషయం విదితమే. పర్యటనలో భాగంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు, ప్రజాదర్బార్, పీ4, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం పాలెం రోడ్డులోని ఒక ప్రైవేటు భూమిలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ముప్పాళ్ల గ్రామం వద్ద పదెకరాల వ్యవసాయ భూమిలో పీ4, ప్రజాదర్బార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సీపీ సీ రాజశేఖరబాబు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రధాన వేదిక స్థలంతో పాటు స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించారు. సీఎం చంద్రబాబు పాఠశాలను సందర్శించే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆర్‌డీవో కే బాలకృష్ణ, డీసీపీ మహేశ్వరరాజు, ఏసీపీ తిలక్ పాల్గొన్నారు.

పశ్చిమ ప్రగతిపై సుజనా ఫోకస్

మంత్రులు నారాయణ, ఆనం, సత్యకుమార్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్




పెనమలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ అభివృద్ధిపై ఎమ్మెల్యే సుజనా చౌదరి మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్‌తో తాడిగడపలోని తన కార్యాలయంలో గురవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. తన ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు మంత్రులకు తెలిపారు. సుజనా ఫౌండేషన్ అడ్వైజర్ వేజెండ్ల శ్రీనివాసరావు పశ్చిమలోని అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిత్యం ఏర్పడే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం, నైజాంగేటు వద్ద అండర్‌పాస్, కేదారేశ్వరపేట నుంచి పాలప్రాజెక్టు వరకు ఫ్లైఓవర్, మీసాల రాజారావు వంతెన నుంచి రైల్వేస్టేషన్ వరకు బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణ, షాదీఖానాల అభివృద్ధి, కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఏలూరు కాల్వ, బందరు కాల్వ గట్టుల సుందరీకరణ, తుఫాను వాటర్ డ్రైనేజీల నిర్మాణం, ఇల్లులేని పేదలకు టిడ్కో ఇళ్ల అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణను కోరగా సహకరిస్తానని మంత్రి మాటిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, ఎండోమెంటులో చేయగలిగిన అంశాలపై చర్చించామన్నారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధిపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే సుజనా చౌదరి, అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులకు టెక్నికల్ టీం కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, చేపట్టబోయే పనుల వివరాలను వివరించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయంలోని ఇతర ఆలయాల అభివృద్ధికి నివేదిక సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మాస్టర్‌ప్లాన్‌లో పలు సూచనలు చేశామన్నారు. కేంద్రం ఇచ్చే పథకాలను దృష్టిలో పెట్టుకొని ఐదు కోట్లపైన రాబడి వచ్చే ఆలయాలను అభివృద్ధి పరుస్తామన్నారు. రెండో ఘాట్‌రోడ్డు, మల్టీలెవల్ పార్కింగ్, క్యూలైన్ల ఆధునికీకరణ, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రోగులకు వైద్యం అందించే విషయంలో సుజనా చేసే ప్రయత్నాలకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమలోని ఖాళీ ప్రభుత్వ స్థలాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు 12 యూహెచ్‌సీలకు మెడికల్ అధికారులను సుజనా ఫౌండేషన్ అంబులెన్సులకు అనుసంధానం చేయడంపై పరిశీలిస్తామన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని పలు నియోజకవర్గాల్లో అమలయ్యేలా చర్యలు తీసుకొంటామన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, రామారావు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బి.పాండురంగారావు పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ యాత్ర

● వేసవి టూర్ ప్యాకేజీల విడుదల ● 8 నుంచి యాత్ర ప్రారంభం


ఆంధ్రజ్యోతి, రైల్వేస్టేషన్: వేసవిలో సప్త జ్యోతిర్లంగ దర్శన యాత్ర పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సరికొత్త టూర్ ప్యాకేజీలను విడుదల చేసింది. భారత్ గౌరవ్ ట్రైన్‌లో విజయవాడ మీదుగా ఐఆర్‌సీటీసీ ఈ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రకటించింది. ఈనెల 8న యాత్ర ప్రారంభమై 19వ తేదీ వరకు కొనసాగుతుంది. ఉజ్జయిని (మహాబలేశ్వర్ ఓంకారేశ్వర్), ద్వారకా (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమాశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (ఘృష్ణేశ్వర్) యాత్ర ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఒక్కో వ్యక్తి రూ.18,510 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీ 2లో 23న ప్రారంభమై మే 2 వరకు కొనసాగుతుంది. హరిద్వార్ - రుషికేష్ - వైష్ణోదేవి యాత్రగా ఈ ప్యాకేజీ ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ. 18,510లు చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీ 3 మే 8న ప్రారంభమై మే 17 వరకు కొనసాగుతుంది. కాశీ, గయ, ప్రయాగ్, అయోధ్య యాత్ర (సరస్వతీ పుష్కరాలు ప్రత్యేకం) పూరి, కోణార్క్, గయ, వారణాశి, అయోధ్య ప్రయాగరాజ్‌లో సాగుతుంది. ఈ టూర్‌కు ఒక్కో వ్యక్తి రూ.16,800లు చెల్లించాల్సి ఉంటుంది.



ప్యాకేజీ 4 మే 22 నుంచి ప్రారంభమై మే 30న ముగుస్తుంది. అరుణాచలం, మధురై, రామేశ్వరం యాత్ర ప్యాకేజీగా నిర్ణయించారు. ఈ యాత్రకు ఒక్కొక్కరికి రూ.14,700 చెల్లించాలి. ప్యాకేజీ 5లో పంచ జ్యోతిర్లింగ యాత్ర జూన్ 4న ప్రారంభమై 12న ముగుస్తుంది. మహాబలేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమాశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మహూవ, నాగపూర్ మీదుగా సాగుతుంది. ఒక్కొక్కరికి రూ.14,700 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 9281495848, 9281030714 నంబర్లకు ఫోన్ చేయొచ్చు లేదా ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు డబ్ల్యూడబ్ల్యూ ఐఆర్‌సీటీసీటూరిజం.కామ్‌లో చూడవచ్చు.

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

కృష్ణాజిల్లాలో 1,91,627, ఎన్టీఆర్ జిల్లాలో 1,72,019 జవాబు పత్రాల మూల్యాంకనం



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. గురువారం మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం పాటు నిర్వహిస్తున్న ఈ శిబిరానికి క్యాంపు ఆఫీసరుగా డీఈవో రామారావు వ్యవహరిస్తున్నారు. స్ట్రాంగ్ రూం డిప్యూటీ క్యాంపు ఆఫీసరుగా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా ఉయ్యూరు డీవైఈవో పద్మజారాణి, బందరు డీవైఈవో శేఖర్ సింగ్‌ను నియమించారు. 16 రూంలు, రెండు హాళ్లల్లో జరగుతున్న ఈ వాల్యుయేషన్‌కు సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. 1,91,627 జవాబు పత్రాలను వారం రోజుల పాటు మూల్యాంకనం చేయనున్నారు.

విజయవాడలోనూ..

విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభమైంది. విజయవాడలోని బిషప్ అజరయ్య హైస్కూల్లో గురువారం నుంచి స్పాట్ వాల్యుయేషన్ మొదలైంది. అన్ని పరీక్షలకు కలిపి లక్షా 72 వేల 19 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు ఏడుగురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 552 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 184 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మొత్తం 92 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఈ మూల్యాంకన ప్రక్రియను డీఈవో సుబ్బారావు పరిశీలించారు.

అభయాన్నిచ్చే శ్రీరామనామం!

వాల్మీకి రామాయణాన్ని అనుసరించి శ్రీరామచంద్రుడు మధుసూధన మాసము (చైత్ర మాసం)లో జన్మించాడు. ఆయన జన్మించిన శుక్లపక్ష నవమి తిథిని అందరూ శ్రీరామ నవమి మహోత్సవంగా జరుపుకుంటారు.

హరేకృష్ణ



భగవన్నామాన్ని జపిస్తే భగవంతుడు మనవద్దనున్నట్టే. రామ నామాన్ని జపించేవారికి ఆ నామమే అభయాన్ని ప్రసాదిస్తుంది. శ్రీరామచంద్ర ప్రభువు నేటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే వున్నాడు!

6న శ్రీరామ నవమి

భగవద్గీతలో ఉద్బోధించినట్టు దుష్ట శిక్షణకు.. శిష్ట రక్షణకు.. ధర్మ సంస్థాపనకు భగవంతుడు యుగయుగాన అవతరిస్తాడు. జీవుడు భగవంతుణ్ణి శరణు పొందే మార్గాన్ని సుగమం చేస్తాడు. అలాంటి అవతారమే శ్రీరామచంద్రుడు. దేవదేవుడిని శరణు పొందిన వారెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్న సత్యాన్ని లోకానికి నిరూపించటమే శ్రీరామ అవతరణలోని ముఖ్యఉద్దేశం. శ్రీమద్రామాయణ, భాగవతాదుల్లో పొందుపరచిన శ్రీరాముని లీలల్లో తరచూ ఈ సూత్రమే గోచరిస్తుంటుంది. భగవంతుడు అవతరించటం అంటే తన స్వధామం నుండి ఈ భూలోకానికి దిగివచ్చే ప్రక్రియ. శ్రీరాముడు ఆధ్యాత్మిక లోకంలోని అయోధ్య ధామం నుండి భూలోకంలోని అయోధ్యలో అవతరించాడు. మానవ జన్మలు కర్మఫలానుసారం జరుగుతాయి. కానీ భగవంతుడి అవతరణ ఆయన సంకల్పం ఆధారంగానే జరుగుతుంది. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పుకోవాలి. భగవంతుడు శాశ్వతుడు. ఈ కోణం నుంచి చూస్తే రాముడు త్రేతా యుగానికే పరిమితం కాదు. ఆయన సర్వకాలాలలో సర్వజీవులకు పూజనీయుడు.

లీలా మహత్యం...

సూర్యుడు ఒకచోట అస్తమిస్తే, మరోచోట ఉదయిస్తాడు. అలాగే భగవంతుడి వేడుకలు కూడా ఈ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంటాయి. ఈ వేడుకను మనం జరుపుకోవటం ద్వారా నిత్యలీలల్లో పాల్గొనే భాగ్యం లభిస్తుంది. భగవంతుని అనుగ్రహానికి పాత్రులం కాగలుగుతాం. సాధారణంగా భగవంతుడు తన లీలలను ప్రదర్శించేది జీవులకు సేవాభాగ్యాన్ని కల్పించటం కోసమే. అంతే కాకుండా ప్రతి లీలలో ధర్మం నిబిడీకృతమై ఉంటుంది. వీటిని అర్థం చేసుకున్నప్పుడు... జీవితంలో ఏ మార్గాన్ని అనుసరించాలనేది తెలుస్తుంది. సంప్రదాయక ఆచార్యుల ద్వారా ఈ లీలలను తెలుసుకుంటే వాటికి ప్రామాణికత ఉంటుంది. లేకపోతే తప్పుగా అర్థం చేసుకొనే అవకాశమూ ఉంటుంది.

శ్రీరామ రక్ష...

"ఎవరైనా నన్ను ఒక్కసారైనా నిజముగా శరణువేడి స్వామీ! ఈ రోజు నుండి నేను నీ వాడను అంటూ తనకు అభయమొసగమని ప్రార్థిస్తే, అట్టివానికి ఆ క్షణము నుండి అభయమిచ్చి సర్వదా సంరక్షించెదను" అని రాముడే స్వయంగా ప్రకటిస్తాడు. ఈ ధోరణి శ్రీరామచంద్రుడి లీలా వైభవంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. రావణాసురుని నుండి తమను రక్షింపమని దేవతలే అడిగినా లక్ష్మణుని తల్లికి.. సుగ్రీవునికి లేదా విభీషనుడికి ఇచ్చిన మాటైనా.. ఇలా ప్రతి సందర్భంలోనూ అందరికీ రాముడు అభయమిస్తాడు. అలాంటి రాముడిని చేరుకోవటానికి ఉత్తమమైన మార్గం... భగవన్నామ జపం. "భిన్నత్వాన్ నామ నామినో" అంటుంది పద్మపురాణం. భగవన్నామానికి మరియు భగవంతునికి మధ్య ఎట్టి వ్యత్యాసమూ లేదని దీని అర్థం. భగవన్నామాన్ని జపిస్తే భగవంతుడు మనవద్దనున్నట్టే. రామ నామాన్ని జపించేవారికి ఆ నామమే అభయాన్ని ప్రసాదిస్తుంది. శ్రీరామచంద్ర ప్రభువు నేటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే ఉన్నాడు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

స్థితప్రజ్ఞత అదే

భారతీయులకు శ్రీరాముడు ఆరాధ్యదైవం. మన దేశంలో రామాలయం లేని గ్రామమే ఉండదు. భారతీయులందరూ శ్రీరాముడిని ఎందుకు కొలుస్తారు? ఈ ప్రశ్న అనేక మందిలో తలెత్తుతూ ఉంటుంది. దీని వెనకున్న కారణాలు చూద్దాం.

జాగ్రత్తగా గమనిస్తే శ్రీరాముడి జీవితమంతా విపత్తుల విలయంలో చిక్కుకున్నట్లు కనిపిస్తుంది. రాజ్యాన్ని కోల్పోయి అడవుల పాలవుతాడు. తన భార్యను అపహరించిన రావణుడితో తనకు ఏ మాత్రం ఇష్టంలేని యుద్ధం చేస్తాడు. రాజ్యానికి తిరిగి వచ్చిన తర్వాత తన భార్య గురించి తన రాజ్య ప్రజలే తక్కువ చేసి మాట్లాడటం విని నొచ్చుకుంటాడు. తప్పనిసరి పరిస్థితుల్లో విషాద హృదయంతో.. తనకు అత్యంత ప్రాణప్రదమైన సీతను.. నిండుచూలాలని కూడా చూడకుండా అడవిలో వదిలిపెడతాడు. ఇవన్నీ చాలవన్నట్లు తెలియకుండానే.. పుత్రులతో యుద్ధం చేస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అనర్థాలు. ఇలాంటి సమయంలో రాముడు ఎలా ప్రవర్తించాడు? ఇతరులకు ఎలా ఉదాహరణగా నిలిచి స్థితప్రజ్ఞుడనిపించుకున్నాడనేదే ముఖ్యమైన విషయం.

అన్నింటినీ తట్టుకొని...

ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల వ్యక్తిత్వం రాముడి సొంతం. ఎంతటి విపత్తు వచ్చినా.. దానికి కారణమైన ఇతరులను ఆయన ఎప్పుడూ దూషించలేదు. ఎందుకంటే- బాహ్య పరిస్థితులు మన చేతులో ఎప్పుడూ ఉండవు. అవి తారుమారు అవుతూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోగలగటమే రాముడి వ్యక్తిత్వం. ఒక ఉదాహరణ చూద్దాం. తుఫాను వస్తుందని మీకు ముందే తెలుసు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ ఊహించిన దాని కన్నా పెద్ద తుఫాను వచ్చి ఇంటిని ఊడ్చుకుపోతే? 'నాకు ఇలాంటి దుర్ఘటనలు జరగవు' అనుకోవటం అవివేకుల లక్షణం. 'ఎలాంటి దుర్ఘటనలు జరిగినా నేను ఎదుర్కొంటాను' అనుకోవటం వివేకవంతుల లక్షణం. ఇలాంటి వివేకాన్ని పంచగలిగాడు కాబట్టే రాముడు అందరికీ ఆరాధ్యుడయ్యాడు. రాముడు ఎంత విపరీతం ఎదురయినా.. చెక్కు చెదరకుండా.. సత్యమార్గాన్ని వీడకుండా.. స్వధర్మాన్ని ఆచరిస్తూ వచ్చాడు. ఇక్కడ మనం ఒక విషయాన్ని చెప్పుకోవాలి. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే కొందరు విపత్తులను కావాలని.. జీవితం సజావుగా సాగకూడదని కోరుకుంటారు. భగవంతుడు తమకు సమస్యల ద్వారా పరీక్షలు పెడితే.. మరణించే ముందు తమకు తాము తెలుసుకొనే అవకాశముంటుందని వారు నమ్ముతారు. సాధనా క్రమంలో ఎంత పరిపక్వత సాధించామనే విషయాన్ని తెలుసుకోవటానికి ఎలాంటి విపత్తులనైనా ఆనందంగా ఎదుర్కొంటారు. మరణం ఆసన్నమయినప్పుడు ఏ మాత్రం తొణకకుండా దానిని హుందాగా అక్కున చేర్చుకోవాలనేది వీరి తపన.

అవలీలగా...


మీ జీవితంలో మీరేం చేశారు.. ఎంత సంపాదించారు.. ఏం జరిగిందీ.. ఏం జరగలేదు.. వంటి విషయాలకు ఎటువంటి విలువా లేదు. సంకటస్థితుల్లో ఉన్నప్పుడు మీరు ఒడ్డుకు ఎలా చేరారనేదే ముఖ్యం. శ్రీరాముడిలా అన్ని కష్టాలను అవలీలగా.. హుందాగా ఎలా ఎదుర్కొన్నారన్న విషయంపైనే జీవిత సాఫల్యం ఆధారపడి ఉంటుంది. మన దేశంలో అనేక ప్రాంతాల్లో ఇంద్రభవనం లాంటి ఇంటిని ఆనుకుని.. ఓ పూరి గుడిసె కూడా ఉంటుంది. పొరిగింటివాడంత ఐశ్వర్యం లేకపోయినా.. పూరి గుడిసెలో ఉన్నవాడూ అంత గర్వంగానూ ఉంటాడు. దీనికి కారణం అతనికి ఉన్న స్వాభిమానం. దీనికి సిరిసంపదలతో సంబంధం లేదు. ఈ స్వాభిమానం ఉంటే ఉరికంబం వైపు కూడా హుందాగానే నడుస్తారు. అయితే కేవలం స్వాభిమానం ఉంటే సరిపోదు. మన చుట్టూ ఉన్న బాహ్య పరిస్థితులను తప్పకుండా చక్కదిద్దుకోవాలి. ఎందుకంటే దానిలో మనతో పాటుగా ఇతరుల హితం కూడా ఉంది. రాముడే దీనికి ఉదాహరణ. ఆయన తన బాహ్యపరిస్థితులను చక్కదిద్దుకోవటానికి ప్రయత్నించాడు. కొన్ని సార్లు విఫలమయ్యాడు. కొన్ని సందర్భాలలో పరిస్థితులు చేయి జారిపోయినట్లు కనిపిస్తాయి కూడా. అయినా ఆయన శాంతాన్ని కోల్పోలేదు. తనకు అనుకూలంగా పరిస్థితులను సృష్టించుకున్నాడు. ఇది ఆధ్యాత్మిక ప్రయాణంలో ఉన్నవారికి ఒక ముఖ్యమైన పాఠం. మీ అంతరంగా పరిమళాలు వెదజల్లే పుష్పాలుగా వికసించాలంటే.. దానికి అనువైన వాతావరణాన్ని మీరే సృష్టించుకోవాలి.

పొరిగింటివాడంత ఐశ్వర్యం లేకపోయినా.. పూరి గుడిసెలో ఉన్నవాడూ అంత గర్వంగానూ ఉంటాడు. దీనికి కారణం అతనికి ఉన్న స్వాభిమానం. దీనికి సిరిసంపదలతో సంబంధం లేదు. ఈ స్వాభిమానం ఉంటే ఉరికంబం వైపు కూడా హుందాగానే నడుస్తారు.



ప్రేమాశీస్సులతో
సద్గురు





యుగయుగానికి ఓ రాముడు

పుట్టిన ప్రతి మనిషి మరణించక తప్పదు. ఇది తెలిసిన రాముడు మరణిద్దామనుకున్నాడు. "యమ! నువ్వు వచ్చి నన్ను వైకుంఠానికి తీసుకువెళ్ళు" అని కోరాడు. కానీ యముడు అయోధ్యకు వచ్చి రాముడిని తీసుకువెళ్లటానికి ఇష్టపడలేదు. కారణం హనుమంతుడు. ఆయన ఎప్పుడూ అయోధ్యను, రాముడిని కాపలా కాస్తూ ఉంటాడు. ఇది రాముడికి తెలిసింది. యముడు రావాలంటే హనుమంతుడు అయోధ్యలో ఉండకూడదు. దీనికి రాముడు ఉపాయం ఆలోచించాడు. తన ఉంగరాన్ని తీసి తన మందిరంలోని ఒక చీలికలో పడేశాడు. హనుమను పిలిచి "ఉంగరం పడిపోయింది. సూక్ష్మ రూపంలో వెళ్లి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. హనుమ చిన్న కందిరీగలా మారి చీలికలో దూరాడు. ఆ చీలిక ఒక సొరంగంలా మారింది. ఆ సొరంగం నాగలోకానికి నేరుగా చేరింది. హనుమంతుడు నాగలోక రాజైన వాసుకి దగ్గరకు వెళ్లి "నా రాముడి ఉంగరం పడిపోయి నీ లోకానికి చేరింది. దానిని తీసుకువెళ్లటానికి వచ్చా" అన్నాడు. వాసుకి చిరునవ్వు నవ్వి హనుమంతుడిని నాగలోకం మధ్యలోకి తీసుకువెళ్లాడు. అక్కడ కొన్ని వేల ఉంగరాలు గుట్టగా ఉన్నాయి. "ఈ గుట్టలో రాముడి ఉంగరం పడి ఉంటుంది. వెతుకు" అన్నాడు. 'ఈ గుట్టలో రాముడి ఉంగరం ఎలా వెతికాలి?' అనుకుంటూ హనుమ గుట్టపైకి వెళ్లాడు. అక్కడ రాముడి ఉంగరం కనిపించింది. హనుమంతుడికి విపరీతమైన ఆనందం కలిగింది. ఆ ఉంగరాన్ని తీసుకొని.. మరో ఉంగరం వైపు చూశాడు. అది కూడా రాముడి ఉంగరమే! ఒక్కొక్కటి చూస్తుంటే- అన్నీ రాముడి ఉంగరాలే! హనుమంతుడికి ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు వాసుకి- "హనుమ! నువ్వు చూస్తున్నది నిజమే. కానీ ఇదంతా ఒక మాయ. ఈ ప్రపంచం చావు-పుట్టుకలనే చక్రంలో తిరుగుతూ ఉంటుంది. ఒక సారి చక్రం తిరిగితే దానిని కల్పం అంటారు. ఒకో కల్పంలోను నాలుగు యుగాలు ఉంటాయి. ఇది త్రేతా యుగం. దీనిలో రాముడు అయోధ్యలో పుట్టాడు. ఆయన చేతి ఉంగరం జారి సర్పలోకానికి వచ్చింది. దానిని వెతుక్కుంటూ ఒక వానరం వచ్చింది. ఈ లోపులో భూమిపై రాముడు మరణిస్తాడు. ఇలాంటి లక్షల కల్పాలు తిరుగుతూ ఉంటాయి. గుట్టలో ఉన్న ఉంగరాలే దీనికి నిదర్శనం. ఇది ఎంత కాలం జరుగుతుందో నాకు తెలియదు.." అన్నాడు. అప్పుడు హనుమంతుడికి రాముడు తనను ఉంగరం వెతకమని ఎందుకు పంపాడో అర్థమయింది. రాముడు మరణిస్తాడు. ప్రపంచం అంతమయిపోతుంది. మళ్లీ కొత్త ప్రపంచం పుడుతుంది. దానిలో మళ్లీ రాముడు పుడతాడు. ఈ సృష్టి రహస్యం హనుమంతుడికి అర్థమయిన తర్వాత మనసుకు ప్రశాంతత కలిగింది.

(కాలచక్రం మన భారతీయ తాత్విక చింతనలో ఒక ముఖ్యమైన అధ్యాయం. రాముడు ఒక ప్రాంతానికో.. ఒక ప్రాంత చరిత్రకో సంబంధించినవాడు కాదు. రాముడి పుట్టుపూర్వోత్రాలు కనుగొనటం కన్నా ఆ అవతారం వెనుకున్న తాత్విక చింతనను తెలియజేయటానికి ఈ కథను చెబుతారు.)

రక్షించేది విశ్వాసమే

సద్బోధ

జపాన్‌లో బహుళ ప్రచారంలో ఉన్న ఈ కథను యదార్థమైనదని చెబుతారు. యుద్ధవీరుడైన (సమురై) ఒక యువకుడు ఉండేవాడు. అతను ఎక్కడికి వెళ్ళినా... ఒరలో కత్తి ఉండేది. అతనికి వివాహమైన తరువాత.. కొన్ని రోజులపాటు ఎక్కడైనా ఆనందంగా గడిపి వద్దామని ఆ దంపతులు అనుకున్నారు. సమీపంలో ఉన్న ఒక అందాల దీవిని దాని కోసం ఎంచుకున్నారు. ఒక పడవలో వారిద్దరూ బయలు దేరారు. కబుర్లు చెప్పుకుంటూ, హాయిగా, సంతోషంగా వారు ప్రయాణిస్తున్నారు. కొంతదూరం ఈ ప్రయాణం బాగానే సాగింది. కానీ హఠాత్తుగా తుపాను మొదలయింది. రానురానూ వాతావరణం భీకరంగా మారింది. వారు ప్రయాణిస్తున్న పడవ అటూ ఇటూ ఊగడం మొదలుపెట్టింది. గాలి, వాన తీవ్రమయ్యాయి. పడవ ఏ క్షణంలోనైనా మునిగిపోయే పరిస్థితిలో ఉంది.



ఆ యువకుని భార్యకు భయం వేసింది. తీవ్రంగా వణుకుతోంది. అయితే తన భర్తలో ఎలాంటి ఆందోళన లేకపోవడాన్ని ఆమె గమనించింది. తాము చావు కోరల్లో ఉన్నా అతను ప్రశాంతంగా... పడవ ఎక్కినప్పుడు ఉన్నట్టే ఉండడం చూసి "ఏమండీ! ఏమైంది మీకు? ఏ ఊహాలోకంలో విహరిస్తున్నారు? ఈ లోకంలోకి వచ్చి చుట్టూ ఎలా ఉందో చూడండి. భయంకరమైన తుపానులో మనం ఇద్దరం చిక్కుకుపోయాం. మన పడవ ఎప్పుడైనా మునిగిపోవచ్చు. మనకు ఇవే ఆఖరి క్షణాలు కావచ్చు. మన తొలి ప్రయాణం ఇలా విషాదాంతం అవుతుందనుకోలేదు. ఇలాంటి భయంకరమైన క్షణాల్లో... మనం ప్రాణాలతో ఎలా బయటపడాలో ప్రయత్నించకుండా, కనీసం ఆలోచించకుండా ఊరకే ప్రశాంతంగా కూర్చున్నారేమిటి?" అంది నిష్ఠూరంగా.

వెంటనే ఆ యువకుడు తన ఒరలోని కత్తిని తీసి ఆమె మెడ మీద పెట్టాడు. అలాంటి వాతావరణంలో కూడా ఆమె నవ్వడం మొదలుపెట్టింది.

"ఎందుకు నవ్వుతున్నావు? నీకు భయంగా లేదా? కత్తి ఎంత పదునుగా ఉందో నీకు తెలీదా? ఇలాంటి కత్తి నీ కంఠం దగ్గర ఉందనే విషయం మరచిపోయావా? ఒక్కసారి దాన్ని కదిలిస్తే చాలు, నీ కంఠం తెగుతుంది. నీ పంచప్రాణాలూ పంచభూతాల్లో కలిసిపోతాయి. అంత పదునైన కత్తి ఇది" అన్నాడు.

అప్పుడు ఆమె "అది ఎంత పదునైన కత్తి అయినా, ఎంత భయంకరమైన కత్తి అయినా మీ చేతిలో... అంటే నన్ను అమితంగా ప్రేమించే నా భర్త చేతిలో ఉంది. కాబట్టి నాకెందుకండీ భయం" అంది.

ఆ యువకుడు తన కత్తిని ఒరలో పెట్టేసి... "ఆ కత్తి నా చేతిలో ఉంటే నీకు భయం కలగనట్టే... ఈ తుపానును చూసి నాకూ భయం వేయడం లేదు. పదునైన కత్తి కన్నా ఈ తుపాను ఎంతో భయంకరమైనది, ప్రమాదకరమైనదీ కావచ్చు. కానీ అది నేను ప్రేమించే, నన్ను అంతకన్నా అమితంగా ప్రేమించే నా తండ్రి అయిన దైవం అధీనంలో, ఆయన ఆజ్ఞకు లోబడే ఉంటుంది. అలాంటప్పుడు నాకు, నా అర్ధాంగిగి ఏ ప్రమాదమైనా ఎలా సంభవిస్తుంది?" అని ప్రశ్నించాడు. భక్తులను రక్షించేది భగవంతుడి పట్ల ఉండే ఇలాంటి దృఢమైన విశ్వాసమే. అదే ప్రహ్లాదుణ్ణి ఎన్నో ఆపదల నుంచి రక్షించిందని భాగవతం చెబుతోంది.

• రాచమడుగు శ్రీనివాసులు

తెలుసుకుందాం

తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలతో సహా పది (దశ) దిశలున్నాయి. అలాగే గోవు, భూమి, ధాన్యం, వస్త్రాదులతో కలిపి దశవిధ దానాలూ ఉన్నాయి. ఇలాంటివే దశ నా ద ధ్వనులు. ఈ దశ నాద ధ్వనుల అంతరార్థం మనో నివేదన. నాదమైనా.. నినాదమైనా దైవారాధనలోని ప్రధాన భాగమే. మనసును కేంద్రీకరించడంలోని అంతర్భాగమే ఈ నాద ఆరాధన ! అలాంటి ఆరాధానలేమిటో తెలుసుకుందాం.

దశ నాద ఆరాధన



జల నాదం: దీని ప్రస్తావన 'వర్ణన రత్నాకరం'లో ఉంది. చిన్న నీటి ఊట నుంచి మహాసముద్రం వరకు అంతా జలమే. నీటితో నిండిన పాత్రలతో జల తరంగిణి మన దేశంలో అలనాడు పేరొందిన వాద్యం. దీని ప్రత్యేకతను ఒకప్పటి 'సంగీత పారిజాతం' గ్రంథం వివరిస్తుంది.

చిణి నాదం: ఇది పూర్తి విభిన్న శైలి. గురుశిష్య విద్యానుబంధానికి సంబంధించింది. గురూపదేశం అనుసరించి, చెవులు మూసి వినే విధానం ఇది. ప్రత్యేకించి ఓంకార స్వరం క్రమేణా చిరుగజ్జెల మోతలా పరివర్తితమవుతుంది. మంత్రం లేదా సందేశం వల్ల వీనులకు విందు అందుతుంది. అది 'చిణి' శబ్దాన్ని పోలి ఉంటుంది.





భేరీ నాదం: పెద్ద పెద్ద వాయిద్యాలతో మోతే భేరీ నాదం. దీని ప్రత్యేకతను 'శివ పురాణం'లో వినవస్తుంది. ఆలయ బ్రహ్మోత్సవాల తరుణంలో ఢమరుక శబ్దాలు, నినాదాలు మామూలే. పోతన తెలుగు భాగవతంలో ఒకచోట 'భేరీ భాంకారాలు' అనే పద ప్రయోగం ఉంది. గుర్రాల గిట్టల తాకిడి, రథ చక్రాల ఒరిపిడితో పాటు భటుల పాద ఘట్టనల తీవ్రత గురించి కూడా వివరం ఉంటుంది. ప్రద్యుమ్నుడు ధనుష్టంకారంతో శత్రుసేనలను భయభ్రాంతం చేశాడన్నది ఉత్కంఠను పెంచే ఘట్టం. అదే విధంగా కురుక్షేత్ర సమరంలో విజయభేరి 'ఫెళఫెళ' మోగిందని, 'ధణం ధణం' శబ్దం భీకరంగా ధ్వనించిందని ఇతిహాస కథనం. అలాంటి సందర్భంలో భేరీనాదం అరివీర భయంకరం.

కంకణి నాదం: ఇది మువ్వల సవ్వడి. దీనికే అందె, మంజీరం, పాదపట్టంగా పేర్లున్నాయి. గండపెండేరం తాలూకు శబ్దంగా పరిగణించవచ్చు. కాలి అందెలు ధరించి నడిచినప్పుడు 'ఘల్లు ఘల్లు' శబ్దం వస్తుంది. 'ఘల్లు ఘల్లున కాలిగజ్జెలు మోగుతుంటే కలికి కలహంస నడకతో వచ్చింద'న్నది కవి హృదయం.



కాహళ నాదం: 'ధ్వనులు పిక్కటిల్లగ శంఖ పటహ కాహళ' అనేదీ తెలుగు భక్తి కావ్య వర్ణనే. ఇదీ వాద్య విశేష అనుసంధానమే. బాకాను బిగ్గరగా ఊదినంత శబ్ద తీవ్రత ఇది. పెద్ద ఢంకా, బూరగొమ్ము శబ్దాలను 'కాహళ'తో సరిపోలుస్తుంటారు. ఈ నాద ధ్వని చాలా దూరం వ్యాపిస్తుంది. రామాయణ కావ్యంలోని యుద్ధ కథనంలో దీని విశదీకరణ గమనార్హం. ధనుష్టంకారం, బాణాల వర్షం, ప్రచండంగా విజృంభించడం, సింహనాదం చేస్తూ శత్రుసేనను ఓడించడం... వీటన్నింటి నేపథ్యాన సమరసీమలో కాహళ ధ్వని మిన్ను ముట్టిందనడం... ఆ శబ్ద ధాటికి సూచికలు. నటరాజును స్తుతించే వేళలో 'ఢమఢమ డమరుక నాదం, భంభం శంఖారావం, ధిమింధిమిత మంగళ మృదంగం' అంటున్నపుడే కాహళ నాద తరంగ ధాటి మన చెవికి సోకుతుంది.

మృదంగ నాదం: మద్దెల, తప్పెట లాంటి చర్మవాయిద్యాల విశేషమిది. 'మోత', 'దరువు', 'మేళం'గా అందరికీ విదితం. మృదంగం సర్వ సాధారణంగా సహ-వాయిద్యం. తబలా, డోలక్ రూపాల శబ్దాలు శ్రోతలను అలరిస్తుంటాయి. శివ, గణేశ, నంది రూపాలకు అత్యంత ప్రీతి పాత్రం మృదంగమే. నంది వాయించే మృదంగం మహేశునికి ఇష్టం కాబట్టే అది దైవిక వాద్యంగా ప్రత్యేకత అందుకుంది.



భ్రమర నాదం: భ్రమరం అంటే తుమ్మెద. అది చేసే సడినే 'భ్రమర నాదం'గా భావిస్తుంటాం. 'తుమ్మెద ఝుంకారం' అనేది తరచుగా మనం వినే మాట. ఆ నల్ల రెక్కల ప్రాణిని కావ్యభాషలో 'చంచరీకం', 'భృంగం'గా పిలుస్తుంటాం. పురుగును తెచ్చి, మట్టి గూటిలో ఉంచి, చుట్టూ కప్పిన తర్వాత చిన్న రంధ్రాన్ని చేసి, ఆ చుట్టూతా శబ్దం చేస్తూ తిరుగుతుంటుంది భ్రమరం. దాని నిరంతర నాదం కొనసాగుతుండగానే, లోపలి కీటకానికి తుమ్మెద రూపు రావడమన్నది సహజసిద్ధ పరిణామం. ఇక్కడి సందర్భంలో 'భ్రమర నాదం' అనేది నిరంతర దైవ నామ స్మరణకు గుర్తు.

ఘంటానాదం: ఆలయాన గంటను మోగించినప్పుడు కలిగే శబ్దం పరమాత్మ ప్రతిరూపమని ప్రతీతి. భక్తులను, పరిసర ప్రాంతాల్లోని ఇతరులనూ ప్రభావితం చేసేది ఘంటా నాదమే. ఏ శబ్దమైనా ఆగకుండా సాగడమే నాదం అనుకుంటే, అందులో కీలకమైనది ఘంటానాదం. గంటను భక్తి భావంతో మోగించడంతో, మనసు కేంద్రీకృతమై దైవం మీదనే లగ్నమవుతుంది. మోగే ఘంటిక కారణంగా మనో సంబంధమైన అనుభూతి అంతటా నిండుతుంది.

వేణునాదం: వేణు అనే పదం వినడంతోనే గీతా గానం మన చెవిన పడినట్లవుతుంది. వెదురు గొట్టం ఒకవైపు తెరిచి, మరోవైపు మూసి ఉండి, పై భాగాన గాలి ఊదేలా రంధ్రం కానవస్తుంది. దాని ఆధారంగానే వేణుగాన మాధుర్యం మనం అనుభవించగలుగుతాం. మురళీ గాన రవళిని కావ్యాలెన్నో ప్రస్తావించాయి. 'మందారమూలే మదనాభిరామం, బింబాధరాపూరిత వేణునాదం' అనేది ఆ శబ్ద మధురిమను తేటతెల్లం చేస్తుంది. గోపాల మురళీరవానికి గోపికలు పరవశించారన్న అభివర్ణన ఉంది.

ప్రణవ నాదం: అన్నింటికన్నా మిన్న ప్రణవనాద భక్తి. 'ప్రణామయతి ఇత్యేస్మాత్ ప్రణవః' అనేది ఒక శ్లోక భాగం. 'సర్వం పరమాత్మే' అనేంత అనుభవ రూపసారమే ప్రణవం. నుతి, కైవారం, ప్రణుతి, సాధువాదం... అన్నీ ఇందులోనివే. విష్ణు పదానికి పర్యాయం ప్రణవమే! 'ఓం' అని మొదలవుతుంది ప్రణవనాదం. ప్రాణనాడులకు స్పందన అందిస్తుంది.



• జంధ్యాల శరత్‌బాబు, 9948345013

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 4 ఏప్రిల్ 2025

ఐపీఎల్‌లో నేడు | వేదిక లఖ్‌నవూ

లఖ్‌నవూ x ముంబై | రా.7.30

మరో ముగ్గురు సెమీస్‌కు

- ప్రపంచ బాక్సింగ్ కప్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్‌లో మనోళ్ల జోరు కొనసాగుతోంది. బ్రెజిల్‌లో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో మరో ముగ్గురు భారత బాక్సర్లు మనీష్ రాథోడ్ (55 కిలోలు), హితేశ్ (70 కిలోలు), అభినాష్ జమ్వాల్ (65 కిలోలు) తమ విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలకు చేరువయ్యారు. క్వార్టర్‌ఫైనల్ బౌట్లలో డెనిస్ బ్రిల్ (బ్రిటన్)పై అబినాష్, గ్రాబియెల్ గూడీ రోన్‌టాని (ఇటలీ)పై హితేశ్, యూసుఫ్ చోతియా (ఆస్ట్రేలియా)పై మనీష్ విజయం సాధించారు.

సూర్య ముంబై వెంటే..



ముంబై: డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ముంబై జట్టును వీడడం లేదని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్పష్టం చేసింది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మాదిరి సూర్యకుమార్ కూడా గోవా తరఫున రంజీ మ్యాచ్‌లను ఆడబోతున్నట్టు కథనాలు వెలువడ్డాయి. ఈనేపథ్యంలో ఎంసీఏ స్పందిస్తూ.. 'సూర్య తమ జట్టును వీడనున్నాడనే పుకార్ల గురించి తెలిసింది. అందుకే నిజానిజాల గురించి ఎంసీఏ అధికారులు సూర్యతోనే నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతను ముంబైకి ఆడడాన్నే గౌరవంగా భావిస్తున్నట్టు మాతో స్పష్టం చేశాడు' అని ఎంసీఏ సూచించింది. మరోవైపు తన నేతృత్వంలో ముంబై జట్టు నుంచి మరికొంత మంది ఆటగాళ్లను గోవాకు ఆడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు వచ్చిన కథనాలను సూర్యకుమార్ ఖండించాడు. 'మీరు స్క్రిప్ట్ రైటర్లా? జర్నలిస్టులా? హాస్యం కోసం ఇక కామెడీ సినిమాలు చూడడం మానేసి ఇలాంటి ఆర్టికల్స్ చదువుతా' అని ఎక్స్‌లో పేర్కొన్నాడు.

గోవా నాకు అద్భుత అవకాశం ఇచ్చింది

జైస్వాల్

దేశవాళీల్లో ముంబై నుంచి గోవాకు తరలడంపై యశస్వీ జైస్వాల్ స్పందించాడు. 'నా జీవితాంతం ముంబై క్రికెట్ సంఘానికి రుణపడి ఉంటా. ఆ జట్టు వల్లే నేనిలా ఉన్నా. కానీ గోవా నాకు జట్టును నడిపించే అద్భుత అవకాశం ఇచ్చింది. టీమిండియాకు ఆడనప్పుడు కచ్చితంగా గోవాకు అందుబాటులో ఉంటా' అని జైస్వాల్ వివరించాడు.



కోల్‌కతా.. వైభవంగా

80 రన్స్‌తో ఘన విజయం

సన్‌రైజర్స్‌కు హ్యాట్రిక్ ఓటమి

చెలరేగిన వెంకటేశ్ అయ్యర్

వైభవ్ ఆరోరా, వరుణ్‌లకు మూడేసి వికెట్లు

కోల్‌కతా: భారీ స్కోర్లకు మారుపేరుగా నిలిచే సన్‌రైజర్స్ హైదాబాద్‌కు ముచ్చటగా మూడో ఓటమి. ఎప్పటిలాగే మరోసారి బ్యాటర్ల వైఫల్యం రైజర్స్‌ను దెబ్బతీసింది. అటు ముంబై చేతిలో ఘోర ఓటమి తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మాత్రం ఘనంగా పుంజుకుంది. అన్ని విభాగాల్లో అద్భుతంగా రాణించిన ఈ జట్టు గురువారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 80 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రైజర్స్‌పై కేకేఆర్‌కు ఇది వరుసగా ఐదో గెలుపు. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60), రఘువంశీ (32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలతో సత్తా చాటగా, కెప్టెన్ అజింక్యా రహానె (27 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 38), రింకూ సింగ్ (17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 32 నాటౌట్) అదరగొట్టారు. ఛేదనలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/22), పేసర్ వైభవ్ ఆరోరా (3/29)ల ధాటికి సన్‌రైజర్స్ 16.4 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. క్లాసెన్ (33), కమిందు మెండిస్ (27) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా వైభవ్ అరోరా నిలిచాడు.

వికెట్లు టపటపా..: భారీ ఛేదనలో సన్‌రైజర్స్ బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. వరుస విరామాల్లో వికెట్లు తీసిన కేకేఆర్ బౌలర్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ధనాధన్ హిట్టింగ్‌తో చెలరేగే ఓపెనర్లు హెడ్ (4), అభిషేక్ (2)లతో పాటు ఇషాన్ కిషన్ (2) తొలి మూడు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. అప్పటికి జట్టు స్కోరు 9 పరుగులు మాత్రమే. తొలి మ్యాచ్ ఆడిన పేసర్ వైభవ్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే హెడ్‌ను అవుట్ చేయగా.. తన తర్వాతి ఓవర్‌లోనే ఇషాన్ పని బట్టాడు. రెండో ఓవర్‌లో అభిషేక్‌కు హర్షిత్ రాణా షాకిచ్చాడు. ఈ దశలో నితీశ్ (19), కమిందు నాలుగో వికెట్‌కు 35 పరుగులు జోడించారు. ఏడో ఓవర్‌లో కమిందు 6,4,6తో చెలరేగినప్పటికీ నితీశ్ వికెట్‌ను కోల్పోయింది. కుదురుకున్నట్టు కనిపించిన కమిందు స్పిన్నర్ నరైన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఇక, వరుణ్ రాకతో రైజర్స్ ఇబ్బందులు పెరిగాయి. ముందుగా అనికేత్ (6)ను వరుణ్ అవుట్ చేశాడు అయితే క్రీజులో క్లాసెన్ ఉండడంతో రైజర్స్ ఆశలు వదులుకోలేదు. అందుకు తగ్గట్టే అతడు కూడా భారీ షాట్లతో చెలరేగాడు. 14వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోరు చూపాడు. కానీ వైభవ్ అతడిని కూడా వెనక్కి పంపి కేకేఆర్ విజయాన్ని ఖాయం చేశాడు. ఆ తర్వాత 16వ ఓవర్‌లో వరుణ్ వరుసగా రెండు వికెట్లు తీయగా.. ఆ వెంటనే రస్సెల్ చివరి వికెట్‌ను పడగొట్టి 20 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.



చివర్లో జోరు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు డికాక్ (1), నరైన్ (7) మరోసారి విఫలమయ్యారు. 16 పరుగులకే ఈ జోడీ వెనుదిరిగినా మిడిలార్డర్ ఆదుకునే ప్రయత్నం చేసింది. అయితే 15వ ఓవర్లలో జట్టు 122/4తో ఉన్న దశలో 180 స్కోరు కూడా కష్టమే అనిపించింది. కానీ చివర్లో వెంకటేశ్ అయ్యర్ విధ్వంసానికి జట్టు అద్భుతంగా పుంజుకుని సవాల్ విసిరే స్కోరు సాధించింది. డెత్ ఓవర్లలో రైజర్స్ బౌలర్ల వైఫల్యం కారణంగా ఆఖరి ఐదు ఓవర్లలో కేకేఆర్ 78 పరుగులు రాబట్టింది. ఆరంభంలో కెప్టెన్ రహానె ఎదురుదాడికి దిగి బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అతడికి యువ బ్యాటర్ రఘువంశీ చక్కటి సహకారం అందించడంతో కేకేఆర్ స్కోరు గాడిన పడింది. రహానె వీలుచిక్కినప్పుడల్లా అద్భుత సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. వీరి జోరుకు పవర్‌ప్లేలో 53/2 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. 11వ ఓవర్‌లో రఘువంశీ వరుసగా 6,4 బాదినా.. రహానె వికెట్‌ను కోల్పోయింది. దీంతో మూడో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన రఘువంశీని స్పిన్నర్ కమిందు అవుట్ చేశాడు. ఐపీఎల్‌లో అతడికిదే తొలి వికెట్. అంతకుముందే అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను నితీశ్ జారవిడిచాడు. ఈ స్థితిలో వెంకటేశ్ అయ్యర్-రింకూ సింగ్ జోడీ బాధ్యత తీసుకుంది. అయితే పిచ్‌ను అర్థం చేసుకునేందుకు వీరు కాస్త సమయం తీసుకోవడంతో 12-15 ఓవర్ల మధ్య 25 పరుగులే వచ్చాయి. కానీ 16వ ఓవర్‌లో చెరో ఫోర్‌తో పరుగుల వేట మొదలైంది. హర్షల్ వేసిన ఆ ఓవర్‌లో రింకూ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. 18వ ఓవర్‌లో అయ్యర్ 4,4.. రింకూ సిక్సర్‌తో 17 రన్స్ వచ్చాయి. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లోనైతే అయ్యర్ 4,6,4,4తో 21 రన్స్ రాబట్టాడు. అటు 25 బంతుల్లోనే ఎస్‌ఆర్‌హెచ్‌పై వరుసగా మూడో ఫిఫ్టీని కూడా పూర్తిచేశాడు. అలాగే చివరి ఓవర్‌లో తొలి రెండు బంతులను 6,4గా మలిచినా మూడో బంతికి అనికేత్ క్యాచ్‌తో అయ్యర్ వెనుదిరిగాడు. అప్పటికే ఐదో వికెట్‌కు 41 బంతుల్లోనే 91 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేరింది. ఇదే ఓవర్‌లో రస్సెల్ (1) రనౌటైనా 13 రన్స్ చేసిన కేకేఆర్ 200 మార్క్‌ను అందుకోగలిగింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
కోల్‌కతా	4	2	2	0	4	0.070
ముంబై	3	1	2	0	2	0.309
లఖ్‌నవూ	3	1	2	0	2	-0.150
చెన్నై	3	1	2	0	2	-0.771
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
హైదరాబాద్	4	1	3	0	2	-1.612

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) జీషన్ (బి) కమిన్స్ 1, నరైన్ (సి) క్లాసెన్ (బి) షమి 7, రహానె (సి) క్లాసెన్ (బి) జీషన్ 38, రఘువంశీ (సి) హర్షల్ (బి) కమిందు 50, వెంకటేశ్ (సి) అనికేత్ (బి) హర్షల్ 60, రింకూ (నాటౌట్) 32, రస్సెల్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 200/6; వికెట్ల పతనం:** 1-14, 2-16, 3-97, 4-106, 5-197, 6-200; **బౌలింగ్:** షమి 4-0-29-1, కమిన్స్ 4-0-44-1, సిమర్‌జీత్ 4-0-47-0, జీషన్ 3-0-25-1, హర్షల్ 4-0-43-1, కమిందు 1-0-4-1.

సన్‌రైజర్స్: హెడ్ (సి) హర్షిత్ (బి) వైభవ్ 4, అభిషేక్ (సి) వెంకటేశ్ (బి) హర్షిత్ 2, ఇషాన్ (సి) రహానె (బి) వైభవ్ 2, నితీశ్ (సి) నరైన్ (బి) రస్సెల్ 19, కమిందు (సి/సబ్) అనుకూల్ (బి) నరైన్ 27, క్లాసెన్ (సి) అలీ (బి) వైభవ్ 33, అనికేత్ (సి) వెంకటేశ్ (బి) వరుణ్ 6, కమిన్స్ (సి) హర్షిత్ (బి) వరుణ్ 14, హర్షల్ (సి అండ్ బి) రస్సెల్ 3, సిమర్‌జీత్ (బి) వరుణ్ 0, షమి (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 16.4 ఓవర్లలో 120 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-9, 3-9, 4-44, 5-66, 6-75, 7-112, 8-114, 9-114, 10-120; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-1-29-3, హర్షిత్ రాణా 3-0-15-1, వరుణ్ చక్రవర్తి 4-0-22-3, రస్సెల్ 1.4-0-21-2, నరైన్ 4-0-40-1.

ఘనంగా విదిత్ వివాహం



ముంబై: భారత చెస్ గ్రాండ్ మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ ఓ ఇంటివాడయ్యాడు. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన 30 ఏళ్ల విదిత్.. హోమియోపతి వైద్యురాలైన నిధి కటారియాను మనువాడాడు. ఈ వేడుకలో చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ చాంపియన్ గుకేశ్ సందడి చేశారు. వరుడు విదిత్‌తో కలిసి విషీ, గుకేశ్ బాలీవుడ్ పాటలకు ఉత్సాహంగా స్టెప్పులేశారు.

ఐపీఎల్‌ను వీడిన రబాడ

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా పేసర్ రబాడ స్వదేశానికి తిరిగి వెళ్లినట్టు అతడి ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ ప్రకటించింది. వ్యక్తిగత కారణాలతోనే అతడు ఐపీఎల్‌ను వీడినట్టు గురువారం పేర్కొంది. కానీ, తిరిగి వస్తాడా? లేదా? ఒకవేళ వస్తే ఎప్పుడు? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సీజన్‌లో రబాడ రెండు మ్యాచ్‌లే ఆడాడు. బుధవారం బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో అతడి స్థానంలో అర్షద్ ఖాన్‌ను తుది జట్టులోకి తీసుకొన్నారు. రబాడ గైర్హాజరీలో సౌతాఫ్రికాకు చెందిన గెరాల్డ్ కొట్జీ లేదా అఫ్ఘాన్ ఆల్‌రౌండర్ కరీమ్ జనత్‌పై గుజరాత్ ఆధారపడే చాన్సుంది. కాగా, లీగ్‌లో పిచ్‌లపై విమర్శలు చేయడంతో.. బీసీసీఐ అతడిని టార్గెట్ చేసిందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రబాడ లీగ్‌ను వదలి వెళ్లాడని అనుకొంటున్నారు.

ఆ అందమైన అమ్మాయే.. నా గాళ్‌ఫ్రెండ్: ధవన్



న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ లవ్‌లో పడినట్టు చెప్పాడు. కానీ, ఆమె పేరును వెల్లడించలేదు. ఓ మీడియా చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ధవన్ మాట్లాడుతూ.. 'ఇప్పుడు ప్రేమలో ఉన్నా. ఆమె పేరు చెప్పలేను కానీ.. ఆ అందమైన అమ్మాయే నా గాళ్‌ఫ్రెండ్' అని చెప్పాడు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ధవన్.. ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్ అనే అమ్మాయితో కనిపించాడు. ఈమే గబ్బర్ గాళ్‌ఫ్రెండ్ అని కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.



ఆసియా క్రికెట్ చైర్మన్‌గా నఖ్వీ

న్యూఢిల్లీ: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కొత్త చైర్మన్‌గా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ ఎంపికయ్యాడు. శ్రీలంక క్రికెట్ చీఫ్ షమ్మి సిల్వ స్థానంలో నఖ్వీ బాధ్యతలు చేపట్టనున్నాడు. రొటేషన్ విధానంలో ఈసారి అవకాశం పాక్‌కు దక్కింది. గురువారం జరిగిన వార్షిక సర్వసభ్య భేటీలో ఏసీసీ చైర్మన్‌గా మొహిసిన్‌ను ఖరారు చేశారు. రెండేళ్లపాటు అతడు ఈ పదవిలో ఉంటాడు.

బిజినెస్

అమెరికా మార్కెట్లు క్రాష్!

డౌజోన్స్ 3 శాతానికి పైగా డౌన్

- 9% క్షీణించిన యాపిల్ షేరు
- బంగారం, వెండి, క్రూడ్ సైతం..

ట్రంప్ సుంకాలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న ఆందోళనలతో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. డౌజోన్స్ ఒకదశలో 1,278 పాయింట్లు (3.03 శాతం) క్షీణించగా.. ఎస్ అండ్ పీ 500 సూచీ 3.81 శాతం, నాస్‌డాక్ 4.88 శాతం నష్టపోయాయి. అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ షేరు ఒకదశలో 8.75 శాతం క్షీణించగా.. ఎన్‌విడియా 6.75 శాతం, గూగుల్ 3.15 శాతం, టెస్లా 4.72 శాతం తగ్గాయి. యూరోపియన్ మార్కెట్లు సైతం 3.60 శాతం వరకు నష్టపోయాయి. అంతేకాదు, ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ బంగారం సైతం 42 డాలర్ల మేర తగ్గి 3,123 డాలర్ల స్థాయికి, సిల్వర్ 32 డాలర్ల వద్దకు జారుకోగా.. బ్రెంట్ ముడిచమురు పీపా ధర 70 డాలర్లకు పడిపోయింది.

ఐటీ కుదేల్.. ఫార్మా జిగేల్

ముంబై: ట్రంప్ పరస్పర సుంకాలు భారత స్టాక్ మార్కెట్‌పై మిశ్రమ ప్రభావం చూపాయి. ఔషధాలకు ఈ సుంకాల నుంచి మినహాయింపునివ్వడంతో ఫార్మా రంగ షేర్లు భారీగా పుంజుకోగా.. సుంకాల కారణంగా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చని, వాణిజ్య యుద్ధాలకు దారితీయవచ్చని, అది దేశీయ ఐటీ కంపెనీల ఆదాయాలకు ప్రతికూలంగా పరిణమించవచ్చన్న ఆందోళనతో ఇన్వెస్టర్లు ఆ రంగానికి చెందిన షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈలోని ఫోకస్డ్ ఐటీ సూచీ 4.13 శాతం క్షీణించగా.. ఐటీ 3.78 శాతం, టెక్ ఇండెక్స్ 2.85 శాతం తగ్గాయి. ఫార్మా కంపెనీల ప్రాతినిధ్య సూచీ హెల్త్‌కేర్ 1.82 శాతం పెరిగింది.

సెన్సెక్స్ 322 పాయింట్లు డౌన్: ట్రంప్ సుంకాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఆరంభంలో సెన్సెక్స్ 809.89 పాయింట్లు క్షీణించి 75,807.55 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 322.08 పాయింట్ల నష్టంతో 76,295.36 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభ ట్రేడింగ్‌లో 186.55 పాయింట్ల వరకు పతనమైనప్పటికీ, చివర్లో 82.25 పాయింట్ల నష్టంతో 23,250.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని నాలుగు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా 3.98 శాతం వరకు నష్టపోయి సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.35,170 కోట్ల మేర పెరిగి రూ.413.33 లక్షల కోట్లకు చేరింది.

ఐటీ

పేరు	నష్టం(%)
పెర్సిస్టెంట్ సిస్టమ్స్	9.92
కోఫోర్జ్	7.77
కేపీఐటీ టెక్నాలజీస్	7.66
ఎంఫసిస్	4.05
టీసీఎస్	3.98
టెక్ మహీంద్రా	3.79
హెచ్‌సీఎల్ టెక్	3.71
ఎల్‌టీఐమైండ్‌ట్రీ	3.51
ఇన్ఫోసిస్	3.41
విప్రో	2.75
సైయెంట్	2.67

ఫార్మా

పేరు	లాభం(%)
జుబిలియెంట్ ఫార్మా	6.82
ఇప్కా ల్యాబ్స్	5.77
లుపిన్	4.24
నాట్కో ఫార్మా	3.73
సన్ ఫార్మా	3.26
సిప్లా	2.92
సువెన్ ఫార్మా	2.89
దివీస్ ల్యాబ్స్	1.90
గ్లెన్‌మార్క్ ఫార్మా	1.89
గ్లాండ్ ఫార్మా	1.75
గ్రాన్యూల్స్ ఇండియా	1.72
అరబిందో ఫార్మా	1.50
టొరెంట్ ఫార్మా	1.09
డాక్టర్ రెడ్డీస్	0.13

ట్రంప్ సుంకాల భేరీ

ఫార్మా, ఇంధన పరిశ్రమకు ఊరట

ఆటో, ఐటీ ఎగుమతులకు కష్టాలు

రొయ్యల ఎగుమతులూ ధమాల్ !

పారిశ్రామిక రంగం గగ్గోలు

అమెరికాకు అక్కరకు వచ్చే పరిశ్రమలపై కనికరం


న్యూఢిల్లీ: ప్రచ్ఛన్న యుద్ధం ముగిసింది. వాణిజ్య యుద్ధం ప్రారంభమైంది. దీన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరింత నిజం చేశారు. మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా 60కి పైగా దేశాల ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల పేరుతో 27 శాతం సుంకాలు విధించారు. అమెరికాను మళ్లీ ప్రపంచంలోనే గొప్ప దేశంగా తీర్చి దిద్దాలన్నా, లక్ష కోట్ల డాలర్లకు (సుమారు రూ.85.30 లక్షల కోట్లు) చేరువైన వాణిజ్య లోటును పూడ్చాలన్నా ఈ సుంకాలు తప్పవని తేల్చి చెప్పారు. అయితే ఇదే సమయంలో అమెరికాకు ముఖ్యంగా అమెరికా పరిశ్రమ, వినియోగదారులకు కీలకమైన ఫార్మా, సెమీకండక్టర్లు, ఇంధన దిగుమతులను సుంకాల నుంచి పూర్తిగా మినహాయించారు. ఈ నెల 5 నుంచి 10 మధ్య రెండు విడతలుగా ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి.



ఈ సుంకాల పోటుతో మన మార్కెట్‌ను ఈ రెండు దేశాలు తన్నుకుపోయే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ రొయ్యల ఎగుమతిదారు బీఎంఆర్ గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ బీద మస్తాన్ రావు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. అమెరికా నుంచి మన దేశానికి దిగుమతయ్యే మత్స్య ఉత్పత్తులపై విధిస్తున్న 30 శాతం సుంకాన్ని జీరోకి తగ్గించడం ద్వారా ఆదుకోవాలని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరాయి.

కొన్ని రంగాలకు మాత్రం కష్టమే

ట్రంప్ పోటుతో మన దేశానికి చెందిన కొన్ని రంగాలు పూర్తిగా డీలా పడ్డాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) లేదా అమెరికా స్థాయిలో సుంకాలు తగ్గించి ఆదుకోండని ప్రభుత్వాన్ని కోరాయి. లేకపోతే అమెరికా మార్కెట్‌లో ప్రవేశించడం మా వల్ల కాదని చేతులెత్తేస్తున్నాయి. ట్రంప్ సుంకాలతో ఈ కింది రంగాలు బాగా దెబ్బ తింటాయని భావిస్తున్నారు.




మత్స్య ఎగుమతులు

ట్రంప్ తాజా సుంకాలతో మత్స్య పరిశ్రమ బెంబేలెత్తి పోతోంది. అమెరికా ఇప్పటికే మన మత్స్య ఎగుతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ పేరుతో 3.88 శాతం, కౌంటర్ వయలింగ్ డ్యూటీ పేరుతో 5.77 శాతం సుంకాలు విధిస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాల పేరుతో అదనంగా మరో 26 శాతం సుంకాలు మోపింది. దీంతో మన మత్స్య ఎగుమతులపై అమెరికా విధించే సుంకాల భారం 35.65 శాతానికి చేరింది. దగ్గర్లోనే ఉన్న ఈక్వెడార్ నుంచి వచ్చే మత్స్య దిగుమతులపై మాత్రం 13.78 శాతం మాత్రమే వసూలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే మత్స్య ఎగుమతుల్లో 40 శాతం అమెరికాకే ఎగుమతవుతాయి. అందులో రొయ్యలదే పెద్ద వాటా. మన రొయ్యలకు ఇప్పటికే అమెరికా మార్కెట్‌లో ఈక్వెడార్, ఇండోనేషియాల నుంచి గట్టి పోటీ ఉంది. ఇపుడు



స్టీలు పరిశ్రమ బెంబేలు

మన స్టీలు ఎగుమతులపై ట్రంప్ సర్కా రు ఇప్పటికే 25 శాతం సుంకం వసూలు చేస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాల నుంచి మాత్రం మినహాయించింది. చైనా, యూరప్, జపాన్, దక్షిణ కొరియాల నుంచి దిగుమతయ్యే స్టీలుపై మాత్రం భారీగా ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో దాదాపుగా ఈ దేశాలకు అమెరికా మార్కెట్ మూసుకుపోయినట్టే. దాంతో ఈ దేశాలు తమ మిగులు స్టీలును మరింత జోరుగా భారత మార్కెట్‌లో డంప్ చేసే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి. మన దేశీయ స్టీలు పరిశ్రమకు పొంచి ఉన్న అతి పెద్ద ప్రమాదం ఇదేనని పేర్కొన్నాయి.



ఆభరణాల ఎగుమతులకూ దెబ్బే

ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఆభరణాల పరిశ్రమ సైతం విలవిల లాడుతోంది. మన ఆభరణాల్లో దాదాపు 30 శాతం అమెరికాకే ఎగుమతవుతాయి. ఈ ఎగుమతులపై అమెరికా ప్రస్తుతం జీరో నుంచి ఐదు శాతం సుంకం విధిస్తోంది. మనం మాత్రం అమెరికా నుంచి దిగుమతయ్యే జువెలరీపై సగటున 20 శాతం సుంకం విధిస్తున్నాం. ఇపుడు ట్రంప్ ప్రతీకార సుంకాలతో 27 శాతం భారం పడనుంది. ఇది అమెరికాపై ఎక్కువగా ఆధారపడిన కంపెనీలకు గొడ్డలి పెట్టని పరిశ్రమ పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వీలైనంత త్వరగా అమెరికాతో బీటీఏ కుదుర్చుకోవడం ద్వారా ఈ గండం నుంచి గట్టెక్క వచ్చని ప్రభుత్వానికి సూచించింది. లేకపోతే దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన అమెరికా మార్కెట్ మనకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి.

ఆటో బేఫికర్

ట్రంప్ 25 శాతం సుంకంపై దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ పెద్దగా భయపడడం లేదు. ఎందుకంటే మన దేశం నుంచి అమెరికాకు వాహనాల ఎగుమతులు అతి స్వల్పం. కాకపోతే ఆటోమొబైల్ విడి భాగాల తయారీ కంపెనీలు మాత్రం ఈ సుంకంపై కొద్దిగా భయపడుతున్నాయి. ఈ కంపెనీల మొత్తం ఎగుమతుల్లో 27 శాతం అమెరికాకే వెళతాయి. తన హార్లీడేవిడ్‌సన్ వంటి ఖరీదైన బైకులు, తన అనుంగు మిత్రుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా కార్ల దిగుమతులపై సుంకాలు తగ్గించేలా భారత్‌పై ఒత్తిడి పెంచేందుకే ట్రంప్ సర్కారు ఈ రంగంపై 25 శాతం పన్నుల భారం మోపిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పాడి పరిశ్రమ

మన పాడి ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 11.23 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాలతో ఇది 38.23 శాతానికి చేరింది. తన పాడి ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు భారత్ ససేమిరా అనడంతో అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. అయినా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడిన భారత పాడి పరిశ్రమకు ఈ సుంకాలతో వచ్చిన ముప్పు పెద్దగా ఉండదని పరిశ్రమ వర్గాలు చెబుతునాయి.

బియ్యం ఎగుమతులు

మన దేశం నుంచి అమెరికాకు ఏటా 2.5 లక్షల నుంచి మూడు లక్షల టన్నుల బియ్యం ఎగుమతవుతాయి. అమెరికా బియ్యం దిగుమతులపై మన దేశం 50 శాతం సుంకం విధిస్తోంది. అమెరికా మాత్రం 5.25 శాతం సుంకంతో అనుమతిస్తోంది. భారత్ కూడా అదే స్థాయికి తగ్గించాలని అమెరికా పట్టుబట్టింది. కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అనడంతో ఇపుడు ప్రతీకార సుంకాలతో ఇది 27 శాతానికి చేరింది. దీంతో అగ్రరాజ్యంలోని దక్షిణ భారత ప్రజలు భారత బియ్యం రకాల కోసం మరింత ఖర్చు చేయక తప్పదు.

జౌళి పరిశ్రమకు మేలే

మన జౌళి ఎగుమతులపైనా అమెరికా 28 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లపై ఇంతకంటే ఎక్కువ భారం మోపారు. ఇది భారత వస్త్ర పరిశ్రమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ కృషితోనే మన ఫార్మా ఎగుమతులకు ట్రంప్ ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు లభించింది.

- డాక్టర్ జీ.పార్థసారథి రెడ్డి, చైర్మన్, హెటెరో గ్రూప్

అమెరికా ప్రతీకార సుంకాలు మన మత్స్య ఎగుమతులను ముఖ్యంగా రొయ్యల ఎగుమతులను గణనీయంగా దెబ్బతీస్తాయి.

- బీద మస్తాన్ రావు, చైర్మన్, బీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్




ట్రంప్‌ది సెల్ఫ్ గోల్!

భారత్ సహా 60 దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచడాన్ని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ 'సెల్ఫ్ గోల్'గా అభివర్ణించారు. ఈ సుంకాల ప్రభావం భారత్‌పై చాలా స్వల్పమేనని ఆయన అభిప్రాయపడ్డారు. "అన్నింటికంటే ముందు ఈ సుంకాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. ఫుట్‌బాల్ ఆటలో ఇది సెల్ఫ్ గోల్ లాంటిది. ఇతర దేశాలపై ప్రభావం విషయానికొస్తే, భారత ఎగుమతులపై సుంకం పెంపు అమెరికా వినియోగదారులపై దరాభారం పెంచనుంది. ఫలితంగా భారత వస్తువులకు గిరాకీ తగ్గి, వృద్ధిపై ప్రభావం చూపవచ్చు" అన్నారు. ట్రంప్ సుంకాల పెంపు వెనక ఉద్దేశం దీర్ఘకాలంలో అమెరికాలో ఉత్పత్తి పెంచడమే. అది సాధ్యమయ్యేందుకు చాలా సమయం పట్టనుందన్నారు.. అమెరికా సుంకాలతో భారత మార్కెట్లో వస్తు ధరలపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు.









రోజుకో సిద్ధాంతం మార్చడం పవన్‌కు అలవాటే

ప్రకాశ్‌రాజ్



"ఏడాది క్రితం వరకు 'మా తండ్రి దేవుడిని నమ్మలేద'ని చెప్పిన పవన్ కల్యాణ్ మాటమార్చి 'మా తండ్రి రాముడి బోధనలతో నన్ను పెంచాడ'ని ఇప్పుడు చెబుతున్నాడు. నువ్వు మారుతుంటే నీతోపాటు అందరూ మారాలనుకోవడం సమంజసం కాదు. పవన్ కల్యాణ్‌కి ఓ సిద్ధాంతం అంటూ లేదు, కేవలం నోటికొచ్చినట్లు మాట్లాడటం, రోజుకో సిద్ధాంతం మార్చడం ఆయనకు అలవాటే' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. జస్ట్ ఆస్కింగ్ అంటూ తరచుగా సోషల్ మీడియాలో ప్రశ్నలు సంధిస్తూ సెన్సేషన్ క్రియేట్ చేసే ప్రకాశ్‌రాజ్...తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శల వర్షం కురిపించారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. 'నేను సనాతన ధర్మానికి, హిందూ ఇజానికి వ్యతిరేకిని కాను. కానీ సనాతని అని చెప్పుకునే పవన్ కల్యాణ్ మాత్రం కేవలం రాజకీయ అవసరాల కోసమే మతాన్ని వాడుకుంటున్నాడు. తిరుపతి లడ్డు కల్తీ అయిందంటూ రాజకీయం చేశారు. అధికారం తన చేతిలో ఉంచుకొని, పవన్ కల్యాణ్ నిందితులను పట్టుకోకుండా ఎందుకు ప్రకటనలకే పరిమితమయ్యారు. లడ్డులో కల్తీ నెయ్యి కలిపినట్లు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. లడ్డు అంశాన్ని రాజకీయం చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. ఇది సున్నితమైన అంశం. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్నావు. నీకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే టీటీడీ బోర్డు మెంబర్ల నియామకం వెనుక ఉన్న అవినీతి గురించి విచారించు. ఎందుకు పేద భక్తులు దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిల్చోవాలి. వీఐపీ దర్శనాలు ఎందుకు? తొక్కిసలాటకు కారణాలేమిటో గుర్తించు. నువ్వు డిప్యూటీ సీఎంవి..మాట్లాడే ముందు ఆలోచించు. ఆవేశంగా ఆలోచన లేకుండా మాట్లాడుతున్నావంటే.. నీ మాటల వెనుక ఏదో ఎజెండా ఉందని అర్థం. మీ రాజకీయ అవసరాల కోసం ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయవద్దు. నాది ఆగ్రహం, ఆక్రోశం కాదు. ప్రజల నమ్మకాలతో చెలగాటం ఆడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ ప్రకాశ్‌రాజ్ అన్నారు. లడ్డు వివాదం విషయంలో గతంలోనూ పవన్ కల్యాణ్‌ను ప్రశ్నిస్తూ ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.

నటిగా మరో మెట్టు ఎక్కిస్తుంది



హీరోయిన్ హెబ్బా పటేల్ నటించిన తాజా చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా అశోక్ తేజ తెరకెక్కించారు. తమన్నా భాటియా ముఖ్య పాత్ర పోషించారు. దర్శకుడు సంపత్ నంది సమర్పణలో మధు నిర్మించారు. ఈనెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు హెబ్బా పటేల్.

"ఇదో సూపర్ నేచురల్ థ్రిల్లర్. ఇందులో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. మొదటి భాగం చేసేటప్పుడు ఆ సినిమా ఘన విజయం సాధిస్తుందని.. దానికి సీక్వెల్ ఉంటుందని అస్సలు ఊహించలేదు. ఒక నటిగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. అశోక్‌తేజకు మంచి విజన్‌తో పాటు అపారమైన ప్రతిభ ఉంది. తమన్నా ఇందులో నా సోదరి పాత్రలో కనిపిస్తారు. శక్తిమంతమైన నాగసాధువు పాత్రలో ఆమె నటన సినిమాకే ప్రధానాకర్షణగా ఉంటుంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం చిత్రాన్ని మరోస్థాయికి తీసుకెళ్తుంది. ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతినిస్తుంది" అని చెప్పారు.

భామతో రాముడి ప్రేమగీతం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటుణ్ణి తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్ దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మించారు. నటుడు రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. గురువారం చిత్రబృందం టైటిల్ సాంగ్‌ను విడుదల చేసింది. 'ఎలాగుండే వాణ్నే ఎలా అయిపోయానే' అంటూ హీరోయిన్ ప్రేమ కోసం హీరో పడే ఇబ్బందులను వివరిస్తూ సాగే ఈ గీతానికి శ్రీహర్ష ఈమని సాహిత్యం అందించారు. రథన్ స్వరకల్పనలో శరత్ సంతోష్ ఆలపించారు. ప్రేక్షక హృదయాలను దోచుకొనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని నిర్మాత చెప్పారు. సినిమాలోని ఆరుపాటలు ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని దర్శకుడు చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా...



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ నెల 18న సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించారు. కల్యాణ్‌రామ్, విజయశాంతి నటన.. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అన్నారు. మాస్ ప్రేక్షకులకు విందుభోజనంలా ఉంటూనే కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న చిత్రమిదని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



ఆసక్తికరమైన మలుపులతో...

సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' ఉపశీర్షిక. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. ప్రకాశ్‌రాజ్, వీకే నరేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 10న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ప్రేమకథల స్పెషలిస్ట్, దర్శకుడు భాస్కర్ తన పంథా మార్చి తెరకెక్కించిన ఈ చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. సినిమా చాలా వేగంగా సాగుతూ ఆసక్తికరమైన మలుపులతో అలరిస్తుంది" అని అన్నారు. "సిద్ధు అద్భుతమైన వ్యక్తి. ఆయనతో సినిమా చేయడం చాలా సులభం. ప్రతీ ఒక్కరిలో ఓ జాక్ ఉంటాడు. ఆ జాక్ ఎవరు అనేది ఎవరికి వాళ్లే తెలుసుకోవాలి. నన్ను నమ్మి థియేటర్లకు వచ్చే ప్రేక్షకులను ఈ సినిమా నిరాశపరచదు" అని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ చెప్పారు. "సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. అన్ని రకాల ప్రేక్షకులూ చూడదగ్గ చిత్రమిది. తప్పకుండా ఘన విజయం సాధిస్తుంది" అని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. "దర్శకుడు భాస్కర్‌తో పని చేయడం మరిచిపోలేని అనుభవం. సిద్ధు నుంచి సెట్స్‌లో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఇందులో నా పాత్ర చాలా బాగుంటుంది" అని వైష్ణవి చైతన్య అన్నారు.

ఈక్విటీ మార్కెట్ దారెటు..?

సుంకాల దెబ్బకు మళ్లీ పుంజుకోనున్న విదేశీ పెట్టుబడులు!

న్యూఢిల్లీ: ట్రంప్ పరస్పర సుంకాలతో స్టాక్ మార్కెట్ పయనమెటు అని చిన్న మదుపరులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. సుంకాల కారణంగా అంతర్జాతీయంగా పెరగనున్న ఆర్థిక అనిశ్చితితో దేశీయ మార్కెట్ సూచీలు స్వల్పకాల దిద్దుబాటుకు లోనుకావచ్చని, మార్కెట్లో ఒడుదుడుకులు పెరగనున్నాయని ఈక్విటీ నిపుణులు అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలంలో మాత్రం మార్కెట్ వృద్ధి పథంలోనే కొనసాగనుందని వారు పేర్కొన్నారు. అమెరికా సుంకాలు ఆందోళనకరమే అయినప్పటికీ, ఏయే రంగాలపై ప్రభావమెంత అనే స్పష్టత వచ్చిందన్నారు. సుంకాల ప్రభావంతో అమెరికా, చైనాలో ఆర్థిక అనిశ్చితి పెరగనున్నందున విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆనంద్ రాఠీ గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్ సుజన్ హజ్రా అన్నారు. కార్పొరేట్ కంపెనీల ఆదాయ వృద్ధి, దేశీయ సంస్థాగత పెట్టుబడులు, బలమైన దేశీయ ఆర్థిక మూలాలు మధ్య-దీర్ఘకాలంలో మన మార్కెట్లకు సానుకూలంగా పరిణమించనున్నాయని అన్నారు.

- మార్కెట్ ప్రస్తుత ఒడుదుడుకులను మదుపరులు అవకాశంగా మల్చుకోవాలని, సూచీలు దిద్దుబాటుకు లోనైన సమయాల్లో ఆకర్షణీయ ధరలకు లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌లో పెట్టుబడులు పెంచుకుంటూ పోతే దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలను పొందవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ సూచిస్తోంది.
- ఈక్విటీ ఇన్వెస్టర్లు, ముఖ్యంగా చిన్న మదుపరులు జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిదని.. వ్రైట్ రీసెర్చ్ పీఎంఎస్ వ్యవస్థాపకులు, ఫండ్ మేనేజర్ సోనమ్ శ్రీవాస్తవ అన్నారు. నాణ్యమైన కంపెనీల స్టాక్స్‌లో పెట్టుబడులపై దృష్టిసారించాలని, స్థూల ఆర్థికాంశాలను నిశితంగా గమనిస్తుండాలన్నారు.

భారత జీడీపీకి 0.5 శాతం గండి

రూపాయి మారకం విలువకు మాత్రం సానుకూలం

న్యూఢిల్లీ: ట్రంప్ సుంకాల ప్రభావం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయ వృద్ధికి గరిష్ఠంగా 0.5 శాతం మేర గండిపడవచ్చని, యూఎస్‌కు మన ఎగుమతులు 2-3 శాతం మేర తగ్గే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. అమెరికా సుంకాలపై భారత్ ప్రతీకార చర్యలు చేపట్టని పక్షంలో, మన జీడీపీ వృద్ధిపై 0.5 శాతానికి మించి ప్రభావం ఉండకపోవచ్చని ఈవై చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ అన్నారు. "2025-26లో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదు కావచ్చని గతంలో అంచనా వేశాం. ట్రంప్ సుంకాల ఫలితంగా ఈ సారి వృద్ధి 6 శాతానికి పరిమితం కావచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ఔషధాలు సహా మరికొన్ని వస్తువులపై మినహాయింపులను పరిగణనలోకి తీసుకుంటే భారత ఎగుమతులపై నికర సుంకం పెంపు 20 శాతంగా ఉండనుందని, ఫలితంగా ఈ సారి వృద్ధిరేటు గత అంచనాల కంటే 0.35-0.40% మేర తగ్గవచ్చని స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా హెడ్ అనుభూతి సహాయ్ అభిప్రాయపడ్డారు. అమెరికా-భారత్ మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరాక ఈ విషయంపై తుది అంచనాకు రావచ్చన్నారు. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ధరలు మళ్లీ పెరిగి డాలర్ బలహీనపడవచ్చని.. ఇది మన రూపాయి మారకం విలువకు సానుకూలంగా పరిణమించవచ్చని ఈవైకి చెందిన డీకే శ్రీవాస్తవ అన్నారు.

ఎగుమతులపై పరోక్ష ప్రభావమే ఎక్కువ.. : ట్రంప్ సుంకాలతో ఈసారి భారత జీడీపీ వృద్ధి 0.30-0.60% మేర తగ్గవచ్చని మోర్గాన్ స్టాన్లీ ఆర్థికవేత్తలు ఉపాసన చాచ్ర, బానీ గంభీర్ అన్నారు. భారత్‌పై సుంకాలు అంచనాల కంటే అధికంగా విధించినప్పటికీ, మన పోటీ దేశాలతో పోలిస్తే మాత్రం తక్కువేనన్నారు. అమెరికాకు ఎగుమతులు భారత జీడీపీలో కేవలం 2.1 శాతమే కావడంతో సుంకాల ప్రత్యక్ష ప్రభావం అంత తీవ్రంగా ఉండదని వారు అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ఆర్థిక వృద్ధి మందగించడంతో పాటు అంతర్జాతీయంగా వాణిజ్యం బలహీనపడితే మన ఎగుమతులపై పరోక్షంగా అధిక ప్రభావం చూపవచ్చన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	131	విజయవాడ	140
వరంగల్	131	గుంటూరు	135
కరీంనగర్	131	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	131	చిత్తూరు	100
కర్నూలు	131	నెల్లూరు	105
విశాఖపట్నం	124	అనంతపురం	105
గోదావరి	140		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	400	విజయవాడ	430
వరంగల్	402	గోదావరి	425
చిత్తూరు	495	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,380 ▲	85,600 ▲	1,12,000 ▼
విజయవాడ	94,000 ▼	87,500 ▼	1,03,000 ▲
విశాఖపట్నం	89,330 ▲	81,890 ▲	94,510 ▼
రాజమండ్రి	93,380 ▲	85,600 ▲	1,00,400 ▼
ప్రొద్దుటూరు	93,450 ▲	85,970 ▲	99,800 ▲
ముంబై	90,340 ▼	82,760 ▼	95,960 ▼

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేటి నుంచి స్లాట్ బుకింగ్

» డిజిటల్ క్యూను అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ అవసరాల కోసం గంటల తరబడి ఎదురుచూసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇప్పటివరకు పైలట్‌గా అమలైన కార్యక్రమం పట్టాలెక్కింది. ఇక నుంచి ముందుగా స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి కార్యాలయానికి వెళ్తే చాలు.. రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా ప్రభుత్వం కొత్తగా డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీక్యూఎంఎస్)ను అమల్లోకి తెచ్చింది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం సచివాలయం నుంచి ఈ సేవలను ప్రారంభిస్తారు. మార్చి 10 నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డీక్యూఎంఎస్ సేవలను పైలట్‌గా అమలు చేస్తున్నారు.

స్లాట్ బుకింగ్.. ప్రయోజనాలు ఇలా..!

పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సిస్టమ్ ద్వారా, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్‌సైట్‌లోని స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా, అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ వల్ల సమయం ఆదా అవుతుంది. అనధికారిక కార్యకలాపాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు తగ్గుతాయి. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాలు తగ్గుతాయి. ఏప్రిల్ 4నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకూ ఈ స్లాట్ బుకింగ్ వ్యవస్థను విస్తరిస్తామని పేర్కొంది.

'వక్ఫ్' సంబరాలు



వక్ఫ్ బిల్లు సవరణలకు పార్లమెంటు ఆమోదం లభించడంతో విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మైనార్టీ మోర్చా కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ నేతృత్వంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నిన్నటి వరకూ బడాబాబుల చేతుల్లో మగ్గిన వక్ఫ్ ఆస్తులు ఇక నుంచి పేద, వితంతు ముస్లిం మహిళలకు ఉపయోగపడతాయని పలువురు ఆకాంక్షించారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

సవరణలు ప్రతిపాదించింది టీడీపీ ఒక్కటే

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆలోచనతో ఉన్నారు. రాష్ట్రంలో ముస్లింల రక్షణ, వారి అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉంది' అని ఆ పార్టీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "దేశంలో టీడీపీ ఒక్కటే కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లులోని అభ్యంతరాలను నిర్మొహమాటంగా జాయింట్ పార్లమెంట్ యాక్షన్ కమిటీకి సిఫార్సు చేసింది. ఈ విషయంలో టీడీపీ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న అంశాన్ని ముస్లిం సమాజం గమనిస్తోంది. కీలకమైన వక్ఫ్ బిల్లుపై చర్చ జరుగుతుంటే వైసీపీకి చెందిన ఒక్క ఎంపీ కూడా నోరు మెదపలేదు. నిజంగా జగన్‌కు ముస్లింలపై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ ఎంపీలు ఎందుకు మాట్లడలేదు? 'వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించ వద్దు, వక్ఫ్ బిల్లుకు సంబంధించిన అంశాలను పరిష్కరించే అధికారాన్ని కలెక్టర్ స్థాయి కన్నా ఉన్నత స్థాయి అధికారికి కట్టబెట్టాలి, వక్ఫ్‌కి సంబంధించిన ఆస్తులను పరిరక్షించేందుకు పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి'... ఈ మూడు సవరణలను ప్రతిపాదించింది టీడీపీనే. వైసీపీ హయాంలో ముస్లింలకు అన్ని స్థాయిల్లో ద్రోహం చేశారు' అని నసీర్ అహ్మద్ అన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న పవన్, పక్కన రాంప్రసాద్ రెడ్డి, నారాయణ, నాదెండ్ల తదితరులు

తిరుపతి- పళని మధ్య ఆర్టీసీ సర్వీసులు

» జెండా ఊపి ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి, పళని క్షేత్రాల మధ్య నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గురువారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డితో కలిసి బస్సు సర్వీసును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఇటీవల తాను పళని క్షేత్రాన్ని సందర్శించిన సమయంలో తిరుపతి వెళ్లాలంటే రెండు, మూడు బస్సులు మారాల్సి వస్తోందని అక్కడి భక్తులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో అరగంటలోనే అనుమతి ఇచ్చారని కొనియాడారు. ఈ సర్వీసు శుక్రవారం (ఏప్రిల్ 4) నుంచి తిరుపతిలో ప్రారంభమవుతుంది.

పీరయ్య మృతి పార్టీకి లోటు: కొల్లు, సవిత

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏమీ ఆశించకుండా నిరంతరం పార్టీ కోసమే పనిచేసిన పోతుగంటి పీరయ్య మరణం పార్టీకి తీరని లోటని మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అధ్యక్షతన పోతుగంటి పీరయ్య సంస్మరణ సభ గురువారం జరిగింది. 'టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ బిల్లులను వైసీపీ పెండింగ్‌లో పెట్టింది. ఆ సమయంలో వాటిని సాధించుకునేందుకు బీద రవిచంద్ర నాయకత్వంలో కడప నుంచి మంగళగిరికి వచ్చి పీరయ్య పనిచేసేవారు. పార్టీ కోసం ఆఖరి రోజు వరకూ పనిచేశారు' అని మంత్రులు పేర్కొన్నారు.

చోరీ జరిగింది అసెంబ్లీ ప్రాంగణం బయట: బీటీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం జరిగిన తన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎలాంటి చోరీ జరగలేదని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణం బయట తన గన్‌మ్యాన్ వద్ద చేతి ఖర్చులకు ఉంచుకున్న డబ్బులో కొంత చోరీ జరిగిందని పేర్కొన్నారు.

'బెల్టు'పై కఠిన చర్యలు: మంత్రి కొల్లు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆ శాఖపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'రాష్ట్రం నాటు సారా రహితం కావాలి. మే 1 నాటికి కృష్ణాను సారా రహితంగా ప్రకటిస్తాం. ఈనెల 10న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కొత్త మద్యం డిపోలు ప్రారంభిస్తున్నాం. త్వరలో టెక్కలి, గుడివాడలోనూ మద్యం డిపోలు ఏర్పాటు చేస్తాం. ఈనెల 9న తిరుపతిలో రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహిస్తాం' అని కొల్లు అన్నారు.

ఏపీలో ప్రకృతి సేద్యం భేష్: కేరళ మంత్రి

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రకృతి వ్యవసాయ విధానం బాగుందని కేరళ వ్యవసాయ మంత్రి పీ ప్రసాద్ కితాబిచ్చారు. గురువారం విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును ఆయన కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. 'ఏపీలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం పట్ల ఆకర్షితులమై కేరళలో 64 క్షేత్రాల్లో ఈ సాగును ప్రారంభిస్తున్నాం. వ్యవసాయ సుస్థిరత, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం మంచిది' అని ప్రసాద్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్య విధానంలో ప్రభుత్వ నిబద్ధతను రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ వివరించారు.

కోకో పంటకు అంతర్జాతీయ ధర చెల్లించాలి: అచ్చెన్న

కోకో పంట ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయి ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాపారులను కోరారు. రైతులు పండించిన కోకో ఉత్పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి. నాణ్యమైన పంటను అంతర్జాతీయ స్థాయి ధరలకు సమానంగా కొనాలి. సీజన్ కోకో బీన్స్‌ను అంతర్జాతీయ స్థాయి ధరకు 5-10% తక్కువ కాకుండా ధర చెల్లించాలి. ఆఫ్ సీజన్ కోకో బీన్స్‌కు ధర ఎంత ఇస్తారో సోమవారంలోగా వ్యాపారులు చెప్పాలి' అని ఆదేశించారు.

సబ్జీ కూలర్లకు సబ్సిడీ విడుదల

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతు బజార్లలో సబ్జీ కూలర్ల ఏర్పాటుకు 50% సబ్సిడీ సొమ్ము విడుదల చేయాలని ప్రభుత్వం ఉద్యాన శాఖను ఆదేశించింది. ప్రస్తుతం 74 కూలర్ల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ఎంఐడీహెచ్ పథకంలో రాయితీ కింద రూ.16.55 లక్షలు, రైతు బజార్ల నిధుల నుంచి రూ.16.55 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

తూర్పు నౌకాదళ కార్యాలయంలో అమెరికా బృందం

విశాఖపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తూర్పు తీరాన భారత నౌకాదళంతో కలిసి టైగర్ ట్రయంఫ్-2025 నిర్వహించడానికి వచ్చిన అమెరికా బృందం గురువారం తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఢిల్లీలోని అమెరికా ఎంబసీలో రక్షణ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న జోర్డాన్ కె ఆండ్రూస్ తదితరులు తూర్పు నౌకాదళం స్టాఫ్ ఆఫ్ చీఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనాను కలిశారు. రెండు దేశాల నేవీల పరస్పర సహకారంపై చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. అలాగే, ఫ్రెండ్లీ స్పోర్ట్స్‌లో భాగంగా ఇరుదేశాల నౌకాదళాల సిబ్బంది గురువారం వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న అమెరికా, భారత్ నౌకాదళాల సిబ్బంది

రామానాయుడు స్టూడియోలో

15.17 ఎకరాలు వెనక్కి..

ఆ భూములు దుర్వినియోగమైనట్టు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సురేశ్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూమిలో దుర్వినియోగమైనట్లు గుర్తించిన 15.17 ఎకరాలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వెంటనే నిర్వాహకులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని విశాఖ కలెక్టర్‌ను గురువారం ఆదేశించింది. విశాఖపట్నంలో సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలనే ఆలోచనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం 2003లో భీమిలి బీచ్‌రోడ్డులో మధురవాడ సర్వే నంబరు 336/పిలో 34.44 ఎకరాల భూమిని రామానాయుడు స్టూడియో కోసం సురేశ్ ప్రొడక్షన్స్‌కు ఎకరా రూ.5.2 లక్షలు చొప్పున కేటాయించింది. అందులో కొంత భూమిలో స్టూడియో నిర్మించారు. మిగిలిన భూమి ఖాళీగా ఉంచేశారు. స్టూడియో భూములను వెనక్కి తీసుకోకుండా ఉండేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో 'పెద్దలు' 15 ఎకరాలు డిమాండ్ చేశారు. భూ వినియోగ మార్పిడికి వీఎంఆర్‌డీఏకు దరఖాస్తు చేయించారు. స్టూడియో కోసం ఇచ్చిన భూముల్లో లేఅవుట్ వేస్తున్నామని, దానికి అనుమతులు ఇవ్వాలని జీవీఎంసీకి 2023లో సురేశ్ ప్రొడక్షన్స్‌తోనే దరఖాస్తు చేయించారు. అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రాకముందే కొండపై భూమిని లేఅవుట్‌గా మార్చేసి ప్లాట్లుగా విభజించేశారు.

సుప్రీంకోర్టుకు వెళ్లిన వెలగపూడి

స్టూడియో భూములను వైసీపీ పెద్దలు అడ్డగోలుగా కొట్టేస్తున్నారని గుర్తించిన జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ స్థానికంగా ఫిర్యాదు చేశారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే (టీడీపీ) వెలగపూడి రామకృష్ణబాబు ఇదే అంశంపై సుప్రీంకోర్టులో కేసు వేశారు. అది కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉందని, ఢిల్లీ స్థాయిలో అనుమతులు అవసరం కాగా, జిల్లా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి లేఅవుట్‌కు అనుమతులు ఇచ్చారని తెలియజేశారు. దీంతో ఆ భూమిలో లేఅవుట్ వేయకూడదని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. దీంతో వైసీపీ పెద్దలు ముందుకు వెళ్లలేకపోయారు. కూటమి ప్రభుత్వం రావడంతో విశాఖ తూర్పు ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచిన రామకృష్ణబాబు ఈ భూములు వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై కలెక్టర్‌ను ప్రభుత్వం నివేదిక కోరింది. నిబంధనలకు విరుద్ధంగా సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ 15.17 ఎకరాల్లో లేఅవుట్ వేసిన మాట నిజమేనని కలెక్టర్ నివేదించారు. దీంతో ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది.



రామానాయుడు స్టూడియో (ఫైల్)

ఆ భూములపై వ్యాపారవేత్త ఆదర్శం

» డీపట్టా భూముల్ని తెలిసో, తెలియకో కొనుగోలు

» స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించిన వైనం

అనకాపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ ప్రభుత్వ భూములు ఖాళీగా కనిపించినా కబ్జా చేస్తున్న రోజుల్లో, తాను తెలిసో, తెలియకో కొనుగోలు చేసిన డీపట్టా భూములను ఆయన స్వచ్ఛందంగా వదులుకున్నారు. ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించి, పదిమందికి ఆదర్శంగా నిలిచారు. ఆయనే విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలేనికి చెందిన వ్యాపారవేత్త కడియాల రాజేశ్వరరావు. రాజేశ్వరరావు 2022లో అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో సర్వే నంబర్లు 223/2, 224, 226/1, 227/1, 227/2, 128 పరిధిలోని 30.46 ఎకరాల డీపట్టా భూములను కొనుగోలు చేశారు. అయితే రాజేశ్వరరావు ఆ డీపట్టా భూములను ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించుకున్నారు. గురువారం చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజుతో కలిసి అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్టు అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కడియాల రాజేశ్వరరావు మాట్లాడుతూ, తాను అప్పగించిన భూములను ప్రభుత్వ అవసరాలకు, పేదల కోసం వినియోగించాలని కోరినట్టు తెలిపారు.

అసెంబ్లీ దేవాలయం... నేను పూజారిని

» ఎవరిపైనా వివక్ష లేదు.. అందరికీ అవకాశం కల్పిస్తా

» నిబంధనల ప్రకారమే ప్రతిపక్ష హోదా: స్పీకర్ అయ్యన్న



రామభద్రపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీ దేవాలయం లాంటిది. నేను పూజారిని మాత్రమే. నాకు ఏ సభ్యుడిపై వివక్ష లేదు. అన్ని పార్టీల సభ్యులకు అవకాశం కల్పిస్తా' అని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం బూసాయవలస గ్రామంలో తన చిన్ననాటి స్నేహితుడు గంటా తిరుపతిరావు కుమారుడు వివాహానికి ఆయన గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రతిఏటా అసెంబ్లీ సమావేశాలు 60 రోజులు నిర్వహించాలన్నదే నా ముఖ్య ఉద్దేశం. నేను స్పీకర్‌గా ఎన్నికైనప్పటి నుంచీ సభ్యులందరికీ అవకాశం కల్పిస్తున్నా. జీరో అవర్‌లో కొత్త సభ్యులను మాట్లాడడాన్ని ప్రోత్సహిస్తున్నా. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు ప్రజలు కుటుంబంతో కలిసి చూస్తున్నారు. గత వైసీపీ పాలనలో అయిదేళ్లలో 63 రోజులు మాత్రమే అసెంబ్లీ జరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ సభ్యులు దొంగచాటుగా వచ్చి రికార్డుల్లో సంతకాలు పెట్టి వెళ్లిపోవడం దురదృష్టకరం. ప్రతిపక్ష హోదా అనేది నిబంధనలకు అనుగుణంగా ఉంటుంది. దానికి ఎవరూ అతీతులు కాదు. పోలవరంతో ఉత్తరాంధ్రకు ఎంతో ఉపయోగం. అమరావతి రాజధాని పూర్తయితే రాష్ట్రానికి మంచి జరుగుతుంది. విశాఖను ఆర్థిక రాజధాని చేయడమే మా లక్ష్యం. సీఎం చంద్రబాబుతో చర్చించి విశాఖను మరింత అభివృద్ధి చేసేందుకు నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తా. కేంద్రం కూడా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఏపీ ప్రజల అదృష్టం' అని అయ్యన్న అన్నారు. సమావేశంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.



రూ.30 వేల కోట్ల మద్యం తాగారు

రోజుకు 83 కోట్ల విలువైన 78,676 కేసుల అమ్మకం

2024-25లో పెరిగిన విక్రయాల జోరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఒక్క ఏడాదిలో రూ.30వేల కోట్లకు పైగా విలువైన మద్యం తాగేశారు. సగటున రోజుకు రూ.83.38 కోట్ల విలువైన 78,676 కేసుల మందు అమ్ముడైంది.అయితే, ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించడంతో అమ్మకాలు పెరిగినా వాటి విలువ పరంగా ఆ స్థాయి పెంపు కనిపించడం లేదు. 2023-24తో పోలిస్తే 2024-25లో 9.1శాతం అమ్మకాలు పెరిగాయి. కానీ విలువ మాత్రం కేవలం 0.34శాతం మాత్రమే పెరిగింది. కొత్తగా క్వార్టర్ రూ.99 మద్యం బ్రాండ్లను ప్రభుత్వం ప్రవేశపెట్టడం, పలు బ్రాండ్ల ధరలు తగ్గించుకోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. 12 జిల్లాల్లో మద్యం అమ్మకాలు తగ్గినట్టు మద్యం తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో.. కడపలో 4.36 శాతం, విశాఖపట్నంలో 3.36శాతం, ప్రకాశంలో 2.68శాతం, నంద్యాలలో 2.66శాతం, విజయనగరంలో 2.45శాతం, పల్నాడులో 2.32శాతం, బాపట్లలో 2.27శాతం, కృష్ణాలో 1.83శాతం, అనకాపల్లిలో 1.77శాతం, శ్రీకాకుళంలో 1.39శాతం, పార్వతీపురం మన్యంలో 1.34శాతం, నెల్లూరులో 1.32శాతం మేర అమ్మకాలు తగ్గాయి. మిగిలిన 14 జిల్లాల్లో అమ్మకాలు పెరిగాయి. అత్యధికంగా కర్నూలులో 13.63శాతం, చిత్తూరులో 11.71శాతం, శ్రీసత్యసాయిలో 10.22శాతం మేర అమ్మకాలు పెరిగాయి. మొత్తంగా 2023-24లో 4.55కోట్ల కేసులు అమ్మగా, 2024-25లో 4.97కోట్ల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. లిక్కర్ 7.38శాతం, బీరు 14.13శాతం పెరిగింది. పరిమాణం పరంగా చూస్తే 2023-24తో పోలిస్తే 25.02లక్షల కేసుల లిక్కర్, 16.47లక్షల కేసుల బీరు అమ్మకాలు పెరిగాయి.

మద్యం ప్రియులకు ఉపశమనం..

వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా పెంచిన ధరలతో మద్యం వినియోగదారుల జేబుకు చిల్లు పడింది. ఒకేసారి ధరలు రెట్టింపు చేయడంతో పేదలు దోపిడీకి గురయ్యారు. ఆ తర్వాత ధరలు తగ్గించినా పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఎక్కువ ధరలే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వార్టర్ రూ.99 మద్యం అందుబాటులోకి వచ్చింది. అది కూడా జాతీయ స్థాయి బ్రాండ్లు క్వార్టర్ రూ.99 మద్యాన్ని తయారుచేస్తున్నాయి. దీంతో మొత్తం అమ్మకాల్లో రూ.99 బ్రాండ్ల వాటా 30శాతానికి చేరింది. మరోవైపు గత ప్రభుత్వంలో అధిక ధరలకు మద్యం అమ్మిన పలు బ్రాండ్లు ధరలు తగ్గించుకున్నాయి. దీంతో అమ్మకాల్లో పరిమాణం పెరిగినా, విలువలో ఆ స్థాయి పెంపు కనిపించలేదు. మొత్తంగా మద్యం ప్రియులకు ఉపశమనం కలిగింది. కాగా, అమ్మకాలు పెరిగినా, విలువ పెరగకపోవడంతో ఆదాయంపైనా ప్రతికూలత కనిపిస్తోంది. 2023-24లో రూ.30వేల కోట్ల అమ్మకాలు నమోదైనప్పుడు రూ.25,082 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది స్వల్పంగా విలువ పెరిగి రూ.30,183 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. దీంతో అంతకుముందు ఏడాది స్థాయిలోనే ఆదాయం వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. గతేడాది కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చినప్పుడు దరఖాస్తు రుసుముల రూపంలో రూ.1,800 కోట్లు వచ్చాయి.

మళ్లీ పాపులర్ బ్రాండ్లు

జగన్ ప్రభుత్వంలో జే బ్రాండ్లు పేరుతో సొంత బ్రాండ్లను షాపుల్లో విక్రయించారు. ఇది మద్యం తాగేవారి ఆరోగ్యంపై ప్రభావం చూపింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చినా గత ప్రభుత్వం జే బ్రాండ్ల విషయంలో వెనక్కి తగ్గలేదు. నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడంతో తాగేవారిలో కొందరు నాటుసారా, ఎన్‌డీపీఎల్ వైపు మళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ అన్ని పాపులర్ బ్రాండ్లూ రావడంతో చాలావరకు ఎన్‌డీపీఎల్ ఆగిపోయింది. మరోవైపు నాటుసారా వినియోగం కూడా తగ్గుతోంది. ఈ పరిణామాలతో షాపుల్లో మద్యం వినియోగం పెరుగుతోంది.

తిరిగి రైల్వే శాఖకు వాసుదేవరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 3: మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డిని రాష్ట్రప్రభుత్వం తన మాతృశాఖయిన రైల్వే శాఖకు తిప్పిపంపింది. ఆయన్ను తక్షణమే రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జగన్ సీఎంగా గద్దెనెక్కాక 2019లో ఆగస్టులో వాసుదేవరెడ్డి రైల్వే శాఖ నుంచి రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. గత ఏడాది ఆగస్టులో ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి ముగిసింది. కానీ ఆయనపై మద్యం అక్రమాల ఆరోపణలు రావడంతో రాష్ట్రప్రభుత్వం రిలీవ్ చేయలేదు. దాని విజ్ఞప్తి మేరకు రైల్వే శాఖ ఆయన డిప్యుటేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 25 వరకు పొడిగించింది. ఆ గడువు కూడా ముగియడంతో రాష్ట్రప్రభుత్వం ఆయన్ను తిరిగి మాతృశాఖకు పంపింది.

కళాశాల భవనంపై నుంచి దూకి

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

» యాజమాన్యంతో తండ్రి మాట్లాడుతుండగానే ఘటన



జశ్వంత్‌సాయి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జశ్వంత్‌సాయి(24) గురువారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గూడూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన జశ్వంత్‌సాయి రెండు రోజులుగా దిగాలుగా ఉండటాన్ని కళాశాల సిబ్బంది గమనించారు. అతడి తండ్రి సుధాకర్‌రావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన గురువారం కళాశాలకు వచ్చారు. కొడుకును వెంటపెట్టుకుని కళాశాల రెండో అంతస్తుకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడుతున్నారు. ఇంతలో జశ్వంత్ ఒక్కసారిగా పరుగున వెళ్లి కిటికీలో నుంచి కిందికి దూకేశారు. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా జశ్వంత్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తమ బిడ్డను కోల్పోయామని కుటుంబ సభ్యులు పోలీసుల ఎదుట చెబుతూ దర్యాప్తునకు డిమాండ్ చేశారు.

ఉన్మాదికి 14 రోజుల రిమాండ్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఓ యువతి తల్లిని హత్య చేసి, యువతిని తీవ్రంగా గాయపరిచిన ఉన్మాది దమరసింగి నవీన్‌కు భీమిలి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. విశాఖలోని కొమ్మాది స్వయంకృషి నగర్‌కు చెందిన నక్కా దీపిక అనే యువతిపై దాడి అనంతరం బైక్‌పై పరారవుతున్న నవీన్‌ను పట్టుకున్న పోలీసులు గురువారం భీమిలి కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

ఎంవీవీ కార్యాలయాల్లో మళ్లీ ఈడీ సోదాలు!

విశాఖపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మళ్లీ సోదాలు నిర్వహించింది. సిరిపురం జంక్షన్‌లోని సీబీసీఎన్‌సీ స్థలంలో ఎంవీవీ పీక్స్ పేరుతో ఆయన భారీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఆ భూమిపై వివాదాలున్నాయి. బాధితుల్లో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టాప్ వర్క్ ఆర్డర్ తీసుకువచ్చారని గురువారం కొన్ని పత్రికల్లో వారి తరఫు న్యాయవాది ప్రకటనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టు ప్రాంగణంలోకి అధికారుల వాహనాలు వెళ్లి వచ్చాయి. అవి ఈడీకి సంబంధించినవేనని పలువురు అంటున్నారు. కాగా, ఆ వాహనాలు జీవీఎంసీ అధికారులవి కావచ్చునని కొందరు అంటున్నారు. గతంలోనే హయగ్రీవ జగదీశ్వరుడు ఫిర్యాదుపై ఎంవీవీ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. ఎంవీవీ ప్రాజెక్టుల్లో అధికారులు తరచూ తనిఖీలు చేస్తూనే ఉన్నారు.

ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయి

» చెందుర్తి, పిఠాపురం ఫారాల్లోని కోళ్లకు వైరస్ నిర్ధారణ

» నేడు నరసరావుపేటకు ఐసీఎంఆర్ బృందం

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, అమరావతి, మంగళగిరి, గుంటూరు మెడికల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా చెందుర్తి, పిఠాపురం ఫారాల్లోని కోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్ వల్లే చనిపోయినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అధికారిక సమాచారం వచ్చింది. ఇదే విషయాన్ని గెజిట్‌లో ప్రచురించిన ప్రభుత్వం సదరు కోళ్లు చనిపోయిన ఫారాల నుంచి కి.మీ. వరకు ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, 10కి.మీ. పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించింది. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ శివార్లలో పుష్కర కాలువ గట్టుపై ఉన్న బోనబోయిన కృష్ణకు చెందిన ఫారంలో ఫిబ్రవరి 15 నుంచి మూడు రోజుల వ్యవధిలో 15 వేలకు పైగా కోళ్లు చనిపోయాయి. పిఠాపురంలోని కోళ్లఫారంలోనూ వేలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇవన్నీ బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయని భావించినప్పటికీ అధికారులు అధికారికంగా నిర్ధారించలేదు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆ శాంపిల్స్‌ను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంప గా రెండు కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో చెందుర్తి, పిఠాపురం ప్రాంతాల నుంచి కోళ్లను ఇతర ప్రాంతాలకు రవాణా చేయడంపై ఆంక్షలు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కాగా, ఇటీవల బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిన ఆరు జిల్లాల్లోని వ్యాధి నిర్ధారిత ప్రాంతాలను అంటువ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. బర్డ్ ఫ్లూ సంభవించిన ప్రదేశాలకు 1-10 కి.మీ. వరకు నిఘా మండలాలుగా ప్రకటించింది. ఉభయ గోదావరి, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, కర్నూలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ గుర్తించిన గ్రామాల వివరాలతో ఈ గెజిట్ విడుదల చేసింది.

బర్డ్‌ఫ్లూపై సీఎం సమీక్ష

నరసరావుపేటలో బర్డ్ ఫ్లూతో రెండేళ్ల బాలిక మృతి చెందడం, అనంతర పరిణామాలపై సీఎం చంద్రబాబు అధికారులతో గురువారం సమీక్ష జరిపారు. బాలిక కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగు వారి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు సీఎంకు చెప్పారు. ఆ ప్రాంతంలో కొత్తగా పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. విశాఖపట్నం, విజయవాడ, కర్నూలులో ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేసినట్లు తెలిపారు. కాగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) బృందం గురువారం మంగళగిరి ఎయిమ్స్‌లో పర్యటించి బాలిక మృతి పై వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ బృందం శుక్రవారం నరసరావుపేటలో పర్యటించనుంది.

రాష్ట్రంలో లారస్ ల్యాబ్స్
5 వేల కోట్ల పెట్టుబడులు

» అనకాపల్లి వద్ద బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు

» ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సంస్థ ప్రతినిధులు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు లారస్ ల్యాబ్స్ సంస్థ ముందుకు వచ్చింది. అనకాపల్లి జిల్లా గోరపూడి గ్రామంలోని ఏపీ రాంబిల్లి ఫేజ్-2లో దాదాపు రూ.5వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పనుంది. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7,500 మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. లారస్ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్న కొత్త పరిశ్రమలకు భూములు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత తెలిపింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చర్చలు జరిపారు. తమ పరిశ్రమలకు భూకేటాయింపులు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐ ఆధారిత పురోగతికి ఏపీ కేంద్రం

» ఓపెన్ ఏఐ సీఈవో ట్వీట్‌పై సీఎం చంద్రబాబు స్పందన

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగంలో భారతదేశం తన ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించిందని, ఏఐ ఆధారిత పురోగతికి కేంద్రంగా మారడానికి ఏపీ సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్ చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించారు. భారత్ పర్యటనకు వస్తే తప్పకుండా ఏపీకి రావాలని ఆల్ట్‌మాన్‌కు ఆహ్వానం పలికారు. ఏఐ విషయంలో ఏపీ విజన్‌ను ఆల్ట్‌మాన్‌తో పంచుకునేందుకు వేచి చూస్తున్నామన్నారు.

14న రాష్ట్రానికి 16వ ఆర్థిక సంఘం

సిఫారసుల తయారీలో భాగంగా పదహారో ఆర్థిక సంఘం ఈనెల 14 నుంచి 16 వరకు రాష్ట్రంలో పర్యటించనుంది. ఆంధ్రప్రదేశ్ డిమాండ్లు, సూచనలు తెలుసుకోనుంది. 16వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమవుతుంది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం ముందుపెట్టే డిమాండ్లు, ఇవ్వాల్సిన సూచనలపై సన్నాహకంగా ఆర్థిక శాఖ మంత్రి, అధికారులతో సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సాధారణంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఏం ఇవ్వాలి?. విపత్తుల నిర్వహణకు సాయం, స్థానిక సంస్థలకు ఎన్ని గ్రాంట్లు ఇవ్వాలి? అనే అంశాలపై ఆర్థిక సంఘం కేంద్రానికి సిఫారసులు చేస్తుంది. కేంద్రం వాటిని యథాతథంగా లేదా కొన్ని మార్పుచేర్పులతో అమలు చేస్తుంది. 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 16వ ఆర్థిక సంఘం సిఫారసులు అమల్లోకి వస్తాయి. రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం నుంచి బయటపడేందుకు, రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు అవసరమయ్యే గ్రాంట్లను రాష్ట్ర ప్రభుత్వం అడిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటా ఇస్తున్నారు. దీన్ని మరో 10 శాతం పెంచాలని తెలంగాణ సహా పలు రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా తన అభిప్రాయం వెల్లడించలేదు.

గనుల బ్లాకుల వేలంపై తీసుకున్న చర్యలేంటి?

» 10 రాష్ట్రాల సీఎస్‌లతో పీఎం ముఖ్య కార్యదర్శి సమీక్ష

దేశంలో గనుల బ్లాకుల వేలం, ఆపరేషనలైజేషన్ అంశాలపై కేటగిరి-ఏలోని 10 రాష్ట్రాల ప్రభుత్వ సీఎస్‌లతో ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి ప్రమోద్ కుమార్ మిశ్రా గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మినరల్ బ్లాకుల వేలం, కార్యాచరణకు సంబంధించి తీసుకున్న చర్యలు, పర్యావరణ సంబంధిత అంశాలు, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు సీఎస్‌లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'అలిపిరి' నిఘాపై ఫోకస్

» టోల్‌గేట్ వద్ద ఎస్పీ తనిఖీలు.. కొందరు సిబ్బంది తీరుపై ఆగ్రహం



లగేజీ స్కానర్ నుంచి నిఘా పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి టోల్‌గేట్ వద్ద నిఘాపై టీటీడీ, పోలీసులు దృష్టి పెట్టారు. ఇక్కడ సిబ్బంది పనితీరుపై టీటీడీ సీవీఎస్వో(ఎఫ్ఏసీ) గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అలిపిరిలో నిఘా వైఫల్యాలను ప్రస్తావిస్తూ 'తిరుమల ఎంత భద్రం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బందితో కలసి దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు. లగేజీ స్కానర్ వద్ద సిబ్బందికి కనిపించకుండా నిలబడి వాహనాలు, సామగ్రిని ఎలా తనిఖీ చేస్తున్నారో గమనించారు. తనిఖీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుమలలో నూతన గ్యాస్ ప్లాంట్

తిరుమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతన గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి టీటీడీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) మధ్య ఒప్పందం కుదిరింది. గోగర్భం డ్యాంకు సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డులో 45 టన్నుల సామర్థ్యంతో నూతన గ్యాస్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వచ్చే 6నెలల్లో విరాళం ప్రాదిపదికన రూ.8కోట్లతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఐవోసీఎల్ ప్రణాళికలు రూపొందించుకుంది.

నేడు అనంత కోర్టుకు బోరుగడ్డ అనిల్

అనంతపురం క్రైం/రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నాన్ బెయిలబుల్ కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు శుక్రవారం అనంతపురం కోర్టులో హాజరుపరచనున్నారు. దీనికోసం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్‌ను పీటీ వారెంట్‌పై అనంతపురానికి తీసుకువస్తున్నారు. 2018లో త్రీటౌన్ సీఐగా పనిచేసిన మురళీకృష్ణకు బోరుగడ్డ అనిల్ ఫోన్ చేసి, తాను ఐపీఎస్ ఆఫీసర్‌నంటూ బెదిరించాడు. ఈ వ్యవహారంపై పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చాక అనిల్ వాయిదాలకు గైర్హాజరయ్యాడు. దీంతో అనంతపురం ఎఫ్‌జేసీఎం కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. కాగా, కోర్టు ఆదేశాలతో గురువారం ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా పోలీసులకు అనిల్‌ను అప్పగించామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు.

గుంటూరు సీఐడీ కార్యాలయానికి పోసాని

గుంటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణ మురళి గురువారం గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి వచ్చారు. బెయిల్ మంజూరు చేసే సమయంలో కోర్టు షరతుల మేరకు వారానికి రెండు దఫాలు నెల రోజులపాటు సీఐడీ కార్యాలయానికి వెళ్లి సంతకాలు చేయాలి. అంతేకాకుండా కేసు విచారణలో భాగంగా సీఐడీ అధికారులు ఎప్పుడు కోరితే అప్పుడు వారి ఎదుట హాజరై విచారణకు సహకరించాలి. ఆ మేరకు గడిచిన రెండు వారాలుగా సోమ, గురువారాలలో ఆయన సీఐడీ కార్యాలయానికి వచ్చి రిజిస్టర్లో సంతకం చేసి వెళ్తున్నారు. తాజాగా గురువారం కూడా సీఐడీ కార్యాలయానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లారు.



ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవం సంరంభం మొదలైంది. గురువారం హరిద్రా ఘటనం (పసుపు దంచే కార్యక్రమం) ఉత్సాహపూరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.





శ్రీరామనవమి సందర్భంగా విక్రయానికి సిద్ధం చేస్తున్న సీతారామాంజనేయుల బొమ్మలివి. విజయవాడలోని బందర్ రోడ్డులో ఈ బొమ్మలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

అనకాపల్లి జిల్లాలో క్యాప్టివ్ పోర్టు

» బనకచర్ల కోసం 'జల హారతి' కార్పొరేషన్

» మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో క్యాప్టివ్ పోర్టు నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ (ఏఎం/ఎన్ఎస్ఎల్) అభ్యర్థన మేరకు డీఎల్ పురం వద్ద 2.9 కిలోమీటర్ల వాటర్ ఫ్రంట్‌తో క్యాప్టివ్ పోర్టు నిర్మించేందుకు అనుమతి కోసం కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్‌తో ఒప్పందాన్ని సవరించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల స్టీల్ ప్లాంటు తొలి దశకు మార్గం సుగమమైంది. ఈ దశలో రూ.55,964 కోట్ల పెట్టుబడితో ఏటా 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 2029నాటికి ప్లాంటు ఏర్పాటు చేస్తారు. దీనికి అనుసంధానంగా రూ.5,816 కోట్ల వ్యయంతో 20.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పై క్యాప్టివ్ పోర్టును 2029 జనవరికల్లా నిర్మిస్తారు. రెండో దశ ప్లాంటును రూ.80 వేల కోట్ల వ్యయంతో ఏటా 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 2033కి నెలకొల్పుతారు. దీనికోసం రెండో దశ క్యాప్టివ్ పోర్టును 5,380 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేస్తారు. కేబినెట్ నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారు.

మంత్రివర్గ నిర్ణయాలివీ..

- పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కోసం జల హారతి కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం.
- ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌తో అనుబంధంగా ఉన్న డ్రోన్ కార్పొరేషన్‌ను విడదీసి ప్రత్యేకంగా డ్రోన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు.
- త్రీస్టార్, ఆపైబడి గుర్తింపు కలిగిన హోటళ్లకు బార్ లైసెన్సు ఫీజు రూ.25 లక్షలకు కుదింపు.
- పర్యాటకాభివృద్ధి కోసం యువజన, పర్యాటక శాఖ జారీ చేసిన ఉత్తర్వులకు ఆమోదం.
- రాష్ట్ర విద్యుత్ సమన్వయ కమిటీ (ఏపీపీసీసీ) తీసుకునే రూ.710 కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చేందుకు అంగీకారం.

బనకచర్లకు ఆర్థిక ఇబ్బందుల్లేకుండా..

పోలవరం-బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ అనుసంధాన పథకానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేకంగా 'జలహారతి కార్పొరేషన్' ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకానికి జూన్ 1న టెండర్లు పిలవాలని సీఎం జల వనరుల శాఖను ఇప్పటికే ఆదేశించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కాలువలు, నల్లమల సాగర్ మీదుగా టన్నెళ్లు తవ్వేందుకు, ఎత్తిపోతల పథకాలు నిర్మించేందుకు భారీగా నిధులు సమీకరించాల్సి ఉంది. స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ) తరహాలో రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో 'జలహారతి కార్పొరేషన్' ఏర్పాటు చేస్తే ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు వీలుంటుందని జల వనరుల శాఖ భావిస్తోంది. అలాగే ఈ ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి పథకం పొడవునా నిర్దిష్ట ప్రాంతాల్లో 4,400 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుత్కేంద్రాలు.. పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, సోలార్ పవర్ ప్రాజెక్టులు స్థాపించనుంది. వీటికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ) వంటి కేంద్ర ఆర్థిక సంస్థల నుంచి రుణాల సమీకరణకు ఈ కార్పొరేషన్ సహాయపడుతుంది.

రిటైనింగ్ వాల్‌కు అదనపు సాయం

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగార్జున సాగర్ ఎడమ కాలువను ఆనుకుని వేంపాడు మేజర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.44.60 కోట్ల అదనపు ఆర్థిక సాయం అందించాలని కేబినెట్ నిర్ణయించింది. వాస్తవానికి 2019లోనే చంద్రబాబు ప్రభుత్వం దీని నిర్మాణం తలపెట్టింది. అయితే తర్వాత వచ్చిన వైసీపీ సర్కారు మిగతా పనులు చేయకపోవడం.. నిర్వహణ లోపం కారణంగా వాల్ బాగా దెబ్బతింది. పైగా కట్టిన కాంట్రాక్టరుకు కూడా డబ్బులివ్వలేదు. ఈ నేపథ్యంలో అదనంగా 44.60 కోట్లు ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ వ్యవహారంలో బాధ్యులెవరో విచారణ జరపాలని సీఎం ఆదేశించారు.

నిందలు వేసి.. కుట్రలు!

» పాస్టర్ ప్రవీణ్ మృతి నుంచి లబ్ధి కోసం వైసీపీ ప్రయత్నం

» సమర్థంగా తిప్పికొట్టాలి: సీఎం

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతి వ్యవహారంలో ప్రభుత్వాన్ని దోషిగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేబినెట్ సమావేశంలో పలువురు మంత్రులు అన్నారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. ప్రభుత్వంపై నిందలు వేసి.. అప్రతిష్ఠ పాల్జేసే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'గతంలో బాబాయ్ గొడ్డలి పోటు, కోడికత్తి డ్రామాల విషయంలో మనపై వైసీపీ పూర్తి అవాస్తవాలతో తప్పుడు ఆరోపణలు చేసింది. మనం ఎలాంటి తప్పూ చేయకున్నా వాటిని సమర్థంగా ఎదుర్కోవడంలో విఫలమయ్యాం. పాస్టర్ ప్రవీణ్ ఉదంతంతో లబ్ధి పొందేందుకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. దీనిని సమర్థంగా తిప్పికొట్టాలి' అని ఆదేశించారు. ప్రవీణ్ మృతి కేసును సాంకేతిక ఆధారాలతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, సీసీ ఫుటేజీలు కీలకంగా మారాయని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా సమర్థ వినియోగంలో కూడా చాలా వెనుకబడి ఉన్నామని చెప్పారు. 'మనం మంచి ఉద్దేశంతో పెట్టే పోస్టులనూ వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారు. ఇలాంటి అంశాలపై వెంటనే స్పందించకుంటే.. వక్రీకరించిన వాటినే ప్రజలు నిజమని నమ్ముతారు. మంత్రులందరూ అప్రమత్తంగా ఉండి మరింత సమర్థంగా సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి' అని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంతో పోల్చిచూసినా నాలుగు రెట్లు ఎక్కువ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని, కానీ ఆ స్థాయిలో ప్రచారం చేసుకోలేకపోతున్నామని పెదవివిరిచారు. చేస్తున్న మంచిని జనంలోకి తీసుకెళ్లడంలో వెనుకబడుతున్నామన్నారు. మన పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని.. దీనికి సామాజిక మాధ్యమాలనూ వాడుకోవాలని సూచించారు.

ఔట్.. సోర్సింగ్!

(మొదటి పేజీ తరువాయి)

అన్న అంశంపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. టీటీడీకి ఆదాయం ఉంది కాబట్టి అంతమంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించగలుగుతోందని.. కానీ ప్రభుత్వ శాఖల్లో అలాంటి పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. దీంతో ఆప్కాస్‌ను కొనసాగించాలా.. ప్రక్షాళన చేయాలా.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమర్థ వినియోగంపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. రుషికొండ భవనాలపైనా చర్చ జరిగింది. వాటిని ఏం చేద్దామని మంత్రులను సీఎం ప్రశ్నించారు. వీలైతే ఒకసారి సందర్శించాలని, ప్రత్యక్షంగా చూస్తే వాటినెలా ఉపయోగించుకోవాలో అవగాహన వస్తుందని, ఆ మేరకు సూచనలు తెలియజేయాలని కోరారు. ప్రజాభిప్రాయం తెలుసుకోవాలంటే ప్రజాప్రతినిధులతోపాటు ఐఏఎస్ అధికారులూ క్షేత్ర స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులు సుమారు 2 వేల మంది ఉంటారని, వీరు క్షేత్రస్థాయిలో తిరిగితే ప్రభుత్వ పనితీరుపై మరింత మెరుగైన సమాచారం తెలుసుకోవచ్చని, గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి ఓ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి అధికారీ ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని అక్కడ మూడు పగళ్లు.. రెండు రాత్రిళ్లు గ్రామస్థులతో గడపాలన్నారు. ఈ కార్యక్రమానికి స్వర్ణ గ్రామం, పల్లె నిద్ర, పల్లె వెలుగు తరహాలో మంచి పేరు నిర్ణయించాలని సూచించారు.

విశాఖ ఉక్కుకు పూర్తి సహకారం..


విశాఖ ఉక్కు కర్మాగారంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. దానిని నిలబెట్టేందుకు అన్ని మార్గాల్లో సాయం అందించాలని, అందులో భాగంగా రూ.2,400 కోట్ల విద్యుత్ రాయితీ అందించాలని నిర్ణయించారు. తద్వారా రెండేళ్లు దానికి విద్యుత్ చార్జీల భారం నుంచి ఉపశమనం లభిస్తుందని కేబినెట్ అభిప్రాయపడింది. ప్రస్తుతం నెలకు రూ.100 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల భారాన్ని ప్లాంటు భరిస్తోంది. రాష్ట్రంలో మరిన్ని పోర్టుల ఏర్పాటుకు అవకాశం ఉందని సీఎం అన్నారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రం కూడా పోర్టుల కోసం మనపైనే ఆధారపడుతోందని చెప్పారు. ఇదే సమయంలో జలరవాణాపై మరింత దృష్టి పెట్టాలని, తద్వారా రవాణా ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు.

ఎస్‌బీఐని కాదని ప్రైవేటుకు

(మొదటి పేజీ తరువాయి)

10 రోజుల్లో రైతులకు చెల్లించాల్సిన సొమ్మును వారికి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై ఆరోపణలు వస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ)కు భూములు ఇచ్చిన కొందరు రైతులకు జనవరిలోనే ప్రభుత్వం రూ.63,14,41,018 విడుదల చేసింది. రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట ఎస్‌బీఐ బ్రాంచ్‌కు పంపింది. పది రోజుల్లో సంబంధిత రైతులకు చెల్లించాలని అధికారులను ఆదేశించింది. ఈ లెక్కన ఫిబ్రవరిలోనే రైతులకు పరిహారం అందాలి. అయితే అధికారుల నిర్వాకంతో ఇప్పటికీ రైతులకు సొమ్ము అందలేదు. రైతులకు ఇవ్వాల్సిన ఈ సొమ్మును పోలవరం ఎడమ ప్రధాన కాలువకు ఏమాత్రం సంబంధంలేని తణుకులోని ప్రైవేట్ బ్యాంక్‌కు బదిలీ చేశారు. ఇటు రైతులకు సొమ్ము అందించకుండా, అటు ప్రభుత్వ రంగ బ్యాంకులోనూ ఉంచకుండా ప్రైవేట్ బ్యాంకులో జమ చేశారు. దీనిపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ నేపథ్యం...: రాజమహేంద్రవరం పరిధిలోని ధవళేశ్వరంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఉంది. ప్రాజెక్టుకు భూసేకరణ, భూమిని త్యాగం చేసిన వారికి పునరావాసం, ఉపాధి కల్పన వంటి ఆర్అండ్ఆర్ ప్యాకేజీలను ఈ కార్యాలయం అమలు చేస్తుంది. ప్రాజెక్టు భూసేకరణకు ఇంతవరకూ యూనిట్-1, 2 అనే విభజనతో ఉండేవి. వాటికి అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) ఉండేవారు. ఇటీవల భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు బాధ్యతలను ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌కు అప్పగించారు. ఎల్ఎంసీ ప్రాజెక్టు భూసేకరణ యూనిట్-1 పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం మండలంతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం మండలం, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని కొన్నిమండలాలు ఉన్నాయి. ఈ మండలాల మీదుగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ విశాఖ వరకూ వెళుతుంది. ఈ కాలువ నిర్మాణానికి రైతులనుంచి 2016-2018మధ్య సేకరించిన భూమి విషయంలో అధికారులు కొన్ని తప్పిదాలు చేశారు. వాటికి సంబంధించి రైతులు సుమారు 42 కేసులు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రైతులను గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం వీరికి చట్టప్రకారం అందాల్సినవన్నీ అమలు చేస్తుంది. అందులో భాగంగా రూ.63,14,41,018లను జనవరిలో విడుదల చేసింది. రాజమహేంద్రవరంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ-ఎల్ఏ), ఎల్ఎంసీ యూనిట్-1కు చెందిన ఇన్నీసుపేటలోని ఎస్‌బీఐ కరెంట్ ఖాతా నంబర్ 11105208896లో జమ అయింది. ఇది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో ఉంది. ఈ సొమ్మును పదిరోజుల్లో రైతులకు అందజేయాలని ప్రభుత్వం అప్పట్లోనే ఆదేశించింది. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో ఒక రైతుకు రూ.2 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. వివిధ కారణాలతో ఇతర రైతులకు పెండింగ్‌లో ఉంది. అధికారులు ఈ సొమ్మును రైతుల పేరిట చెక్ రాసి, విశాఖలోని ఆర్అండ్ఆర్ అథార్టీకి(కోర్టు)అందించాలి. అథార్టీ నేరుగా రైతులకు అందజేస్తుంది. కానీ పోలవరం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం వెంటనే ఈ పని చేయలేదు. అధికారులు ఎస్‌బీఐ ఖాతాలోని ఈ సొమ్మును తణుకులోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లోని పోలవరం ప్రాజెక్టు రాజమహేంద్రవరం ఎస్‌డీసీ (ఎల్ఏ), ఎల్ఎంసీ యూనిట్-1 అకౌంట్ నంబర్ 11222444614కు బదిలీచేశారు. గత నెల 26న ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఆదేశాల మేరకు ఈ సొమ్మును బదిలీ చేయాల్సిందిగా కోరుతూ ఇన్నీసుపేట ఎస్‌బీఐ మేనేజర్‌కు ఎల్ఎంసీ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)కె.సతీశ్ లేఖ రాశారు. మూడు రోజుల కిందట ఈ సొమ్మును అధికారులు తణుకులోని ప్రైవేట్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఖాతాదారు వినతిమేరకు ఇలా చేసినట్టు ఎస్‌బీఐ చీఫ్‌మేనేజర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



ఐఏఎస్ ఆదేశం.. ఎస్‌డీసీ లేఖ!: ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును ప్రభుత్వ రంగ బ్యాంకు ఖాతాలో ఎందుకు ఉంచలేదు? ప్రైవేటు బ్యాంక్ ఖాతాకు ఎందుకు బదిలీ చేశారు? ఈ ప్రశ్నలకు జవాబు లేదు. సొమ్మును ప్రైవేట్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీశ్ రాసిన లేఖ 'ఆంధ్రజ్యోతి' చేతికి అందింది. ఆయన్ను వివరణ కోరగా.. తానసలు లేఖ రాయలేదని, తణుకులో ఖాతానే లేదని, కేవలం ఇన్నీసుపేటలోని ఎస్‌బీఐలోనే ఖాతా ఉందని చెప్పారు. ఎంత సొమ్ము ఉందని అడగగా... అది చెప్పకూడదని సమాధానమిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా కొద్ది నెలల క్రితమే తమిళనాడు కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అభిషేక్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ఆదేశంతోనే సొమ్ము బదిలీ చేయాల్సిందిగా ఎస్‌డీసీ లేఖ రాసినట్టు తెలుస్తోంది.

జగన్ 'రివర్స్' దెబ్బ!

» పోలవరంలో డబ్బు ఆదా చేశానంటూ నాడు ఆర్భాటం

» అర్ధాంతరంగా కాంట్రాక్టు సంస్థ తొలగింపు

» తాజాగా నవయుగకు ఆర్బిట్రేషన్ కింద 1,735 కోట్ల పరిహారం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టుకు, రాష్ట్రానికి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. ఆ ఐదేళ్లలో చేసిన నిర్వాకాలు ఖజానాకు భారంగా మారాయి. శరవేగంగా పనులు చేస్తున్న నవయుగ ఇంజనీరింగ్ కాంట్రాక్టు సంస్థను.. కేంద్రం మొత్తుకున్నా అర్ధాంతరంగా తీసివేశారు. వెంటనే రివర్స్ టెండర్‌కు వెళ్లారు. హెడ్‌వర్క్స్‌లో మిగిలిన రూ.1,771 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచారు. రివర్స్ టెండర్‌లో కనీసం రెండు కంటే ఎక్కువ నిర్మాణ సంస్థలు బిడ్లు వేయాలి. కానీ మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే బిడ్ దాఖలుచేసింది. టెండరును 12% తక్కువకు రూ.1,548.12 కోట్లకు అప్పగించారు. పనులను 2020 నవంబరు నాటికి పూర్తి చేయాలని టెండరు డాక్యుమెంటులో కోరారు. కానీ అప్పటికి పనులే చేపట్టలేదు. నిర్మాణం మొదలు పెట్టకుండానే అదనపు పనుల పేరిట రూ.2,077.78 కోట్లకు అంచనాలు పెంచేశారు. అదికాకుండా కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సిఫారసుల పేరిట రూ.669 కోట్లు, రూ.1,615.75 కోట్లతో టెండర్లు పిలిచారు. 2 శాతం ప్లస్‌తో టెండర్లను మేఘా దక్కించుకుంది. అంటే రూ.1,548.12 కోట్ల అంచనాలను 4,362 కోట్లకు పెంచారన్న మాట. వాస్తవానికి 2019లో జగన్ అధికారంలోకి వచ్చేనాటికి హెడ్‌వర్క్స్ 72 శాతం పూర్తయ్యాయి. ఆయన వచ్చాక రెండేళ్లు గడిచినా పనులు పూర్తిచేయకపోవడం.. వరదలకు డయాఫ్రం వాల్ తీవ్రంగా దెబ్బతింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల్లో సీపేజీ వచ్చింది. గైడ్‌బండ్ కుంగిపోయింది. నిర్మాణ వ్యయం నాలుగింతలు పెరిగింది. గతంలో రూ.465 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా రూ.980 కోట్లతో కొత్తది నిర్మించాల్సి వస్తోంది. ఇది అదనపు వ్యయం. ఇక సిమెంట్ కాంక్రీట్ పనుల కోసం రూ.400 కోట్లను అదనంగా ఖర్చుచేశారు. అప్పటిదాకా ఇసుకను ఉచితంగా వాడేవారు. కానీ జగన్ సర్కారు రూ.600 కోట్లు లెక్కవేసి తెలంగాణకు చెందిన అస్మదీయ కాంట్రాక్టు సంస్థకు చెల్లించింది. ఇంకోవైపు.. తనను అర్ధాంతరంగా తొలగించడంతో నవయుగ ఆర్బిట్రేషన్‌కు వెళ్లింది. ఆ సంస్థకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ సంస్థకు రూ.1,735 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర కేబినెట్ గురువారం ఆమోద ముద్ర వేసింది. ఇందులో ఏపీ జెన్కో రూ.986.17 కోట్లు, జల వనరుల శాఖ 742 కోట్లు చెల్లించనున్నాయి. నిర్మాణ సంస్థను మార్చకుండా 2020లోనే పనులు పూర్తి చేసి ఉంటే.. ఏటా రూ.26,000 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు రైతుల చేతికి అందేవి. మొత్తంగా జగన్ నిర్వాకంతో రాష్ట్రానికి తీవ్ర ఆర్థిక నష్టం జరిగింది. ఈ విధ్వంసానికి ఎవరు బాధ్యత వహిస్తారు? చంద్రబాబుపై కోపంతో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లిన జగన్ జవాబుదారీయా.. ఆయన చెప్పిందే తడవుగా.. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లిన నాటి జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ బాధ్యత తీసుకుంటారా అని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు.



హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో దాదాపు గంటన్నర పాటు వాన దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి జనం అవస్థలు పడ్డారు. సరూర్‌నగర్, హిమాయత్‌నగర్, డబీర్‌పురాలో 8.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మలక్‌పేట రైల్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద భారీగా వరద నీరు నిలిచింది. బౌద్ధనగర్, హబ్సీగూడ, ఖైరతాబాద్‌ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. వర్షం ధాటికి చారిత్రక చార్మినార్ కట్టడంలో భాగ్యలక్ష్మి ఆలయం వైపున్న ఓ మినార్ పెచ్చులూడి కిందపడ్డాయి.



అధికారులకు అవినాశ్ బెదిరింపులు

- తప్పుడు రిపోర్టుపై బలవంతంగా సంతకాలు
- బెయిల్‌పై ఉండటంవల్లే ఇదంతా చేస్తున్నారు
- సునీతను ఏమైనా చేస్తారేమోనని భయంగా ఉంది
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు



అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్‌పై బయట ఉండగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో న్యాయం జరగదని ఏసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. "మా బాబాయ్ హత్య కేసులో సాక్షులంతా ఒక్కొక్కరుగా చనిపోతున్నారు. న్యాయం కోసం పోరాడుతున్న ఆయన కుమార్తె సునీతారెడ్డికి ఏమైనా అవుతుందేమోనని భయంగా ఉంది" అని ఆమె పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం షర్మిల మీడియాతో మాట్లాడారు. "న్యాయం కోసం పోరాడుతున్న సునీతకు అండగా నిలబడతా. ఈ కేసు ఆమె ఎంతో పెద్దవాళ్లను ఎదుర్కొంటోంది. అందుకే నేను ఆమె పక్కనే నిలబడ్డా. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సునీతారెడ్డికి న్యాయం జరుగుతుందా? ఆమె ప్రాణాలకు భద్రత ఉందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై ప్రభుత్వ అఫిడవిట్‌లో పలు అంశాలు ఉన్నాయి. దర్యాప్తు అధికారులను అవినాశ్‌రెడ్డి తన ఇంటికి పిలిపించి బెదిరించారని ఆ అఫిడవిట్‌లో ఉంది. వివేకానందరెడ్డిని సునీత, ఆమె భర్త కలసి హత్య చేసినట్లుగా తప్పుడు రిపోర్టు తయారుచేసి దానిపై అధికారులతో సంతకాలు అవినాశ్ సంతకాలు చేయించినట్టు అందులో ఉంది. అవినాశ్‌రెడ్డి బెయిల్ మీద బయట ఉండటం వల్లే సాక్ష్యాలను తారుమారు చేయగలుగుతున్నారు" అని షర్మిల తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల విషయంలో వైసీపీ రాజకీయం చేస్తోందని ఆమె విమర్శించారు. "ఇదంతా బీజేపీ కుట్ర. గతంలోనూ బీజేపీ కోసం ఆ పార్టీ దత్తపుత్రుడు జగన్మోహన్‌రెడ్డి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారు. ప్రవీణ్ పగడాల హత్యకు గురైనట్లుగా ఆధారాలంటే రాజకీయాలకు అతీతంగా క్రిస్టియన్ సమాజంలోని వారెవరైనా సాక్ష్యాధారాలతో నన్ను కలవొచ్చు. డీజీపీకి వాటిని అందజేసి న్యాయ విచారణకు కోరతాం. పాస్టర్ ప్రవీణ్ పగడాల విషయంలో పోలీసులు, మీడియా వాస్తవాలు బయటపెడుతున్నాయనీ, ప్రవీణ్ కుటుంబ సభ్యులు కూడా పోలీసుల దర్యాప్తుపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లుకు సవరణలు తెచ్చి బీజేపీ మరోసారి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. ఇది ముస్లిం మతం మీదనే కాదు, దేశ ఐక్యత మీద, రాజ్యాంగం మీద దాడి అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణ పేరుతో వేధిస్తున్నారు

- వివేకా కేసులో అనుమానితుడు శ్రీనివాసులరెడ్డి భార్య పద్మావతి ఆరోపణ



పులివెందుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విచారణ పేరుతో తన పిల్లలను వేధిస్తున్నారని వివేకా హత్య కేసులో అనుమానితుడిగా ఉండి ఆత్మహత్య చేసుకున్న కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి భార్య పద్మావతి ఆరోపించారు. వివేకా హత్యకేసులో ఇప్పటికే కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గంగాధర్, అభిషేక్‌రెడ్డి, జగన్ కారు డ్రైవర్ నారాయణ మరణించగా, ఇటీవల వాచ్‌మాన్ రంగన్న కూడా అనుమానాస్పద రీతిలో మరణించారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం.. సిట్‌ను నియమించిన విషయం తెలిసిందే. సిట్ బృందం వీరందరి మరణాలపై విచారణ చేపడుతోంది. ఇందులో భాగంగా కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి మేనల్లుళ్లు, బావమరిదిని ఇటీవల రెండుసార్లు పోలీసులు కడప, పులివెందులకు పిలిచి విచారించారు. ఈ విషయంలో పోలీసుల తీరును పద్మావతి ఖండించారు. 'వివేకా కేసులో నా భర్తను మొదట నిందితుడిగా పేర్కొన్నారు. ఆ తర్వాత అనుమానితుడిగా తేల్చారు. ఆయన 2019లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆ రోజు సీఐ శ్రీరామ్ పిలిస్తే విచారణకు వెళ్లి, సాయంత్రానికి వచ్చి, పొలంలో ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీరామ్ తనను బెదిరించారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. సీఐ శ్రీరామ్‌పై నా భర్త చేసిన ఆరోపణలపై ఆరేళ్లయినా విచారణ చేయలేదు. కానీ, నా భర్తను బతికించుకోవాలని ఆస్పత్రికి తీసుకెళ్లిన మేనల్లుళ్లు, బావమరిదిని సిట్ అధికారులు పిలిపించి ఇబ్బంది పెడుతున్నారు." అని పద్మావతి ఆరోపించారు.

నీలి నింగిలో...



మిథున్‌రెడ్డికి చుక్కెదురు

- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత
- దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది
- పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చలేదు
- అరెస్టుపై ఆందోళన అక్కర్లేదు: హైకోర్టు



అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంపై సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, రికార్డులను పరిశీలిస్తే ఈ దశలో ఆయనపై ఎలాంటి నేరారోపణలూ లేవని తెలిపింది. ఖజానాకు రూ.వేల కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తు అధికారి కూడా తన ముందున్న సమాచారం సరైనదా? కాదా? అని ఇంకా పరిశీలించుకోవాల్సి ఉందని పేర్కొంది. 'దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది, ఈ దశలో అరెస్ట్ చేస్తారనే ఆందోళన అవసరం లేదు' అని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదని పేర్కొంది. పోలీసుల చర్యలపై ఏమైనా అభ్యంతరం ఉంటే చట్టపరంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు తీర్పు చెప్పారు. మద్యం కుంభకోణంపై గతేడాది సెప్టెంబరు 23న సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం నిర్ణయం వెల్లడించారు. ఈ కేసులో మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేరిస్తే కోర్టును ఆశ్రయించేందుకు వీలుగా వారం ముందు నోటీసులు ఇచ్చేలా సీఐడీని ఆదేశించాలన్న సీనియర్ న్యాయవాది అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

తీర్పులో ఏముందంటే...

'అస్పష్టమైన, సాధారణ ఆరోపణల ఆధారంగా ముందస్తు బెయిల్ మంజూరు చేయలేం. ఇలాంటివి అనుమతిస్తే ముందస్తు బెయిల్ పిటిషన్లు వరదలా వచ్చి పడతాయి. పిటిషనర్‌పై నిర్దిష్ట ఆరోపణలు లేవు. నిందితుడిగా కూడా చేర్చలేదు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడు' అని తీర్పులో పేర్కొన్నారు.

పరిటాల రవి హత్య వెనుక జగన్ హస్తం

- కారు, సూట్ కేసు బాంబుల గురించి ఆయనకు బాగా తెలుసు: ఎమ్మెల్యే సునీత



అనంతపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర హత్య వెనుక వైసీపీ అధినేత, జగన్ హస్తం ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో జగన్‌ను సీబీఐ విచారించిందని గుర్తుచేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి ఘటన నేపథ్యంలో జగన్ అనంతపురం జిల్లాకు వస్తుండటంపై ఆమె తీవ్రస్థాయిలో స్పందించారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన అనుకోని సంఘటనలో లింగమయ్య చనిపోవడం బాధాకరమని, ఆ ఘటన తమ కుటుంబాన్ని ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ మంగళవారం జిల్లాకు వస్తానంటున్నారు. నా సూచన ఏమిటంటే.. మంగళవారం కాకుండా శుక్రవారం వస్తే ఆయనకు అచ్చొస్తుంది' అని ఎద్దేవా చేశారు. జగన్‌కు కారు, సూట్‌కేసు బాంబుల గురించి బాగా తెలుసని, అప్పట్లోనే పరిటాల రవిని హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. పరిటాల రవి హత్య వెనుక జగన్ హస్తం ఉందని పునరుద్ఘాటించారు. 'జిల్లాలో 45 మందిని పొట్టన పెట్టుకున్న చరిత్ర మీకు ఉంది. జిల్లాకు వచ్చే ముందు వాటికి సమాధానం చెప్పి జిల్లాలో అడుగుపెట్టాలి' అని జగన్‌ను డిమాండ్ చేశారు. 'ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకు వస్తున్నారా.. మా ప్రాంతం ప్రశాంతంగా ఉండటం మీకు ఇష్టం లేదా..?' అని నిలదీశారు. ఒక్క లింగమయ్య కుటుంబమే కాదు... జగన్ పరామర్శించాల్సిన బాధితులు చాలామందే ఉన్నారని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తోపుదుర్తి సోదరులు సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలకు బలైన బాధిత కుటుంబాలు అనేకం ఉన్నాయని.. వారందరినీ జగన్ పరామర్శించాలని సూచించారు. అందుకే జిల్లాకు వచ్చేటప్పుడు సూట్‌కేసు నిండా దుస్తులు పెట్టుకొని రావాలని అన్నారు. ఒక్క గ్రామంలో జరిగిన సంఘటను ఫ్యాక్షన్‌గా చిత్రీకరించి పరామర్శించేందుకు జిల్లాకు వస్తున్నారని, ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే అంశాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు.

ఎవరి పేరు చెప్తారో.. ఏంటో?

7, 8 తేదీల్లో విచారణకు హాజరుకానున్న గుంటూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి

రఘురామ ఒంటిపై గాయాలు లేవని తప్పుడు ధ్రువీకరణ.. ఎవరు ఒత్తిడి చేశారో పేర్లు చెబుతారని నేతల్లో ఆందోళన



గుంటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి ఈ నెల 7, 8 తేదీల్లో విచారణకు హాజరుకావాల్సి ఉంది. దీంతో రఘురామ ఒంటిపై గాయాల విషయంలో తప్పుడు ధ్రువీకరణపత్రం జారీచేయడంపై ఎవరి పేరు చెబుతారోనని నాడు ఆమెను ఒత్తిడి చేసిన నేతలు కలవరపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సమయంలో వైసీపీ ఎంపీగా ఉన్న ఓ నేతతో ఆమె భర్త రవికుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఆయన పేరు చెప్పే అవకాశం లేదని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆ నేత కూటమి తరఫున ఎంపీగా ఉన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇవ్వటంలో ఆయన ఒత్తిడి కూడా ఉందని అప్పట్లో ప్రచారం జరిగింది. ఇదే సమయంలో నాడు షాడో సీఎంగా చెలామణీ అయిన ప్రభుత్వ సలహాదారు నుంచి కూడా ఆమెకు ఫోన్‌కాల్స్ వచ్చాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దీంతో ప్రభావతి 'ఆయన' పేరు చెప్పినా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాడు రఘురామను కొట్టించడమే కాకుండా.. వీడియో కాల్‌లో ఆ దృశ్యాలను నేరుగా తిలకించి, ఆనందించారనే అభియోగం కూడా ఆ వైసీపీ కీలక నేతపై ఉంది. ఈ కేసులో ఏ5గా నిందితురాలుగా ఉన్న ప్రభావతి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. అయితే ఆమె విచారణకు సహకరించటం లేదని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 7, 8 తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరై, విచారణకు సహకరించాలని ప్రభావతిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నాటి వైసీపీ ప్రభుత్వంపై తనకున్న మమకారంతో రఘురామ ఒంటిపై గాయాలు ఉన్నా కూడా.. లేవని సూపరింటెండెంట్ హోదాలో తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇవ్వటంలో ప్రభావతి కీలకపాత్ర పోషించారనే ఆరోపణతో కేసు నమోదైంది. ఈ కేసులో మాజీ సీఎం జగన్‌పైనా నగరంపాలెం పోలీ స్స్టేషన్‌లో కేసు నమోదైంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టు విషయంలో సహకరించిన వైసీపీ పెద్దల రుణం తీర్చుకునేందుకు దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి ప్రభావతి చిక్కుల్లో చిక్కుకున్నారని, ఆ తప్పు ఇప్పుడు వెంటాడుతోందనే ప్రచారం జరుగుతోంది.

7 నుంచి వైద్య సేవలు బంద్!

- నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను ఈ నెల 7నుంచి నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టిందని, దీనివల్ల తాము దుర్భర పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. బకాయిల విడుదల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు అనేకసార్లు విన్నవించామని, లిఖిత పూర్వకంగానూ కోరామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కానీ మందులు, సర్జికల్ ఐటమ్స్ సరఫరా చేయలేమని ఆయా కంపెనీలు చేతులెత్తేస్తున్నాయని చెప్పారు. వైద్యులు, సిబ్బందికి 2నెలలుగా జీతాలు నిలిపివేశామని చెప్పారు. దీనిపై గతనెల 7నే ట్రస్టుకు లేఖ రాశామని, ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని తెలిపారు. బకాయిలు విడుదల చేయాలంటూ గతేడాది జూలై నుంచి ప్రభుత్వానికి 26 సార్లు లేఖలు రాశామన్నారు. 2025-26 బడ్జెట్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి రూ.4వేల కోట్లు కేటాయించగా, బకాయిలే రూ.3,500కోట్లు ఉన్నాయన్నారు. కనీసం రూ.1,500కోట్లు చెల్లిస్తే తప్ప సేవలు కొనసాగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆశా కార్యదర్శి డాక్టర్ అవినాశ్ మాట్లాడుతూ బీమా విధానంలోకి మారే క్రమంలో ఆయుష్మాన్ భారత్‌తో పథకాన్ని ఇంటిగ్రేట్ చేస్తామని అంటున్నారని, ఆయుష్మాన్ భారత్‌లోని 1,500 ప్రొసీజర్లు ఎన్టీఆర్ వైద్యసేవ కంటే తక్కువ ప్యాకేజీల్లో ఉన్నాయని తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణలో ఏపీ భేష్

- 17వ స్థానం నుంచి ఏడో స్థానానికి రాష్ట్రం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పనితీరును బాగా మెరుగుపర్చుకుని 7వ స్థానానికి చేరుకుంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) గురువారం రాష్ట్రాల పనితీరు సూచీని విడుదల చేసింది. 2024 ఏప్రిల్- డిసెంబరు మధ్య ఏపీసాక్స్ మెరుగైన పనితీరును కనబరిచి ఈ సూచీలో 7వ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది వరకూ ఏపీ 17వ స్థానంలో ఉండేది. ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించడంలో ఏపీకృషిని న్యాకో అభినందించింది. 2004 నుంచి ఏపీలో దాదాపు 2,25,000మంది బాధితుల్ని గుర్తించడంతో పాటు వ్యాధి నియంత్రణకు రూ.127 కోట్లు న్యాకో ఖర్చుచేసింది. న్యాకో లక్ష్యాలకు అనుగుణంగా ఎయిడ్స్‌ను నియంత్రించడంలో ఏపీ మంచి పనితీరు కనబరిచినందుకు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరిని, ఏపీశాక్స్ సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు.

ఎండలు.. పిడుగులు!

- రాష్ట్రంలో మరో రెండ్రోజులు భిన్నవాతావరణం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రెండు రోజులు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఎండలు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురవొచ్చని హెచ్చరించింది. శుక్రవారం అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో పాటు మోస్తరు వర్షాలు, శనివారం అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. మిగిలిన చోట్ల 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది.

నా ముందువాళ్లు చేసిందే నేనూ చేశా!



గురువారం గుంటూరులోని ఏసీబీ కార్యాలయంలోకి వెళ్తున్న తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి

- నాది తప్పయితే వారిదీ తప్పే
- రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా మాతృసంస్థకు తిరిగి వెళ్లే హక్కు నాకుంది
- ఏసీబీకి తుమ్మా విజయకుమార్‌రెడ్డి జవాబు
- రెండో రోజూ సుదీర్ఘంగా విచారణ
- నేడు కూడా హాజరు కావాలని నోటీసులు!

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాకు, వైసీపీ కూలి మీడియాకు రూ.వందల కోట్లను ప్రభుత్వ ప్రకటనల రూపంలో దోచిపెట్టిన వ్యవహారంపై సమాచార, పౌరసంబంధాల (ఐ అండ్ పీఆర్) మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిని ఏసీబీ అధికారులు వరుసగా రెండో రోజు కూడా సుదీర్ఘంగా విచారించారు. బుధవారం 8 గంటలకుపైనే ఆయన్ను ప్రశ్నించగా.. గురువారం కూడా అదే పరిస్థితి. ఉదయం 10.15 గంటలకు ఆయన ఏసీబీ కార్యాలయానికి రాగా.. గుంటూరు ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర సారథ్యంలో రాత్రి 7 గంటల వరకు విచారణ కొనసాగింది. రూ.839 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం వ్యవహారంలో పలు ప్రశ్నలకు దాటవేత ధోరణిలోనే ఆయన జవాబులిచ్చినట్లు సమాచారం. ఏబీసీ నిబంధనలకు విరుద్ధంగా పక్షపాత ధోరణితో ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో జగన్ మీడియాకు, వైసీపీ ప్రభుత్వ అనుకూల మీడియాకు దోచిపెట్టడం తప్పు కాదా అని ఏసీబీ అధికారులు అడిగారు. 'నాకంటే ముందు పని చేసిన ముగ్గురు సీనియర్ అధికారులు ఏం చేశారో నేను కూడా అదే చేశా. 2014 నుంచి వారు ఎలా చేస్తే నేనూ అలాగే చేశా. వారిది తప్పయితే నాది కూడా తప్పే. అసలు అలా చేయడం తప్పని నాకు తెలియదు' అని ఆయన చెప్పడంతో ఏసీబీ అధికారులు విస్మయానికి గురయ్యారు. ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ.. ప్రభుత్వం మారిన వెంటనే ఎటువంటి అనుమతి లేకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా, ఆయా రికార్డులు ప్రభుత్వానికి అప్పజెప్పకుండా నేరుగా కేంద్ర (మాతృ) సర్వీసులకు ఎలా వెళ్తారని ప్రశ్నించగా.. ఆ విధంగా వెళ్లే హక్కు తనకుందని ఏమాత్రం తడబాటు లేకుండా ఆయన సమాధానమిచ్చినట్లు తెలిసింది. మూడోరోజు శుక్రవారం కూడా విచారణకు రావాలని ఏసీబీ అధికారులు ఆయనకు చెప్పారు. అయితే వ్యక్తిగత పనులు ఉన్నాయని, తదుపరి విచారణకు కొంత సమయమివ్వాలని ఆయన కోరగా.. వారు అంగీకరించలేదని తెలిసింది. ఇప్పటికే ఈ కేసు విచారణలో చాలా జాప్యం జరిగిందని, ఇక ఏమాత్రం ఆలస్యం చేసే అవకాశం లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అనంతరం శుక్రవారం హాజరు కావాలని ఆయనకు వారు నోటీసులిచ్చినట్లు తెలిసింది.

వంశీకి భూకబ్జాలు హాబీ

- కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- ఆయన ముందస్తు బెయిల్‌కు అనర్హుడు
- భూకబ్జా కేసులో న్యాయవాది బెనర్జీ వాదనలు
- తదుపరి విచారణ 8కి వాయిదా
- బెయిల్ కోసం హైకోర్టులో వంశీ పిటిషన్



విజయవాడ/ గన్నవరం/ అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): "మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి భూములు కబ్జా చేయడం ఒక హాబీ. ఆయన కొండలు కొల్లగొట్టాడు. కాల్వగట్లను గుల్ల చేశాడు. చివరికి పేదలకు నకిలీ పట్టాలు పంపిణీ చేశాడు. దీనికోసం తన కార్యాలయంలో ఒక ప్రెస్‌ను నడిపాడు" అని సీనియర్ న్యాయవాది కిలారు బెనర్జీ కోర్టుకు వివరించారు. గన్నవరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో సుంకర సీతామహాలక్ష్మికి చెందిన ఆస్తిని వంశీ అనుచరులు బెదిరించి వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారంటూ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ1గా ఉన్న వంశీ ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విజయవాడలోని 12 అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. సీతామహాలక్ష్మి తరఫున బెనర్జీ వాదనలు వినిపించారు. వంశీ దాఖలు చేస్తున్న పిటిషన్ల తీరు న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న విషయాన్ని గోప్యంగా ఉంచి ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారన్నారు. వంశీ బయట ఉన్నట్టు, ఆయన్ను అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు పిటిషన్‌లో పేర్కొన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ముందస్తు బెయిల్‌కు అనర్హుడు అని చెప్పారు. వంశీ చరిత్ర మొత్తం నేరమయమన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక భూకబ్జాలు చేశారన్నారు. 1,200 నకిలీ పట్టాలు ముద్రించడానికి ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రెస్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు కొంతమంది బాధితులు నూజివీడు కోర్టులో సాక్ష్యం చెప్పారన్నారు. సూరపునేని అనిల్‌కుమార్ అనే వ్యక్తి వంశీకి ప్రధాన అనుచరుడిగా ఉన్నాడన్నారు. సీతామహాలక్ష్మిని బెదిరించి ఆస్తిని అతడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. తర్వాత దాన్ని చట్టబద్ధం చేయడానికి మరో ఇద్దరి పేరు మీద రిజిస్ట్రేషన్లు చేయించారన్నారు. సీతామహాలక్ష్మి భర్త హైకోర్టు న్యాయవాదిగా ఉన్నారని, న్యాయవాది ఆస్తికే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల ఆస్తులకు ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. ఇక వంశీ తరఫున న్యాయవాది విదేవీసత్యశ్రీ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు 8కి వాయిదా వేశారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై గన్నవరం కోర్టు తీర్పు నేడు

తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి భూమిని మరొకరికి విక్రయించారంటూ ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో బెయిల్ కోసం వంశీ గన్నవరం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై వంశీ తరఫు న్యాయవాది సత్యశ్రీ, ప్రాసిక్యూషన్ తరఫున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కళ్యాణి కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువురు వాదనలు విన్న న్యాయాధికారి... తీర్పును శుక్రవారానికి రిజర్వు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెయిల్ కోసం హైకోర్టులో వంశీ పిటిషన్

వంశీ బెయిల్ పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు.

కాకాణి నేరానికి ఆధారాలున్నాయి

- ఎస్సీ,ఎస్టీ చట్టం కింద నమోదైన కేసు ఇది
- హైకోర్టుకు నేరుగా రావడానికి వీలులేదు
- ముందస్తు బెయిల్ ఇవ్వాల్సింది ప్రత్యేక కోర్టే
- వాదనలు వినిపించిన ఏజీ దమ్మాలపాటి
- విచారణను నేటికి వాయిదావేసిన హైకోర్టు



అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైనందున ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదని పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదనలు వినిపించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముందస్తు బెయిల్ లేక బెయిల్ కోసం ముందుగా సంబంధిత ప్రత్యేక కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. గోవర్ధన్‌రెడ్డి నేరానికి పాల్పడ్డారనేందుకు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. ఎస్సీఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించవచ్చన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనేందుకు సహేతుకమైన కారణాలు ఉన్నందున, మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. గురువారం కోర్టు సమయం ముగియడంతో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణార్హతపై పూర్తిస్థాయి వాదనల కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి వేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా అదేరోజుకు వాయిదా వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం, వరదాపురం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి, తరలించారని జిల్లా మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు కాకాణిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

తల్లీచెల్లి మోసం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

సీబీఐ, ఈడీ కేసుల్లో భాగంగా ఈడీ ఆస్తులను అటాచ్ చేసింది. సదరు అటాచ్‌మెంట్లపై హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి) విధించింది. సదరు ఆస్తులన్నీ విడుదలయిన తర్వాత షేర్లు గిఫ్ట్‌గా ఇస్తానని ఒప్పందం చేసుకున్న మాట వాస్తవం. ఒప్పందంపై సంతకం పెట్టలేదని నేను వాదించడం లేదు. సంతకం పెట్టాను. కానీ ఒప్పందంలోని షరతులకు విరుద్ధంగా తల్లి, చెల్లి వ్యవహరించారు. షేర్ల పత్రాలు, షేర్ల బదిలీ పత్రాలు ఇప్పటికీ నా వద్దే ఉన్నాయి. భౌతికంగా గిఫ్ట్ ఇచ్చేవారి నుంచి తీసుకునే వారికి అది చేరినప్పుడు చట్ట ప్రకారం గిఫ్ట్ డీడ్ పూర్తవుతుంది. అసలు నేను గిఫ్ట్ ఇవ్వలేదు. బహుమతి నావద్దే ఉంది. ప్రస్తుతం బహుమతి ఇచ్చే ఉద్దేశం నాకు లేదు. నా తల్లి విజయలక్ష్మి పేరిట సరస్వతీ పవర్ షేర్ల బదిలీ అక్రమం. నా తల్లి చెల్లి పట్ల పక్షపాతం చూపిస్తోంది. నా తల్లి, చెల్లిపై ప్రేమ, అభిమానాలు పోయాయి. అందుకే షరతులతో కూడిన ఎంవోయూను, గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసుకున్నాను. ఈ పరిస్థితుల్లో షేర్ల బదిలీ ప్రశ్నే తలెత్తదు. నాకు తెలియకుండా సరస్వతీ పవర్ బోర్డు బదిలీ తీర్మానం ఎలా ఆమోదిస్తుంది? అలాగే ప్రస్తుత కేసులో ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని చెల్లి అప్లికేషన్ దాఖలు చేశారు. ఎంవోయూలో ఆమె భాగస్వామి అయినప్పుడు ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని ఎలా కోరుతారు? ఎంవోయూ షరతులతో కూడినప్పుడు గిఫ్ట్ డీడ్ కూడా షరతులతో కూడినదే. షరతులు ఉల్లంఘించారు కాబట్టి వాటిని రద్దు చేసుకుంటున్నాను' అని జగన్ తరఫున నిరంజన్ రెడ్డి తెలిపారు. తదుపరి విచారణ మే 7కు వాయిదా పడింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.